తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

RNI NO.TELTEL / 2013 /50370

శనివారం 01.02.2025 | సంపుటి : 11 సంచిక : 203 | పేజీలు : 12 వెల: రూ. 4/-

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698






## మూడో ఆర్థికశక్తిగా ఎదుగుతున్నాం

- సామాజిక, ఆర్థిక, రాజకీయ సుస్థిరతతో ఆదర్శం
- వికసిత భారత్ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం
- మూడో టర్మ్‌లో మూడురెట్ల వేగంతో అభివృద్ధి
- స్వయంసమృద్ధి,స్వావలంబన దిశగా దేశం పురోగతి
- 3కోట్ల మంది పేదలకు ఇల్లు నిర్మించబోతున్నాం
- కృత్రిమ మేధ రంగంలో 'భారత ఏఐ మిషన్'
- ఉభయసభలనుద్దేశించి రాష్ట్రపతి ముర్ము ప్రసంగం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**సామాజిక, ఆర్థిక, రాజకీయ సుస్థిరతలో ఈ ప్రపంచానికి భారత్ ఆదర్శంగా నిలిచిందని, మన ముందున్న ఏకైక లక్ష్యం.. 'వికసిత్ భారత్' నిర్మాణమే..అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ప్రపంచంలోనే భారత్‌ను మూడో ఆర్థిక శక్తిగా నిలపనున్నట్లు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. దేశాభివృద్ధి ఫలాలు అందరికీ అందాలన్నదే తమ ఉద్దేశమని చెప్పారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం సందర్భంగా ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ముర్ము ప్రసంగించారు. భారత సామాజిక చేతనకు మహాకుంభమేళా నిదర్శంగా నిలుస్తోందన్నారు. దేశాభివృద్ధి కోసం వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నట్లు చెప్పారు. తమ ప్రభుత్వ మూడో టర్మ్‌లో మూడు రెట్ల వేగంతో అభివృద్ధి సాగుతోందని రాష్ట్రపతి తెలిపారు. ఆరంభంలో ప్రయాగ్ రాజ్‌లోని మహా కుంభమేళాలో జరిగిన తొక్కిస లాట ఘటనపై రాష్ట్రపతి విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. ఇటీవలే తుదిశ్వాస విడిచిన మాజీ ప్రధాని మన్మోహన్‌కు మిగతా 2లో..



## వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోండి

**బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అనర్హత శాసనసభ స్పీకర్‌కు సుప్రీంకోర్టు ఆదేశాలు**

**తదుపరి విచారణ వచ్చే వారానికి వాయిదా**

**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వ్యవహారంపై సుప్రీంకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ జార్జి మైస్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. హైకోర్టు నాలుగు నెలల్లో ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోవాలని గత ఏడాది మార్చిలో చెప్పినా ఇంత వరకు నిర్ణయం తీసుకోలేదని కౌశిక్ రెడ్డి తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. తగిన సమయంలో స్పీకర్ నిర్ణయం తీసుకోవడం లేదని న్యాయవాది తెలిపారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చామని అసెంబ్లీ కార్యదర్శి తరపు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి.. కోర్టుకు చెప్పారు. నిర్ణయం తీసుకోవడానికి స్పీకర్ ఎమ్మెల్యేలకు తగిన సమయం ఇవ్వాలని గతంలో సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చిందని రోహత్గి గుర్తు చేశారు. "బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపులపై నిర్ణయం తీసుకోవడానికి... మీ దృష్టిలో తగిన సమయం అంటే ఎంత? రీజనబుల్ టైమ్ అంటే.. మహారాష్ట్ర తరహాలో శాసనసభ గడువు ముగిసేవరకా?" మిగతా 2లో..

# విద్యకు 15శాతం నిధులు



## ఇది పెట్టుబడి కాదు.. భవిష్యత్‌కు పునాది: సీఎం రేవంత్

- అందుకే విద్యాశాఖను నా దగ్గరే ఉంచుకొని నిత్యం పర్యవేక్షిస్తున్నా
- గత ప్రభుత్వం విద్యావ్యవస్థను తీవ్ర నిర్లక్ష్యం చేసింది
- మా ప్రభుత్వం 55 రోజుల్లోనే డీఎస్సీ నియామక ప్రక్రియ పూర్తి చేసింది
- 21వేల మందికి ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాం
- ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను భారాస అప్పులకుప్పగా మార్చింది
- మొగిలిగిద్ద ప్రభుత్వ ఉన్నత పాఠశాల వార్షికోత్సవంలో సీఎం రేవంత్

**మొగిలిగిద్ద(జనంసాక్షి):** రాష్ట్ర బడ్జెట్‌లో రూ.21వేల కోట్లు విద్యాశాఖ కోసం కేటాయించామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. 150 ఏళ్లు పూర్తి చేసుకున్న రంగారెడ్డి జిల్లా మొగిలిగిద్ద ప్రభుత్వ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొగిలిగిద్దకు దాదాపు రూ.16 కోట్లు నిధులు మంజూరు చేసినట్టు చెప్పారు. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ మంజూరు చేస్తున్నట్టు సీఎం ప్రకటించారు. గత ప్రభుత్వ హయాంలో టీచర్ నియామకాలు జరగలేదు. మా ప్రభుత్వం రాగానే 11వేల టీచర్ పోస్టులు భర్తీ చేశాం. గతంలో నోటిఫికేషన్లు ఇస్తే సంవత్సరాల తరబడి నియామక ప్రక్రియ జరిగేది. మా ప్రభుత్వం 55 రోజుల్లోనే డీఎస్సీ మిగతా 2లో..

### ఉస్మానియా ఆస్పత్రికి సీఎం శంకుస్థాపన

- రెండేళ్ల పూర్తి కానున్న నూతన భవన నిర్మాణం
- రూ. 2400 కోట్లతో 26.3 ఎకరాల్లో 14 అంతస్తుల్లో కట్టడం

**హైదరాబాద్(జనంసాక్షి):**నూతనంగా నిర్మించనున్న ఉస్మానియా ఆస్పత్రికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. గోషామహల్ స్టేడియంలో ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఈరోజు (శుక్రవారం) ఉదయం సీఎం భూమి పూజ చేశారు. మొత్తం 26.3 ఎకరాల విస్తీర్ణంలో నూతన మిగతా 2లో..

### గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం

**నేను ఒంటరిననే భావన వచ్చినప్పుడల్లా ఆయన దగ్గరికి వెళ్లి సలహాలు తీసుకునే వాడిని..**

**రవీంద్రభారతిలో జరిగిన జయంతి కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి** వార్త 2లో



## తెలంగాణలోకి 'గులియన్ బారే సిండ్రోమ్'

సిద్దిపేటకు చెందిన మహిళలో లక్షణాలు

హైదరాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్న వైద్యులు

**హైదరాబాద్(జనంసాక్షి):** దేశంలో గులియన్ బారే సిండ్రోమ్ కలకలం సృష్టిస్తోంది. ఈ కేసులు పెరుగుతుండడం భయాందోళనలను రేకెత్తిస్తోంది రాష్ట్రంలో తొలి గులియన్ బారే సిండ్రోమ్(జీబీఎస్) కేసు నమోదైంది. హైదరాబాద్‌లో జీబీఎస్ కేసును వైద్యులు గుర్తించారు. మిగతా 2లో..

## బడ్జెట్‌లో పేదలకు మేలు జరుగుతుందా?

సమావేశాలకు ప్రతిపక్షాలు సహకరించాలి

మీడియాతో ప్రధాని మోడీ ఆకాంక్ష



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** తనకు సొంతిల్లు లేదని, కానీ ప్రతి పేద కుటుంబానికి ఇల్లు ఉండాలన్నది తన కల అని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. తన రాజకీయ ప్రయోజనాలు నెరవేర్చుకోవడానికి ఆమ్‌ఆద్మీపార్టీ దేశ రాజధానిని ఒక ఏటీఎంలా మార్చిందని విమర్శించారు.అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో దిల్లీలోని ద్వారకా ప్రాంతంలో మోదీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆప్‌పై విమర్శలు గుప్పించారు. "నాకు సొంతిల్లు లేకపోయినా.. ప్రతి పేదవాడికి కాంక్రీట్ ఇల్లు ఉండాలన్న కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాన్ని ఆప్ అడ్డుకుంటోంది. దిల్లీలో పేదల కోసం కేంద్రం నిర్మించిన ఇళ్లను ఆప్ కేటాయించడం లేదు. కోట్ల రూపాయలతో శీష్‌మహల్‌ను నిర్మించుకున్నవారికి ఈ పేదల బాధ అర్థంకాదు. పేదల సొంతిల్లు కలను తీర్చేందుకు ఇక్కడ భాజపా ప్రభుత్వం ఏర్పడాలి" అని మోదీ అన్నారు. "మేము దిల్లీలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన వెంటనే ఆప్ అవినీతిపై చర్యలు తీసుకుంటాం. దోపిడీకి పాల్పడిన వారిని జవాబుదారీ చేస్తాం. వారు తీసుకున్న వాటిని వెనక్కి రప్పిస్తాం. అసెంబ్లీ మొదటి సెషన్‌లోనే కాగ్ నివేదికను సమర్పిస్తాం. అది ఆప్ సర్కార్ కుంభకోణాలను బయటపెడుతుంది" అని వ్యాఖ్యానించారు. దేశాన్ని పాలించే అవకాశాన్ని తనకు ప్రజలు పలుమార్లు మిగతా 2లో..

### ప్రతి పేద కుటుంబానికి సొంతిల్లు

అదే నా కల.. • ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో మోదీ 2లో

## జయ ఆస్తులు తమిళనాడు సర్కారుకే..

**బెంగళూరు (జనంసాక్షి):** దివంగత ముఖ్యమంత్రి జె.జయలలిత ఆస్తిని తమిళనాడు ప్రభుత్వానికి అప్పగించేందుకు బెంగళూరులోని ప్రత్యేక న్యాయస్థానం చర్యలు చేపట్టింది. ఫిబ్రవరి 14, 15వ తేదీల్లో వాటిని అప్పగించాలని ప్రత్యేక న్యాయస్థానంలో న్యాయమూర్తి హెచ్.ఎ.మోహన్ అధికారులను ఆదేశించారు.జయలలితకు చెందిన 1,562 ఎకరాల భూమికి సంబంధించిన పత్రాలు, 27 కిలోల బంగారు, వజ్రాభరణాలు, పది వేలకు పైగా చీరలు, 750కి పైగా జతల చెప్పులు, గడియారాలు, ఇతర వస్తువులను కర్ణాటక ప్రభుత్వం మిగతా 2లో..



## ఫాంహౌజ్‌లో ఉండి మాట్లాడుడు కాదు

**అసెంబ్లీకి వస్తే అసలు విషయాలు తెలుస్తాయి**

**ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి**



**మొగిలిగిద్ద(జనంసాక్షి):** ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను భారాస అప్పుల రాష్ట్రంగా మార్చిందని సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. రంగారెడ్డి జిల్లా మొగిలిగిద్ద ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం ప్రసంగించారు. "రూ.7లక్షల కోట్లు అప్పు చేసి 2023లో మాకు అప్పగించారు. గత ప్రభుత్వం రూ.18వేల కోట్లే రుణమాఫీ చేసింది. గత ప్రభుత్వం చేసిన రుణమాఫీ వడ్డీలకే సరిపోయింది. మేం అధికారంలోకి వచ్చిన 60 రోజుల్లోనే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేశాం. రుణమాఫీ చేయలేదంటున్న కేసీఆర్ అసెంబ్లీకి వస్తే లెక్కలు చెబుతాం. ఫామ్‌హౌస్‌లో ఉండి సోది చెప్పటం కాదు.. అసెంబ్లీకి రండి.. లెక్కలు చెబుతాం. ఏ గ్రామంలో ఏ రైతుకు ఎంత రుణమాఫీ చేశామో శాసనసభలో పెడతాం. కేసీఆర్‌కు చిత్తశుద్ధి, నిజాయతీ ఉంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలి. రైతు భరోసా మిగతా 2లో..

## నాది గంభీర మౌనం

### నేను కొట్టే దెబ్బ మామూలుగా ఉండదు

- ఏడాదిలో రేవంత్ సర్కారు విఫలం..- ప్రాజెక్టుల్లో పురోగతి లేదు
- రైతు భరోసా ఇస్తారో.. లేదో. ఇచ్చినా కూడా మోసమే..
- రాష్ట్రాన్ని కైలాసంలో పెద్దపాము మింగినట్లైంది. తెలంగాణకు ఇదో గుణపాఠం
- భారాస నేతలు, కార్యకర్తల సమావేశంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్



**గజ్వేల్(జనంసాక్షి):** తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. జహీరాబాద్ నియోజకవర్గ భారాస నేతలు, కార్యకర్తలతో ఆయన తన ఫామ్‌హౌస్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రాజెక్టులకు సంబంధించి ఎలాంటి పురోగతి లేదని దుయ్యబట్టారు. "రాష్ట్రాన్ని కైలాసంలో పెద్దపాము మింగినట్లైంది. తెలంగాణకు ఇదో మంచి గుణపాఠం. కొందరు అత్యాశకు పోయి చెప్పుడు మాటలు విని మోసపోయారు. రైతు భరోసా ఇస్తారో.. లేదో. ఇచ్చినా కూడా మోసమే.. ఎన్నికల కోసమే ఇస్తారు. రాష్ట్ర ఆదాయం భారీగా పడిపోయింది. భారాస హయాంలో ఆదాయం ఏటా పెరిగితే ఇప్పుడు పడిపోయింది. రూ.13 వేల కోట్ల ఆదాయం పడిపోయిందని కాగ్ నివేదిక స్పష్టం చేసింది. పరిస్థితులు ఇంకా దారుణంగా తయారవుతాయి. మరో నాలుగు నెలల గడిస్తే జీతాలు ఇవ్వలేని పరిస్థితి వస్తుంది. భూముల ధరలు బాగా పడిపోయాయి, రియల్ ఎస్టేట్ రంగం దెబ్బతింది.గురుకులాల్లో పురుగుల అన్నం పెడుతున్నారని తల్లిదండ్రులు పిల్లల్ని తీసుకెళ్తున్నారు. మళ్లీ పాత కాంగ్రెస్ మోపైంది. విద్యుత్ కోతలు ఉన్నాయి, తాగునీరు సరిగా రావడం లేదు. సాగునీటి మిగతా 2లో..

## కుంభమేళాకు వెళ్లి వస్తూ యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం

**ఆరుగురి మృతి**

**ఘాజీపూర్(జనంసాక్షి):**ఉత్తరప్రదేశ్‌లోని ఘాజీపూర్‌లో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ఓ ట్రక్కు అదుపుతప్పి భక్తులతో వెళ్తున్న వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమయంలో వాహనంలో 20 మంది ఉన్నట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న నంద్‌గంజ్ పోలీసులు, స్థానికులతో కలిసి సహాయక చర్యలు చేపట్టారు.క్షతగాత్రులను ఘాజీపూర్ మిగతా 2లో..

## డాలర్‌ను పక్కనపెడితే తీవ్రపరిణామాలు..

### బ్రిక్స్ దేశాల తీరుపై ట్రంప్ తీవ్ర అసహనం

**న్యూయార్క్(జనంసాక్షి):**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బ్రిక్స్ దేశాల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. అంతర్జాతీయ వాణిజ్యంలో యూఎస్ డాలర్ కు ప్రత్యామ్నాయం చూసుకుంటే బ్రిక్స్ దేశాల ఎగుమతులపై 100 శాతం సుంకాలు విధిస్తానని హెచ్చరించారు. యూఎస్ డాలర్‌ను పక్కనపెడితే ప్రపంచ దేశాలు తీవ్ర ఆర్థిక పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని ఇప్పటికే ఆయన పలుమార్లు పేర్కొన్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ట్రంప్ మాట్లాడుతూ బ్రిక్స్ దేశాల ఐడియాను చూస్తూ కూర్చునే సమయం ముగిసిపోయిందన్నారు. డాలర్‌కు బదులుగా బ్రిక్స్ దేశాలు మరో కరెన్సీని సృష్టించలేవన్నారు. ఒకవేళ వారు డాలర్‌ను వదులుకుంటే అద్భుతమైన యూఎస్ ఎకానమీలో అమ్మకాలకు గుడ్‌బై చెప్పి.. ఆయా దేశాలు ప్రయోజనం పొందడానికి మరో దేశాన్ని ఎన్నుకోక తప్పదని ట్రంప్ పేర్కొన్నారు. శక్తిమంతమైన అమెరికా డాలర్‌కు బదులుగా బ్రిక్స్ దేశాలు ఉమ్మడి కరెన్సీని మిగతా 2లో..



## ఎన్నికలు సమీపిస్తున్న వేళ..

## ఆమ్ ఆద్మీకి భారీ షాక్

**ఏడుగురు ఆప్ ఎమ్మెల్యేలు జంప్‌జిలానీ**



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**మరో ఐదు రోజుల్లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనున్న వేళ దిల్లీలో కేజ్రీవాల్‌కు గట్టి షాక్ తగిలింది. భాజపాతో నువ్వా నేనా అన్నట్లుగా పోటీ నెలకొన్న అత్యంత కీలక సమయంలో ఏడుగురు ఎమ్మెల్యేలు ఆమ్ ఆద్మీ పార్టీని వీడారు. పార్టీలో తమ ప్రాథమిక సభ్యత్వాలకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఎమ్మెల్యేలు భావనా గౌర్, మదన్‌లాల్ కేజ్రీవాల్‌పైనా, పార్టీపైన విశ్వాసం కోల్పోయినట్లు తెలిపారు. ఈ మేరకు ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు లేఖలు పంపారు. 'మీ పట్ల, పార్టీ పట్ల విశ్వాసం కోల్పోయాను. అందువల్లే ఈ నిర్ణయం తీసుకున్నా. దయచేసి నా రాజీనామాను ఆమోదించండి' అని కేజ్రీవాల్‌కు రాసిన లేఖలో భావనా గౌర్ పేర్కొన్నారు. ఆప్‌లో అవినీతి, ఇతర అంశాలను మిగతా 2లో..

## ఈ సారి మందగమనమే..

- దేశ జీడీపీ 6.3-6.8శాతంగా ఉండొచ్చని అంచనా
- ఆర్థిక పరిస్థితులు మరింత మందకొడిగా ఉండే అవకాశం
- నెమ్మదించనున్న తయారీరంగం.. కార్పొరేట్ పెట్టుబడుల్లో క్షీణత
- రబీపంటల దిగుబడిపైనే ఆర్థిక ఊతం ఆధారపడేలా పరిస్థితులు
- బడ్జెట్ పద్దుకు ముందుకు ఆర్థిక సర్వే వెల్లడి



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ..దేశ జీడీపీ 6.3-6.8శాతంగా ఉండొచ్చని, ప్రైవేటు రంగ వినియోగం స్థిరంగా ఉంటుందని ఆర్థిక సర్వే అంచనా వేసింది. వచ్చే ఏడాది ఆర్థిక పరిస్థితులు మందకొడిగా ఉంటాయని అంచనా వేసింది. ఆర్థిక సర్వే ప్రకారం, 2024-25లో దేశీయ ఆర్థిక వ్యవస్థ మందకొడిగా కొనసాగే అవకాశం ఉంది. తయారీ రంగం బలహీన పడటం, కార్పొరేట్ పెట్టుబడులు తగ్గడం వృద్ధి రేటును ప్రభావితం చేస్తోంది. 2024 ఆర్థిక సంవత్సరంలో భారతదేశ జిడిపి 8.2 శాతంగా ఉంటే, కొత్త ఆర్థిక సంవత్సరంలో ఇది 6.4శాతం స్థాయికి తగ్గొచ్చని అంచనా వేసింది. రబీ పంట దిగుబడి బాగుంటే.. 2026 తొలి అర్థభాగంలో ఆహార పదార్థాల ధరలు తగ్గే అవకాశం ఉంటుందని అంటున్నారు. ఖరీఫ్ పంట రావడంతో ఆహార పదార్థాల ధరలు తగ్గాయి. దీంతో 2024-25 నాలుగో త్రైమాసికంలో ఆహార ద్రవ్యోల్బణం తగ్గొచ్చని భావిస్తున్నారు. సమావేశాల్లో మిగతా 2లో..



# సిఎం రేవంత్ రెడ్డితో దేశ్‌పాండే ఫౌండేషన్ సభ్యుల భేటీ

**కస్తూర్బా పాఠశాలలను దత్తత తీసుకోవాలన్న సిఎం**

**హైదరాబాద్(జనంసాక్షి):**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని దేశ్ పాండే ఫౌండేషన్ సభ్యులు కలిసి తాము చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక, ఆర్థిక పరిస్థితుల మార్పు కోసం పని చేస్తున్నట్లు ఫౌండేషన్ సభ్యులు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఆంగ్లంలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచడానికి పనిచేస్తున్న సంస్థ..అని రాష్ట్రంలో తమ కార్యక్రమాల విస్తరణకు ప్రభుత్వ సహకారం కోరారు. రాష్ట్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలల్లో పని చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారికి సూచించారు. మహబూబ్ నగర్ లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను దత్తత తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలకు అంగీకరించిన ఫౌండేషన్ సభ్యులు అందుకు అనుగుణంగా పనిచేస్తామని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీధర్ బాబు ,సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, ఫౌండేషన్ సభ్యులు గురురాజ్ దేశ్ పాండే, జయశ్రీ దేశ్ పాండే, రాజు రెడ్డి, జీ.అనిల్.

## నాది గంభీర మౌనం

ప్రాజెక్టులను పండపెట్టారు. సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాల కోసం పోరాడదాం. ఇప్పుడే కరెంటు కోతలు ఉంటే.. ఏప్రిల్, మే లో ఎలా ఉంటుందో? రాజ్యం అంటే ఇలానే ఉంటుందా? ఏడాది పూర్తయింది.. ఎండగట్టాలని మన వాళ్లు అంటున్నారు. ఫిబ్రవరి నెలాఖరులో భారీ బహిరంగసభ పెట్టి ప్రభుత్వాన్ని ఎండగడదాం. నేను గంభీరంగా, మౌనంగా ఈ ప్రభుత్వాన్ని చూస్తున్నాను. కొడితే మామూలుగా కాదు.. గట్టిగా కొట్టడం నాకున్న అలవాటు.నేను ఎన్నో ప్రభుత్వాలను చూశాను కానీ, ఇలాంటి ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదు. ఏడాదిలోనే ఇంత వ్యతిరేకత కాంగ్రెస్ ప్రభుత్వంపై వచ్చింది. కాంగ్రెస్ వాళ్లు కనిపిస్తే జనాలు కొట్టేలా ఉన్నారు. ఏ ప్రభుత్వం కావాలని కాంగ్రెస్ సోషల్ మీడియాలో ఓటింగ్ పెడితే.. భారాస ప్రభుత్వం కావాలని ఓట్లు వేశారు. తెలంగాణ శక్తి ఏమిటో చూపించి కాంగ్రెస్ మెడలు వంచుదాం. ఫాం హౌస్... ఫాం హౌస్ అని అంటారు. ఇక్కడ అల్లం, ఉల్లిపాయ తప్ప ఏమున్నాయి? కాంగ్రెస్ వాళ్లు ఇక్కడకు వస్తే తలో పార ఇచ్చి తవ్వుకోమందాం. కచ్చితంగా రాబోయేది మన ప్రభుత్వమే. అందులో అనుమానం ఏమీ లేదు" అని కేసీఆర్ అన్నారు.

## ఫాంహౌజ్‌లో ఉండి మాట్లాడుడు కాదు..

ఎగ్గొడతారని కేసీఆర్ చెబుతున్నారు. మీలాగా మాట తప్పే వ్యక్తిని కాదు. దళితులకు 3 ఎకరాల భూమి, దళిత ముఖ్యమంత్రి, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అని అనేక హామీలు ఇచ్చి మాట తప్పిన చరిత్ర కేసీఆర్‌ది. పదేళ్లు పాలించి ప్రజల దగ్గరకు వెళ్తే పార్లమెంట్ ఎన్నికల్లో డిపాజిట్లు కోల్పోయారు. పాలమూరు ప్రాజెక్టులు పూర్తి చేస్తానని హామీ ఇచ్చి.. ఇక్కడి ప్రాజెక్టులను పండబెట్టారు" అని రేవంత్‌రెడ్డి విమర్శించారు.

## వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోండి

అంటూ తెలంగాణ స్పీకర్‌ను సుప్రీం ధర్మాసనం సూటిగా ప్రశ్నించింది. స్పీకర్‌ను అడిగి నిర్ణయం చెపుతామని సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి తెలిపారు. ఎంత సమయం కావాలో మీరే స్పీకర్‌ను కనుక్కొని చెప్పాలని రోహత్గికి జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం సూచించింది. తదుపరి విచారణను వచ్చే వారానికి సుప్రీం కోర్టు వాయిదా వేసింది. సుప్రీంకోర్టులో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, దానం నాగేందర్ , తెల్ల వెంకటరావుపై అనర్హత వేటు వేయాలనే పిటిషన్‌పై కోర్టు విచారణ జరిపింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, వివేకానంద ఈ పిటిషన్ దాఖలు చేశారు. బీఆర్ఎస్ పై గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి కడియం, దానం నాగేందర్ , తెల్ల వెంకటరావు సహా పదిమంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించారు. దీనిపై జస్టిస్ బి ఆర్ గవాయి, జస్టిస్ అగస్టీన్ జార్జ్ ధర్మాసనం విచారణ జరిపింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు తెల్లం, కడియం, దానంపై స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. పార్టీ ఫిరాయింపులపై నాలుగు వారాల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్ వేశారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలకు తెలంగాణ స్పీకర్ కనీసం నోటీసు ఇవ్వలేదని పిటిషన్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పేర్కొన్నారు.

## ప్రతి పేద కుటుంబానికి సొంతిల్లు ..

కల్పించారని, అలాగే దిల్లీని పరిపాలించే అవకాశాన్ని ఇవ్వాలని ఓటర్లను కోరారు. ఆప్ అందరితో గొడవలు పెట్టుకోవడంలో బిజీగా ఉందని మండిపడ్డారు. యమునా నదిని విషతుల్యం చేశారంటూ అరవింద్ కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యలను ఉద్దేశించి మోదీ ఈ విధంగా వ్యాఖ్యానించారు.దిల్లీ అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ దిల్లీలో యమునా నది కాలుష్యంపై రగడ నానాటికి ముదురుతోంది. ఎన్నికలను ప్రభావితం చేయడానికి హరియాణా ముఖ్యమంత్రి కుట్రచేస్తున్నారని కేజ్రీవాల్ ఆరోపించారు. "జనవరి 15 తర్వాత ఆశ్చర్యకరంగా నీటిలో అమ్మోనియం మోతాదు అధికమైనట్లు గుర్తించాం. దానికి మమ్మల్ని బాధ్యులను చేయాలని కుట్ర పన్నినట్లు పసిగట్టిన సీఎం ఆతిశీ ఈ విషయం ప్రజలకు తెలిసేలా చేశారు. మేం చేస్తున్న పోరాటం వల్ల ఇప్పుడు నీటిలో అమ్మోనియం స్థాయిలు 2.1కు తగ్గాయి. దీన్నిబట్టి ఇందులో హరియాణా ప్రభుత్వ హస్తం ఉన్నట్లు స్పష్టమవుతోంది" అని కేజ్రీవాల్ అన్నారు.

### అమెరికా విమాన ప్రమాదం నన్ను ఎంతో బాధించింది

అమెరికాలోని వాషింగ్టన్ డీసీ సమీపంలో ఘోర ప్రమాదం జరిగిన ఘటనపై ప్రధాని మోడీ తీవ్ర దిగ్భ్రాంతిని, విచారాన్ని వ్యక్తం చేశారు. ప్రయాణికుల విమానం, సైనిక హెలికాప్టర్ ఢీకొని, నదిలో పడిపోయాయి. ఈ ఘటనలో 67 మంది ప్రాణాలు కోల్పోయారు. తాజాగా ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. 'వాషింగ్టన్ డీసీలో జరిగిన ఘోర ప్రమాదంలో అనేకమంది ప్రాణాలు కోల్పోవడం నన్ను ఎంతో బాధించింది. మృతులకు నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నా. అమెరికా ప్రజలకు సంఘీభావంగా నిలబడతాం' అని మోదీ ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. కాన్సాస్‌లోని విషిటా నుంచి బయల్దేరిన పీఎస్‌ఏ ఎయిర్‌లైన్స్ ప్రయాణికుల విమానం వాషింగ్టన్ సమీపంలోని రొనాల్డ్ రీగన్ నేషనల్ ఎయిర్‌పోర్టు రన్‌వేపై దిగేందుకు సిద్ధమైంది. ఈక్రమంలోనే రక్షణశాఖకు చెందిన సికోర్స్కీ హెచ్‌-60 బ్లాక్‌హాక్ హెలికాప్టర్‌ను ఢీకొట్టింది. విమానంలో 60 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బంది ఉండగా.. హెలికాప్టర్‌లో ముగ్గురు సైనికులు ఉన్నారు. ఈ ఘటనలో వీరంతా ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు పేర్కొన్నారు.

## జయ ఆస్తులు తమిళనాడు సర్కారుకే..

అప్పగించనుంది. ఈ ఆస్తులు, వస్తువులు తమకు చెందాలంటూ జయలలిత వారసులుగా చెబుతున్న జె.దీపక్, జె.దీప వేసుకున్న అర్జీని ఇటీవలే కర్ణాటక హైకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. సుమారు దశాబ్దం క్రితం తమిళనాడు ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న సమయంలో ఈ ఆస్తుల విలువ రూ. 913 కోట్లు అని పేర్కొంది. ప్రస్తుతం వాటి మార్కెట్ విలువ రూ. 4,000 కోట్లకు పైగా ఉండవచ్చని అంచనా.

# విద్యకు 15 శాతం నిధులు



నియామక ప్రక్రియ పూర్తి చేసింది. గత ప్రభుత్వం వర్సిటీలను నిర్లక్ష్యం చేసింది. భారాస హయాంలో వర్సిటీలు పునరావాస కేంద్రాలుగా మారాయి. మా ప్రభుత్వం రాగానే వీసీలను నియ మించాం. ప్రొఫెసర్ల పదవీ విరమణ వయసు 65 ఏళ్లకు పెంచాం. 21వేల మంది టీచర్లకు పదోన్నతులు కల్పించాం. ఎలాంటి వివాదం లేకుండా 35 వేల మంది ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ చేపట్టాం.ఎందరో ప్రముఖులు మొగిలిగిద్ద పాఠశాలలో చదివారు. ఈ పాఠశాలను అద్భుతంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. విద్యపై చేసేది ఖర్చు కాదు.. భవిష్యత్‌పై పెట్టుబడి. విద్యాశాఖను నా దగ్గరే ఉంచుకొని నిత్యం పర్యవేక్షిస్తున్నా" అని సీఎం తెలిపారు.

## ఉస్మానియా ఆస్పత్రికి సీఎం శంకుస్థాపన

ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం జరుగనుంది. 32 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నూతన ఆసుపత్రిని నిర్మించనున్నారు. 2 వేల పడకల సామర్థ్యంతో ఆస్పత్రి నిర్మాణానికి నిర్ణయం తీసుకుంది ప్రభుత్వం. రూ.2400 కోట్లతో 14 అంతస్తుల్లో ఆస్పత్రి భవన నిర్మాణం జరుగనుంది. అత్యాధునిక వైద్య సౌకర్యాలతో 30 విభాగాలలో వైద్య సేవలు అందించనున్నారు. కొత్త ఆస్పత్రిలో రోబోటిక్ సర్జరీలు చేసేలా సౌకర్యాలు కల్పించనున్నారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో కొత్త ఆస్పత్రికి డిజైన్ చేశారు. స్టాఫ్, మెడికల్ స్టూడెంట్స్ కోసం ప్రత్యేక భవనాలు నిర్మించనున్నారు. ప్రతీ గదిలో గాలి, వెలుతులు ఉండేలా డిజైన్లు చేశారు. అత్యాధునిక టెక్నాజీలతో కూడిన మార్చురీ ఏర్పాటు చేయనున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా నలువైపులా రోడ్లు వేయనున్నారు. అన్నిరకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ఇందులో ఉండేలా ఏర్పాటు చేస్తారు. ప్రతి డిపార్ట్‌మెంట్‌కు ప్రత్యేక ఆపరేషన్ థియేటర్లు ఉండనున్నాయి. ప్రతి థియేటర్‌కు అనుబంధంగా పోస్ట్ ఆపరేటివ్, ఐసీయూ వార్డులను నిర్మిస్తారు. ప్రస్తుతం అఫ్జల్‌గంజ్‌లో ఉన్న ఉస్మానియా ఆస్పత్రి శిథిలావస్థకు చేరడంతో కొత్త ఆస్పత్రిని గోషామహల్ స్టేడియంలో నిర్మించాలని నిర్ణయించారు. భూమి పూజ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సలహాదారు వేం నరేందర్ రెడ్డి, కే కేశవరావు, మేయర్ గద్వాల విజయలక్ష్మీ, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ,రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజ నర్సింహ మాట్లాడారు. 30 ఏళ్ల కల కొత్త ఉస్మానియా ఆసుపత్రి అని.. ఇది చారిత్రక దినమని చెప్పారు. "ఉస్మానియా దేశంలోనే పేరెన్నికగన్న ఆసుపత్రి. దీని నూతన భవనం కోసం 6 నెలల్లోనే ప్రక్రియ పూర్తి చేసి సీఎం శంకుస్థాపన చేశారు. వేలాది మంది రోగులకు ఉస్మానియా అంటే ఓ నమ్మకం. అందుకే ఇతర ప్రాంతాలకు దీన్ని తరలించకుండా గోషామహల్‌లోనే ఉంచి ఆసుపత్రి నిర్మాణం చేస్తున్నాం. 5 భాగాలుగా నిర్మాణం జరుగుతుంది. 100% ఉచితంగా అన్ని రకాల సేవలు అందుబాటులోకి తీసుకొస్తాం. దీనికోసం రూ.2700 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నాం. రెండేళ్లలో మొత్తం భవనం నిర్మాణం పూర్తిచేయాలని భావిస్తున్నాం" అని దామోదర రాజనర్సింహ అన్నారు.26 ఎకరాల విస్తీర్ణంలో రూపుదిద్దుకోనున్న భవనం కార్పొరేట్ ఆసుపత్రులను తలదన్నేలా నిర్మించాలని నిర్ణయించారు. రాబోయే వందేళ్ల అవసరాలకు తగినట్లు తీర్చిదిద్దాలని ఇటీవల నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి.. అధికారులను ఆదేశించారు. అన్నిరకాల సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు, ప్రతి వైద్య విభాగానికి ప్రత్యేకంగా ఆపరేషన్ థియేటర్లు, ప్రతి థియేటర్‌కు అనుబంధంగా పోస్ట్ ఆపరేటివ్, ఐసీయూ వార్డులు, కిందిభాగంలో ఒకేచోట అన్నిరకాల డయాగ్నొస్టిక్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. భవన నిర్మాణానికి సుమారు రూ.2500 కోట్ల నుంచి రూ.2700 కోట్ల వరకు వ్యయం కానుందని అంచనా. కొత్త భవనం ప్రారంభోత్సవం తర్వాత 20 శాతం వైద్యుల సంఖ్య పెరగనుంది.

## గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం

**హైదరాబాద్(జనంసాక్షి):**"రాజకీయంగా ఒంటరిననే భావన వచ్చినప్పుడల్లా గద్దర్ దగ్గరకు వెళ్లి సలహాలు తీసుకునే వాడిని. నీ బాధ్యత నెరవేర్చు ప్రజలు తప్పకుండా నిన్ను గుర్తించి అవకాశం ఇస్తారని చెప్పేవారు. వారి మాట నిజమైంది" అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ రవీంద్రభా రతిలో జరిగిన గద్దర్ జయంతి కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ... గద్దర్ ఆఖరి శ్వాస వరకు తాను నమ్మిన సిద్ధాంతాల కోసం జీవించారని కొనియాడారు."గద్దర్, గోరటి వెంకన్న, చుక్కా రామయ్య, అందెశ్రీ, జయధీర్ తిరుమలరావుకు పద్మ అవార్డులు ఇవ్వాలని కేంద్రానికి సిఫార్సు చేశాం. పక్క రాష్ట్రానికి ఐదు అవార్డులు ఇచ్చారు.. వాళ్లకంటే మేం ప్రతిపాదించిన వాళు తక్కువా? కేంద్రం చేసిన తప్పును సరిదిద్దుకుంటారని లేఖ రాశా. తప్పు సరిదిద్దుకోకుండా.. గద్దర్‌కు అవార్డు ఇవ్వం అని చెప్పారు. అవార్డులు ఇచ్చేది మేమే అని భాజపా నేతలు అంటున్నారు. వారి పార్టీ కార్యాలయం తెలంగాణలో ఉంది. ఇంకోసారి గద్దర్ గురించి తప్పుగా మాట్లాడితే భాజపా ఆఫీసు ఉన్న ప్రాంతానికి, కాలనీకి గద్దరన్న పేరు పెడతాం. ప్రతి దానికీ మా దగ్గర మందు ఉంది. గతంలో గద్దర్‌ను అవమానించిన వారికి తగిన శాస్తి జరిగింది. గద్దరన్నపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం" అని రేవంత్‌రెడ్డి హెచ్చరించారు.

## ఈ సారి మందగమనమే...

భాగంగా 2024-25 ఆర్థిక సర్వేను కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. పార్లమెంట్ ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగం పూర్తయిన తర్వాత ఆమె ఆర్థిక సర్వేను సభ ముందు ఉంచారు. అనంతరం స్పీకర్ ఓం బిర్లా సభను శనివా రానికి వాయిదా వేశారు. ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్‌ను నిర్మలమ్మ సభకు సమర్పించనున్నారు. కేంద్ర బడ్జెట్ సమర్పణకు ముందు ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టడం ఆనవాయితీగా వస్తోంది. గత సంవత్సర కాలంలో దేశ ఆర్థిక పనితీరును.. రాబోయే సంవత్సరంలో ఆర్థికంగా ఎదురయ్యే సవాళ్లను ముందుగానే అంచనా వేసి చెప్పేదే ఈ ఎకనామిక్ సర్వే. ఆర్థిక మంత్రిత్వశాఖకు చెందిన ఎకనామిక్ అఫ్లైర్స్ డిపార్ట్‌మెంట్‌లోని ఎకనామిక్ డివిజన్ ఈ సర్వేను రూపొందిస్తుంది. తొలుత 1950-51 సంవత్సరం నుంచి ఆర్థిక సర్వేను బడ్జెట్‌తో పాటే ప్రవేశపెట్టేవారు. 1960 తర్వాత బడ్జెట్‌కు ఒకరోజు ముందు ప్రవేశపెట్టే సంప్రదాయం మొదలైంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణ భయాలు కాస్త తగ్గుముఖం పట్టొచ్చు. అయితే, భౌగోళిక రాజకీయ అనిశ్చితుల రూపంలో ఇంకా ముప్పు పొంచే ఉంది. ప్రభుత్వ మూలధనం పెరగడం, వ్యాపార అంచనాలు మెరుగుపడటంతో పెట్టుబడులు పుంజుకుంటాయని అంచనా వేస్తున్నారు. దేశీయంగా నెలకొన్న వాతావరణ పరిస్థితులు, అంతర్జాతీయంగా బలహీన డిమాండ్ నేపథ్యంలో గతేడాది తయారీ రంగం ఒత్తిడికి గురైంది. తయారీ రంగం నెమ్మదించడం, కార్పొరేట్ పెట్టుబడులు తగ్గడంతో 2024-25లో భారత వృద్ధి రేటు 6.4శాతానికి పరిమితం కావొచ్చు. గత నాలుగేళ్లలో ఇదే అత్యల్పం. 2023-24లో వృద్ధి రేటు 8.2శాతంగా ఉండగా.. 2022-23లో 7.2శాతం, 2021-22లో 8.7శాతంగా ఉంది. గత ఆర్థిక సంవత్సరంలో దేశంలో ఐపీఓ లిస్టింగ్‌లు గణనీయంగా నమోదయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా ఐపీఓ లిస్టింగ్‌ల్లో మన వాటా 30శాతంగా ఉంది. 2023తో పోలిస్తే ఇది 17శాతం ఎక్కువ. గత ఐదేళ్లలో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. దీని వల్ల భారీ మౌలికవసతుల రంగాల్లో కేంద్ర మూలధన వ్యయం 2020 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 38.8శాతం పెరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 5853 కిలోమీటర్ల జాతీయ రహదారులను నిర్మాణం పూర్తి చేశారు. జల్ జీవన్ మిషన్ కింద ఇప్పటివరకు 12 కోట్లకు పైగా కుటుంబాలకు కొళాయిల ద్వారా తాగు నీరు సదుపాయం లభించింది. 2023-24లో నమోదైన 8.2శాతం వృద్ధి రేటితో పోలిస్తే గణనీయంగా తక్కువని చెప్పొచ్చు. ఆర్థిక సర్వే ప్రకారం, దేశీయ ఆర్థిక వ్యవస్థకు కొన్ని బలమైన అంశాలు కూడా ఉన్నాయి. బలమైన బాహ్య ఖాతాలు, సమతుల్య ఆర్థిక ఏకీకరణ, స్థిరమైన ప్రైవేట్ వినియోగం భారత ఆర్థిక వ్యవస్థను నిలబెడతాయని పేర్కొంది. ఆర్థిక సర్వేలో కీలక అంశాలు గమనిస్తే.. తయారీ రంగం బలహీనత, పెట్టుబడుల తగ్గుదల ప్రధాన ప్రతికూలతలుగా మారనున్నాయి. బలమైన బాహ్య ఖాతాలు, స్థిరమైన ప్రైవేట్ వినియోగం వృద్ధికి సహాయపడతాయి. ఇది ప్రస్తుత దేశ ఆర్థిక పరిస్థితిని, ఎదురవుతున్న సవాళ్లను విశ్లేషిస్తుంది. అలాగే, సంస్కరణలు, అభివృద్ధికి సంబంధించిన మార్గదర్శకాలను అందిస్తుంది.

## తెలంగాణలోకి 'గులియన్ బారే సిండ్రోమ్

సిద్దిపేటకు చెందిన మహిళకు జీబీఎస్ లక్షణాలు ఉండడంతో హైదరాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. బాధిత మహిళ వెంటిలేటర్ పై చికిత్స పొందుతోంది. పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్రలో ఇదివరకే దాదాపు 100కు పైగా జీబీఎస్ కేసులు నమోదు కావడం ఆందోళనకు గురి చేస్తోంది. బ్యాక్టీరియా, వైరల్ ఇన్ఫెక్షన్ కారణంగా ఇమ్యూనిటీ తక్కువగా ఉన్నవారు ఈ జీబీఎస్ బారిన పడే అవకాశాలు ఉన్నాయని వైద్యులు వెల్లడించారు. శరీరానికి సోకిన ఇన్ ఫెక్షన్ కు ప్రతిస్పందించే రోగ నిరోధక వ్యవస్థ పొరపాటున నరాలపై దాడి చేసే అరుదైన పరిస్థితే ఈ జీబీఎస్. మోడీకి ట్రంప్ తాజా ఆఫర్..! సై అంటే మీ వాళ్ల జోలికి రాం..? ఈ వ్యాధి బారిన పడిన వారికి ఒళ్లంతా తిమ్మిరిగా మారుతుంది. కండరాలు బలహీనంగా మారిపోతాయి. డయేరియా, పొత్తికడుపులో నొప్పి, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. జలుబు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటివి కూడా కనిపిస్తాయి. కలుషిత ఆహారం, నీటి ద్వారా ఈ బ్యాక్టీరియా సోకుతుందని డాక్టర్లు చెబుతున్నారు. అయితే జీబీఎస్ అంటువ్యాధి కాదని.. ఎవరూ భయాందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేస్తున్నారు. బాధితులకు సరైన చికిత్స అందిస్తే కోలుకుంటారని చెబుతున్నారు. అయితే దీని చికిత్స చాలా ఖరీదైనదని.. రోగికి ఇచ్చే ఇమ్యునోగ్లోబిన్ ఇంజెక్షన్ ధర ఒక్కొక్కటి వేలల్లో ఉంటుందని చెబుతున్నారు. ఈ వ్యాధి బారిన పడకుండా ఉండాలంటే రోగ నిరోధక శక్తి అధికంగా ఉండాలి. ఎందుకంటే రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి ఈ వ్యాధి సోకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ వ్యాధి ప్రభావం వల్ల రోగనిరోధక శక్తి పూర్తిగా దెబ్బతిని నరాల వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

## ఆమ్ ఆద్మీకి భారీ షాక్

లేవనెత్తుతూ పలువురు ఎమ్మెల్యేలు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు. తనతో పాటు, మరో ఆరుగురు ఎమ్మెల్యేలు ఆప్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు ఎమ్మెల్యే మదన్‌లాల్ తెలిపారు. రాజీనామా చేసిన వారిలో త్రిలోక్‌పురి ఎమ్మెల్యే రోహిత్ మెహ్రౌలియా, జనక్‌పురి ఎమ్మెల్యే రాజేశ్ రిషి, కస్తూర్బానగర్ ఎమ్మెల్యే మదన్‌లాల్, మెహ్రౌలి ఎమ్మెల్యే నరేశ్ యాదవ్‌తో పాటు పవన్ శర్మ (ఆదర్శనగర్) బీఎస్ జూన్ (బిజ్వాసన్) ఉన్నారు. వీరంతా తమ రాజీనామా లేఖలను దిల్లీ అసెంబ్లీ స్పీకర్ రాం నివాస్ గోయెల్‌కు పంపినట్లు మదన్‌లాల్ వెల్లడించారు.అయితే, ఈసారి ఎన్నికల్లో తిరిగి పోటీ చేసేందుకు వీరెవరికీ ఆప్ నుంచి అవకాశం రాకపోవడం గమనార్హం. మొత్తం 70 స్థానాలు ఉన్న దిల్లీ అసెంబ్లీకి ఫిబ్రవరి 5న ఎన్నికల పోలింగ్ జరగనున్న విషయం తెలిసిందే. ఫిబ్రవరి 8న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

## యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం

మెడికల్ కళాశాల ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. భక్తులంతా ప్రయాగ్‌రాజ్‌లోని మహా కుంభమేళాకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రమాదం జరిగిన వెంటనే ట్రక్కు డ్రైవర్ పరారయ్యాడు. అతడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

# ప్రపంచంలో మూడో ఆర్థికశక్తిగా ఎదుగుతున్నాం

శ్రద్ధాంజలి ఘటించారు. 'మహా కుంభమేళా జరుగుతున్న సమయంలో పార్లమెంట్ సమావేశాలు ప్రారంభించుకుంటున్నాం. ఇటీవల గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నాం' అని రాష్ట్రపతి హర్షం వ్యక్తంచేశారు. బడ్జెట్‌లో రైతులు, మహిళలు, పేదలు, యువతకు ప్రాధాన్యం ఉంటుందని ఆమె తెలిపారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీయే సర్కారు.. గత ప్రభుత్వాల పాలనతో పోలిస్తే మూడు రెట్లు వేగంతో పనిచేస్తోంది. త్వరలో ప్రపంచంలో మూడో ఆర్థికవ్యవస్థగా భారత్ మారనుందని విశ్వాసం వ్యక్తం చేశారు. పేదరిక నిర్మూలన కోసం అనేక పథకాలు అమలుచేస్తున్నాం. 25 కోట్ల మందిని దారిద్ర్యం నుంచి బయటకు తీసుకొచ్చాం. అర్హులందరికీ లబ్ధి చేకూరేలా సంక్షేమ పథకాలను వేగంగా అమలుచేస్తున్నాం అని అన్నారు. మధ్యతరగతి ప్రజల సొంతింటి కలను నెరవేరుస్తున్నాం. అదనంగా మూడు కోట్ల కుటుంబాలకు ఇళ్ల నిర్మాణం కోసం ప్రధానమంత్రి ఆవాస్ యోజనను పొడిగించాం అన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకం కింద.. 70 ఏళ్లు పైబడిన ఆరు కోట్ల మంది వృద్ధులకు ఆరోగ్య బీమా అందిస్తోంది. అమృత్ భారత్, నమో భారత్ రైళ్లు ప్రవేశపెడుతున్నాం. విద్యారంగంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారిస్తోంది. యువతకు నూతన ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. నూతన విద్యా విధానంతో ఆధునిక విద్యా వ్యవస్థను ఏర్పాటుచేశాం. సంస్కరణలు వేగవంతం చేశాం. ఒకే దేశం-ఒకే ఎన్నిక, వక్ఫ్ సవరణ బిల్లు అమలు దిశగా సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నాం అని అన్నారు. దేశంలో కార్పొరేట్ సంస్థలకు మహిళలు నాయకత్వం వహిస్తున్నారు. ఒలింపిక్ పతకాలు సాధిస్తూ దేశం గర్వించేలా చేస్తున్నారు. వారి



సాధికారకతకు కృషి చేస్తున్నాం. మారుమూల ప్రాంతాల్లో డిజిటల్ సేవల కల్పనలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు గొప్ప ముందడుగు. నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్ కింద 91 లక్షలకు పైగా స్వయం సహాయక బృందాలకు సాధికారికత కల్పిస్తున్నాం. 3 కోట్ల మందిని లక్‌పతీ దీదీగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాం అన్నారు. భారత్‌ను గ్లోబల్ ఇన్నోవేషన్ పవర్‌హౌస్‌గా మార్చడమే మా లక్ష్యం. నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్‌ను ప్రారంభించాం. కృత్రిమ మేధ రంగంలో 'భారత ఏఐ మిషన్'ను మొదలుపెట్టాం. భారత్ తన సొంత మానవ సహిత అంతరిక్ష ప్రయోగం గగన్‌యాన్‌ను ప్రయోగించే రోజు ఎంతో దూరంలో లేదు. ఎంఎస్‌ఎంఈలకు క్రెడిట్ గ్యారెంటీ పథకాలు, ఇ-కామర్స్ ఎగుమతి కేంద్రాలు దేశంలో అన్ని రంగాల్లో వ్యాపారాలను ప్రోత్సహిస్తున్నాయి. సైబర్ సెక్యూరిటీలో సమర్థత కోసం నిరంతరం కృషి చేస్తున్నాం. డిజిటల్ మోసాలు, సైబర్ నేరాలు, డీప్‌ఫేక్ వంటివి సామాజిక, ఆర్థిక, దేశ భద్రతకు పెను సవాళ్లుగా మారాయి. ప్రపంచ వేదికపై డిజిటల్ టెక్నాలజీలో భారత్ కీలకపాత్ర పోషిస్తోంది. మన యూపీఐ లావాదేవీల వ్యవస్థ విజయాన్ని అభివృద్ధి చెందిన దేశాలు కూడా ప్రశంసించాయి. భారత మెట్రో నెట్‌వర్క్ 1000 కిలోమీటర్ల మైలురాయిని దాటింది. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద మెట్రో నెట్‌వర్క్‌గా నిలిచింది.ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం దేశవ్యాప్తంగా 1.75లక్షల ఆరోగ్య మందిర్‌లను ఏర్పాటుచేశాం. క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల కోసం వారు ఉపయోగించే పలు ఔషధాలపై కస్టమ్ సుంకాన్ని రద్దు చేశాం. గర్భిణులు, పిల్లల వ్యాక్సినేషన్ కోసం యు-విన్ పోర్టల్‌ను ప్రారంభించాం. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు సాగు ఉత్పత్తులకు గిట్టుబాటు ధర అందిస్తున్నాం. కచ్చితమైన వాతావరణ సమాచారాన్ని అందించేందుకు రూ.2000 కోట్లతో 'మిషన్ మౌసం'ను ప్రారంభించాం. సహకార రంగంలో అనేక ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాం అని వివరించారు. ఆర్టికల్ 370 తర్వాత జమ్మూ కశ్మీర్‌లో పరిస్థితులు మెరుగయ్యాయి. సంస్కరణలు, పనితీరు, పరివర్తన అనేవి ప్రభుత్వ పాలనకు బలమైన స్తంభాలుగా మారాయన్నారు. సరిహద్దుల రక్షణ, అంతర్గత భద్రత కోసం ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంది. వామపక్ష అతివాదానికి వ్యతిరేకంగా పోరాటం చివరిదశకు చేరింది. నక్సల్స్ ప్రభావిత జిల్లాల సంఖ్య 38కు తగ్గింది. రక్షణ రంగంలో స్వావలంబన దిశగా కీలక అడుగులు వేస్తున్నాం అని రాష్ట్రపతి అన్నారు. బడ్జెట్-2025లో రైతులు, మహిళలు, పేదలు, యువతకు ప్రాధాన్యం ఇస్తున్నాం. రూ.70 వేల కోట్లతో గ్రామీణ రహదా రులను అభివృద్ధి చేస్తున్నాం. దేశాభివృద్ధి ఫలాలు అందరికీ అందాలన్నదే మా లక్ష్యం. పేద, మధ్య తరగతి ప్రజలకు హోమ్ లోన్ సబ్సిడీ ఇస్తున్నామన్నారు

## బడ్జెట్ దేశ ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తుంది

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**పార్లమెంటులో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టబోయే బడ్జెట్ దేశ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా ఉంటుందని ప్రధాని మోడీ అన్నారు. పార్లమెంటు సమావేశాలు ప్రారంభం అయిన సందర్భంగా ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్మ ప్రసంగించారు. ఈ సమావేశాలు ప్రారంభమయ్యే ముందు పార్లమెంటు వెలుపల ప్రధాని మోడీ మీడియాతో మాట్లాడారు. 'పార్లమెంటు సమావేశాలు సజావుగా సాగేందుకు ప్రతిపక్షాలు సహకరిస్తాయని నేను భావిస్తున్నాను. మూడోసారి ఎన్డీయేకు ప్రజలు పట్టం కట్టారు. పార్లమెంటులో సంపూర్ణ బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నాం. ఈ బడ్జెట్ ప్రజల్లో కొత్త విశ్వాసం నింపుతుందని ఆశిస్తున్నాను. ఈ బడ్జెట్ వికసిత్ భారత్‌కు ఊతం ఇస్తుంది. ఇన్నోవేషన్, ఇన్‌క్లూజన్, ఇన్వెస్ట్‌మెంట్ లక్ష్యంతో దూసుకెళ్తున్నట్లు' మోడీ చెప్పారు. కొత్త విధానాలైనే ఆర్థిక ప్రగతి ఆధారపడి ఉంటుంది. ఈ సమావేశాల్లో కీలక బిల్లులను ప్రవేశపెట్టనున్నట్లు మోడీ తెలిప్పారు. ఇప్పుడు జరిగే పార్లమెంటు సమావేశాల్లో అన్ని అంశాలపై సమగ్ర చర్చ జరిపేందుకు ప్రతిపక్షాలు సహకరించాలని మోడీ విజ్ఞప్తి చేశారు. జనవరి 31 నుండి ఏప్రిల్ 4 వరకు రెండు విడతల్లో బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయి. మొదటి విడత సమావేశాలు ఫిబ్రవరి 13న ముగుస్తాయి. ఈ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం 16 బిల్లులను ప్రవేశపెట్టాలని చూస్తోంది. వీటిల్లో వక్ఫ్ (సవరణ) బిల్లు, బ్యాంకింగ్ చట్టాల (సవరణ) బిల్లు, రైల్వే (సవరణ) బిల్లు, విపత్తు నిర్వహణ (సవరణ) బిల్లుతోపాటు పలు బిల్లులను ప్రభుత్వం పెట్టనుంది. బడ్జెట్ ప్రజల్లో కొత్త విశ్వాసం నింపుతుందని భరోసా ఇచ్చారు. అలాగే పదేళ్ల కాలంలో పార్లమెంట్ సెషన్‌కు ముందు ఈసారే విదేశీ జోక్యం కనిపించలేదని విపక్షాలకు చురకలు అంటించారు.'పేదలు, సామాన్యులపై మహాలక్ష్మి కృప ఎప్పటికీ ఉండాలి. భారత శక్తిసామర్థ్యాలు మనకు విశేష గుర్తింపును ఇస్తాయి. మూడోసారి ఎన్డీయేకు ప్రజలు పట్టం కట్టారు. మూడోసారి పార్లమెంట్‌లో సంపూర్ణ బ్జడెట్ ప్రవేశపెడుతున్నాం. ఈ వార్షిక పద్దు ప్రజల్లో కొత్త విశ్వాసం నింపుతుంది. భారత్ అభివృద్ధి లక్ష్యంతో మిషన్ మోడ్‌లో ముందుకెళ్తున్నాం. ఇన్నోవేషన్, ఇన్‌క్లూజన్, ఇన్వెస్ట్‌మెంట్ లక్ష్యంతో దూసుకెళ్తున్నాం. కొత్త విధానాల పైనే ఆర్థిక ప్రగతి ఆధారపడి ఉంటుంది. పార్లమెంటులో చరిత్రాత్మక బిల్లులు ప్రవేశపెడుతున్నాం. పార్లమెంటు సమావేశాల్లో అన్ని అంశాలపై సమగ్ర చర్చ జరుగుతుందని, ఉభయ సభలు సజావుగా సాగేందుకు ప్రతిపక్షాలు సహక రిస్తాయని భావిస్తున్నాను' అని మోదీ ఆశాభావం వ్యక్తంచేశారు.

## డాలర్‌ను పక్కనపెడితే తీవ్రపరిణామాలు

రూపొందిస్తే ఆయా దేశాల దిగుమతులపై 100 శాతం సుంకం విధిస్తామని, అమెరికాతో వాణిజ్యాన్ని వదులుకోవాల్సి ఉంటుందని సోషల్ మీడియా వేదికగా హెచ్చరించారు.అక్టోబరులో రష్యాలోని కజాన్ వేదికగా బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు జరిగిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలోనే బ్రిక్స్ దేశాలు ఉమ్మడిగా కరెన్సీ రూపొందించడంపై దృష్టిపెట్టాలని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పిలుపునిచ్చారు. పెట్టుబడుల ప్రాజెక్టులకు ఆర్థిక వనరులు సమకూర్చడానికి ఆయా దేశాలు డిజిటల్ కరెన్సీని వాడుకోవాలని ప్రతిపాదించారు. ప్రస్తుతం కూటమిలోని దేశాలు డిజిటల్ కరెన్సీ వాడుకునేందుకు భారత్‌తో కలిసి రష్యా పని చేస్తోందన్నారు. సభ్య దేశాలు కొత్త ఆర్థిక సాధనాలను వినియోగించుకోవాలని పుతిన్ కోరారు. దీనిపై సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేస్తున్నామన్నారు. కాగా అట్లాంటిక్ కౌన్సిల్‌కు చెందిన జియో ఎకనామిక్స్ సెంటర్ గత సంవత్సరం చేసిన అధ్యయనంలో బ్రిక్స్ దేశాలు ఎన్ని ప్రయత్నాలు చేసినా డాలర్‌పై ప్రపంచ దేశాలు ఆధారపడటాన్ని పూర్తిగా తగ్గించలేవని వెల్లడించింది.

# బహిరంగంగా బెల్ట్ షాపుల నిర్వహణ

- కన్నెత్తి చూడని ఎక్సైజ్ శాఖాధికారులు

**నిర్మల్ బ్యూరో, జనవరి31 (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లా కేంద్రంలోని పలు మండలాల పరిధిలో..వీధికో బెల్టు షాపు గల్లీ గల్లిలో బెల్టు షాపులు.. పేరుకె కిరాణా దుకాణం నడిపేది. మద్యం బెల్ట్ దందా.. వైన్ షాప్ దక్కించుకున్న నిర్వాహకులు చిన్న చిన్న బెల్టు షాపులకు మద్యాన్ని నేరుగా ఆటోలతో సప్లై చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. షాపు నిర్వాహకులు మూడు పువ్వులు.. ఆరు కాయలుగా.. జోరుగా సాగిస్తున్నారు..సీఎం రేవంత్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా బెల్ట్ షాపులను నిరోధిస్తున్నట్లు ప్రకటించారు. కానీ గల్లిలో. ,పల్లెలో మారుమూల తండాల్లో గ్రామాల్లో మత్తులో యువత జోగుతున్నారు. పుట్టగొడుగుల్లా బెల్ట్ దుకాణాలు వెలుస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ షాపులను ఏర్పాటు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అనేకమంది బెల్ట్ షాపుల్లో మద్యం కొనుగోలు చేసి జేబులు గుల్ల చేసుకుంటున్నారు. అప్పులు చేసి తాగడంతో కుటుంబాలు వీధిన పాలవుతున్నారు. వివిధ పరిధిలో పలు గ్రామాల్లో బహిరంగంగా బెల్ట్ షాపులు ఎదేచ్ఛగా నిర్వహిస్తున్నారు. అధిక సంఖ్యలో గ్రామాల్లో బెల్ట్ షాపులు కొనసాగుతూఉంటే



నిరోధించాల్సిన సంబంధిత శాఖ అధికారులు చోద్యం చేస్తున్నారు. ఒకవైపు గుడుంబా మానేసిన వారికి ప్రభుత్వం స్వయం ఉపాధి మార్గాలతో జీవనం ఉపాధి కల్పిస్తుంటే మరోవైపు బెల్ షాపులు పల్లె ప్రజలను మత్తులో ముంచుతున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం కన్నెత్తి చూడటం లేదని బహిరంగంగా ప్రజల ఆరోపిస్తున్నారు.మద్యం పచ్చని సంసారాల్లో చిచ్చు పెడుతుంది. ఊరు ఊరు బెల్ట్ షాపులు పుట్టగొడుగుల పుట్టుకొస్తున్నాయి.దీంతో పొద్దంతా పనిచేసే సంపాదించిన సొమ్మును మద్యానికి విచ్చేస్తూ, కుటుంబాలను వీధిన పడేస్తున్నారు. గ్రామాల్లో బెల్ట్ దుకాణాలు నిర్వహించడంతో యువత పెడదారి పడుతున్నారు.అనేకమంది పేరుకే కిరాణ దుకాణం నిర్వహిస్తూ, లోపల మాత్రం మద్యం వ్యాపారం కొనసాగిస్తున్నారు. సంబంధిత ఎక్సైజ్ శాఖాధికారులు ఇలాంటి సమాధానం చెప్పడం లేదు.కూతవేటు దూరంలోనే జిల్లా కలెక్టర్,, జిల్లా ఎక్సైజ్ అధికారులు ఉన్నప్పటికీ వారి కళ్లెదుటే ఆటోలల్లో అక్రమ మద్యం రవాణా అవుతున్నప్పటికి చోద్యం చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అధికారులకు మ్యావ్ మ్యావ్ అందుతున్నాయి కాబట్టి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు చెవి కురుకుంటున్నారు.బెల్టు షాపు నిర్వాహకులు దమ్ముంటే ఒక్క బెల్టు షాపుని మూపియండని సవాలు విసురుతున్నారు. దీనితో సామాన్య ప్రజలు అక్రమ బెల్టు షాపులపై కాంప్లెంట్ చేసినా ఆర్ఠిగేదిమి లేదని ముక్కున వేలేసుకుని మౌనంగా ఉంటున్నారు..బెల్టు షాపు నిర్వాహకులను జనంసాక్షి సంప్రదిస్తే మీ పేపర్లో ఏమైనా రాసుకోండి.అధికారులకు నెలనెలా మామూళ్లు ముట్టచెపుతున్నామని బెదిరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు నిద్రమత్తును వీడి నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ ప్రతినిధి, జనవరి 31(జనంసాక్షి) :** ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా రోడ్ల భవనాల అధికారి జితేందర్ రెడ్డి, మిషన్ భగీరథ ఈఈ వెంకటరమణారెడ్డి, జిల్లా ఉపాధి కల్పనా ఉమారాణి పదవీ విరమణ సందర్భంగా సాయంత్రం కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదవి విరమణ పొందుతున్న అధికారులు జిల్లాలో ప్రధాన శాఖలను నిర్వర్తిస్తూ నిత్యం ప్రజలకు అందుబాటులోకి ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. వారు విధుల పట్ల నిబద్ధతో పనిచేశారని, తోటి అధికారులు, సిబ్బందితో స్నేహభావంగా ఉంటూ క్రమ శిక్షణతో విధులు నిర్వహించాలని అన్నారు. పదవి విరమణ పొందుతున్న అధికారులతో కలిసి గత ఏడు నెలల్లో జిల్లాలో కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ విమానాశ్రయం, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని కలెక్టర్ గుర్తు చేశారు. వారి సేవలను అధికారులు స్ఫూర్తిగా పదవీ విరమణ ముగింపు కాదని, కొత్త ఆరంభమని, వారు తమ అభిరుచులను కొనసాగించేందుకు ఇదొక అవకాశం అని కలెక్టర్ ఉద్ఘాటించారు. వారి సేవల్లో పొందిన అపార అనుభవం మరియు జ్ఞానాన్ని సమాజ సేవా కు వినియోగించాలని అన్నారు.అనంతరం పదవి విరమణ పొందుతున్న ముగ్గురు అధికారులను కలెక్టర్, అధికారులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి మొమెంటోలను అందజేశారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, డిఆర్డీఓ కౌసల్యాదేవి, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, టీడబ్ల్యూ ఐడిసి ఎస్ఈ నరేందర్ రెడ్డి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఎంజీఎం ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ కిషోర్

**వరంగల్ ఎంజీఎం, జనవరి 31(జనంసాక్షి):** డాక్టర్ కిషోర్ ఎంజీఎం ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డాక్టర్. కిషోర్ మాట్లాడుతూ ఎంజీఎం అభివృద్ధికి రోగుల సంరక్షణకు సేవలు మెరుగుపర్చడానికి నా వంతు కృషి చేస్తానని, ఎంజీఎం ఉద్యోగులు కూడా పూర్తిగా సమర్థవంతంగా పనిచేసి ఎంజీఎం ఆసుపత్రికి మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా కోరారు. సూపరిండెంట్ ను కలిసిన వారిలో జిల్లాకార్యదర్శి వేణుగోపాల్, సహాధ్యక్షులు లావుడ్యా హేమ నాయక్ , ఉపాధ్యక్షులు వంశిధర్ బాబు,పట్టణ శాఖ అధ్యక్షులు శెంకేశి రాజేష్,జిల్లా నాయకులు రజినీకాంత్, నాగేశ్వర్ రావు,వెంకటేశ్వర్లు, కయ్యూమ్, కిషన్ నాయక్, మెడికల్ ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్ ,నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సాంబయ్య,మల్లేశం, రాజేందర్,శ్రీలత మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు.

## వదినను ఓడించిన సునీల్ రావు

# నీతి, జాతి గురించి మాట్లాడడం సిగ్గుచేటు

- నీరాజకీయ జీవిత రక్తమే ముస్లింలు పెట్టిన భిక్ష
- ఊసరవెల్లి కంటే వేగంగా కండువాలు మార్చే పొలిటికల్ బ్రోకర్ సునీల్ రావు
- ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్ విమర్శ




**కరీంనగర్, జనవరి 31 (జనంసాక్షి) :** తన రాజకీయ లబ్ధి కోసం సొంత సోదరుడు సుకుమార్‌రావు భార్యను ఓడించిన మాజీ మేయర్ సునీల్ రావు నీతి జాతి గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని, సునీల్ రావు రాజకీయ జీవిత రక్తమే ముస్లింలు పెట్టిన భిక్ష అని ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ విమర్శించారు. శుక్రవారం నగరంలోని ఎంఐఎం పార్టీ కార్యాలయం దారుస్సలామ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంఐఎం పార్టీ కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్షులతో కలిసి గులాం అహ్మద్ తో పాటు అబ్బాస్ సమీ, మేయర్ సునీల్ రావు పై ఫైర్ అయ్యారు. మూలాన్ని మరచిపోయి నిన్న కాక మొన్న బిజెపి కండువా వేసుకొని ఎంఐఎం పార్టీ చరిత్ర తెలుసుకోకుండా ఏది పడితే అది మాట్లాడితే ఊరుకునేది లేదు జాగ్రత్త అని హెచ్చరించారు. సునీల్ రావు సైకిల్ పై తిరిగిన నుంచి ఫార్చ్యూనర్ దాకా నీ పొలిటికల్ బ్రోకరిసాన్ని బహిర్గతం చేస్తామని, గత ఏడాది క్రితం ఆనాడు మంత్రిగా ఉన్న గంగుల కమలాకర్ నీపై అవిశ్వాసం పెట్టిస్తాడని భయంతో నాలుగు గోడల మధ్య ఎంఐఎం కార్పొరేటర్ల ముందు మోకరిల్లిన మాట మరిచావా? అని ప్రశ్నించారు. ఎస్ఎస్సి సర్టిఫికెట్ లో శ్రీనివాసరావు గెజిట్ ద్వారా సునీల్ రావు ఎలా అయ్యాడో తెలియపరుస్తామన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షునిగా సంజయ్ ని ఎందుకు తొలగించారో నీవు చేసిన ఆరోపణలు నీకు గుర్తు లేవా..సంజయ్ బీజేపీలో వన్ మెన్ షో చేస్తూ ఎమ్మెల్యే టికెట్లకు కమిట్మెంట్లు ఇచ్చి అమ్ముకున్నాడని నీవు ఆరోపించలేదా.. పాదయాత్ర పేరుతో రాష్ట్రంలో లెక్కలేనన్ని డబ్బులు ఎవరు వసూలు చేశాడని నువ్వు అనలేదా అని ప్రశ్నించారు. కేవలం బిజెపి కండువా వేసుకున్నంతమాత్రాన నువ్వు చేసిన విమర్శలు మరచిపోతారని అనుకోవడం నీద్వంద్వనీతికి నిదర్శనం అన్నారు. దేశంలో ముస్లింలే లేకుంటే బీజేపీ అడ్రస్ గల్లంతయ్యేదన్నారు. ఎంఐఎం పార్టీ చేయాల్సిన పని చేసి చూపించిందని, తనను ఎమ్మెల్యేగా ఎంఐఎం ఓడించిందని స్వయంగా బండి సంజయ్ చెప్పిన మాట మాటలు గుర్తుకు లేవా అని ప్రశ్నించారు. బండి సంజయ్ కరీంనగర్ అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యేగా గెలవడం ఒకళగా మిగిలిపోతుంది తప్ప ఆచరణలో సాధ్యం కాదన్నారు. స్మార్ట్ సిటీ పేరిట కమిషన్ల పేరిట కాంట్రాక్టర్ల వద్ద దోచుకొని దాచుకున్న చరిత్ర సునీల్ రావుదని, అవినీతి అక్రమల పునాదులపై నువ్వు నివాసముంటున్న బిల్డింగ్ నిర్మించావో నగర ప్రజల ఎదుట బహిర్గత పరుస్తామన్నారు. ఈ రాష్ట్రంలో ముస్లింల అభ్యున్నతి కోసం సెక్యులర్ పార్టీలతో ఎంఐఎం జత కడుతుందని ఇందులో తప్పేం లేదన్నారు బిజెపి కుట్రలు చేసినా కరీంనగర్లో బిజెపిని మేయర్ కాకుండా అడ్డుకుంటామన్నారు. ఈసారి కచ్చితంగా ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీల మద్దతుతో కరీంనగర్ కార్పొరేషన్ పై ఎంఐఎం జెండా ఎగురవేస్తామన్నారు. అవగాహన లేకుండా చరిత్ర తెలుసుకోకుండా మాట్లాడుతున్న సునీల్ రావును పిచ్చాసుపత్రిలో చేర్పించాలన్నారు. తక్షణమే సునీల్ రావు నగరంలో టవర్ సర్కిల్ వద్దకు వచ్చి ఎంఐఎం పై విమర్శలు చేసినందుకు, క్షమాపణలు చెప్పి, ముక్కు నేలకు రాసే వరకు విడిచిపెట్టబోమని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఎంఐఎం నగర ప్రధాన కార్యదర్శి బర్కత్ అలీ, నాయకులు ఖమరొద్దీన్, ఇబ్రహీం, ఆతిన, అఖిల్ ఫిరోజ్, షర్ఫుద్దీన్, అలీ బాబా, అజర్ దబీర్, మాజీద్ హుస్సేన్, అంజాద్ ఖాన్, సాజిద్, అబ్దుల్లా ఖాన్, సాజిద్ మాజిద్, ఆసిమ్, షాకిర్ నద్వి, మొహసీన్ మొహియుద్దీన్, షకిలొద్దిన్ తదితరులు పాల్గొన్నారు.



## రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధనఖర్‌తో రవిచంద్ర మర్యాదకపూర్వ భేటీ

**ఖమ్మం (జనంసాక్షి) :** రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, కేఆర్ సురేష్ రెడ్డి, దీవకొండ దామోదర్ రావు, డాక్టర్ బండి పార్థసారథి రెడ్డి తదితరులు పార్లమెంటులో ఉప రాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధనఖర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంతో ప్రారంభమైన విషయం తెలిసిందే. పార్లమెంట్ ఉభయ సభల సమావేశంలో రాష్ట్రపతి ప్రసంగం ముగిసిన తర్వాత ఎంపీలు రవిచంద్ర, సురేష్ రెడ్డి, దామోదర్ రావు, పార్థసారథి రెడ్డిలు రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధనఖర్ ను మర్యాదపూర్వకంగా కలిసి కొద్దిసేపు ముచ్చటించారు.

## తెలంగాణ పవర్ ఎంప్లాయిూస్ యూనియన్ డైరీ ఆవిష్కరణ



**గణపురం, జనవరి 31 ( జనం సాక్షి ):** కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రం కేటిపిపి లో శుక్రవారం తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ యూనియన్ డైరీ ని చీఫ్ ఇంజనీర్ ప్రకాష్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు భూపతి శ్రీనివాస్, కార్యదర్శి బండ రామచందర్ నాయకులు కే రవి, అజీజ్ ఖాన్ అఫ్జల్, సూరారపు శ్రీనివాస్ రావు, సిరికొండ మహేష్, రెడ్డి ప్రణయ్,ఇ శ్రీధర్, పాల్గొన్నారు.

# బాసరలో వసంత పంచమి వేడుకలకు ఏర్పాట్లు చేయండి

- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ బ్యూరో, జనవరి31 (జనంసాకి) :** వసంత పంచమికి బాసరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం బాసరలో పర్యటించిన కలెక్టర్ వసంత పంచమి వేడుకలకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలించారు. ముందుగా గోదావరి పుష్కర ఘాట్ ను అధికారులతో కలిసి పరిశీలించారు. గోదావరి పుష్కర ఘాట్ ప్రదేశంలో నిరంతరం పారిశుద్ధ్య కార్యక్రమాలు కొనసాగించాలన్నారు. ఎప్పటికప్పుడు బ్లీచింగ్ పౌడర్ ను చల్లాలని సూచించారు. గోదావరి నదిలో స్నానమాచరించిన భక్తులు దుస్తులు మార్చుకునేందుకు వీలుగా అవసరమైన గదులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నది వద్ద గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. రాత్రి వేళల్లో ఇబ్బందులు కలగకుండా అవసరమైన విద్యుత్ దీపాలను అమర్చాలని సూచించారు. అనంతరం బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవి అమ్మవారిని కలెక్టర్ దర్శించుకున్నారు. ఆలయ పూజారులు కలెక్టర్ కు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం వి ఐ పి గెస్ట్ హౌస్ లో అధికారులతో కలిసి వసంత పంచమి వేడుకల నిర్వహణపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. బాసరలో ఫిబ్రవరి 1 నుండి 3 వరకు వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వేడుకల పర్యవేక్షణకు భైంసా ఆర్డిఓ ను ప్రత్యేక అధికారిగా నియమించినట్లు తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా త్రాగునీరు, బయోటాయిలెట్ లను ఏర్పాటు చేయాలన్నారు. నిరంతరం పారిశుద్ధ్య కార్యక్రమాలను కొనసాగిస్తూ పరిశుభ్రతను పాటించాలన్నారు. శిశువులకు పాలిచ్చేందుకు వీలుగా బేబీ ఫీడింగ్ గదులను ఏర్పాటు చేయాలన్నారు. గోదావరి పుష్కర ఘాట్, ఆలయ పరిసరాలన్నీ సీసీ కెమెరాలు పర్యవేక్షణలో ఉంచాలన్నారు. ఈ సమావేశంలో ఆర్ డి ఓ కోమల్ రెడ్డి, బాసర దేవాలయ ఈవో సుధాకర్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, ఆర్ అండ్ బి ఈఈ అశోక్ కుమార్, మిషన్ భగీరథ ఈ సందీప్, తహసిల్దార్ పవన్ చంద్ర, రెవెన్యూ, పోలీస్, పంచాయతీ, దేవాదాయ శాఖల అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పెళ్లి భరత్ కాదు..

# రిటైర్డ్ కార్మికుని ఊరేగింపు..!





జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రంలో కెటికె 5ఇంక్లైన్ ఫిట్టర్ లో పనిచేసే ముదిగంటి రఘోత్తం రెడ్డి పదవి విరమణ సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం డీజే పాటలతో, డ్యాన్స్ లు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. పెళ్లి భరత్ కు ఏమాత్రం తీసిపోకుండా కారులో రఘోత్తం రెడ్డికి పూలమాలలు వేసి, సింగరేణి కార్మికులు డీజే పాటలకు డ్యాన్స్ లు చేస్తూ ఊరేగింపు చేయడం స్థానికంగా ఆసక్తికరంగా మారింది.

**– జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, జనంసాక్షి:**

# కార్డన్ సెర్చ్ 43 వాహనాలు సీజ్

- చెడు వ్యసనాలను అలవర్చుకోవద్దు : సీఐ సైదారావు



**ఖానాపూర్ జనవరి 31 (జనంసాక్షి) :** సమాజంలో చెడు వ్యసనాలను అలవర్చుకొని తమ భావి భవిష్యత్తును నిర్వీర్యం చేసుకోవద్దని సీఐ సైదారావు సూచించారు. శుక్రవారం రాత్రి 7:00 గంటలకు పట్టణంలోని గాంధీ నగర్ కాలనీలో కార్డన సెర్చ్ నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కాలనీవాసులకు చట్టాలపై అవగాహన కల్పించారు. అలాగే దుర్వ్యసనాలైన గంజాయి లాంటి మత్తు పానీయాలకు బానిసలై కుటుంబాలను విచ్ఛిన్నం చేసుకోవద్దని అన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు తమ కాలనీలో సంచరించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గుర్తు తెలయని ఫోన్ నంబర్లకు ఎలాంటి సమాచారం ఇవ్వకూడదని అన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. వాహనాలు నడిపేవారు రోడ్డు నిబంధనలను అనుసరించి సరైన ధ్రువపత్రాలను వెంట పెట్టుకోవాలని సూచించారు. కార్డన్ సెర్చ్ సందర్భంగా 42 ద్విచక్ర వాహనాలతో పాటు ఒక టాటా మ్యాజిక్ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ధ్రువపత్రాలను పరిశీలించి వాహన యజమానులకు వాహనాలను అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్, కడం ఎస్ఐలు రాహుల్ గైక్వాడ్, కృష్ణ సాగర్ రెడ్డి లతోపాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధిలో పర్యాటకరంగాన్ని పరుగులు పెట్టించాలి


- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జిల్లాలో పర్యాటకరంగాన్ని అభివృద్ధి చేసి టూరిజం హబ్‌గా తీర్చిదిద్దే దిశగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలో అటవి, దేవాదాయ, ఆర్కియాలజీ మ్యూజియం, విద్యా, ఇరిగేషన్, పర్యాటక శాఖ, పర్యాటక సంస్థ, సమాచార, యువజన సర్వీసులు, మైనార్టీ శాఖల అధికారులతో జిల్లా పర్యాటక అభివృద్ధి మండలి సమావేశం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధ్యక్షతన జరిగింది.

ఈ సమావేశంలో జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలనే అంశాలపై చర్చించారు. పర్యాటక శాఖ ద్వారా మంజూరైన నిధులను సమర్థవంతంగా వినియోగిస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. గణపురం చెరువు, పాండవుల గుట్ట వద్ద చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. కొడవటంచలో రాష్ట్ర పర్యాటక శాఖ ద్వారా విడుదలైన బడ్జెట్ వినియోగించాలనే అంశంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా మే నెలలో జరుగనున్న సరస్వతి పుష్కరాల సందర్భంగా కాళేశ్వరం వద్ద అవసరమైన ఏర్పాట్లు, మైలారం ప్రాంతంలోని అభివృద్ధి పనులకు అటవీ శాఖ భాగస్వామ్యం, పాఠశాలలు, కాలేజీల్లో యువ టూరిజం క్లబ్‌ల ఏర్పాటు ద్వారా టూరిజం అభివృద్ధి చేయు అంశాలపై చర్చించారు. తెలంగాణ దర్శిని ద్వారా పర్యాటక ప్యాకేజీలను రూపొందించి పర్యాటకులకు అందుబాటులోకి తేవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో అటవీశాఖ అధికారి నవీన్ రెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ, సహాయ పర్యాటక శాఖ అధికారి సూర్య కిరణ్, పర్యాటక శాఖ డీఈ ధనరాజ్, జిల్లా పర్యాటక, యువజన సర్వీసుల శాఖ అధికారి రఘు, ఆర్కియాలజీ ఏడీ రాములు నాయక్, దేవాలయశాఖ ఈ ఓ మహేష్, విద్యా శాఖ ఏఎంఓ లక్ష్మణ్ పర్యాటక శాఖ ఏఈ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# మళ్ళీ అవే అహం మాటలు?



మాజీ సీఎం కేసీఆర్ మాట్లాడక మాట్లాడక మళ్ళీ అవే అహం మాటలు మాట్లాడుతున్నారు!దొర ఈసారి గతంలో మాదిరే తమ ఓటమికి ప్రజలే కారణం అంటారు. ప్రజలు అత్యాశకు పోయి కాంగ్రెస్ కు ఓట్లు వేశారు అంటారు కేసీఆర్!ఇంత పెద్ద మాట! ఒక ఉద్యమ పార్టీ నేత, రాజకీయంగా దశబ్దాల అనుభవం, ఎన్నో గుణపాఠాలు, పది ఏండ్లు సీఎం గా పని చేశారు. ఆ అనుభవపు మాటలు ఇవేనా? ఒక తెలంగాణ ఉద్యమ సహచరుడిగా ప్రశ్నిస్తున్నాను.ఎందుకిలా!

### పథకాలు ఓకే!

రెండు సార్లు వరుసగా తెలంగాణ లో విజయం సాధించి, సీఎం గా తాను నచ్చిన విధంగా పాలన చేసిన వాడు, రైతు బంధు, షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి, దళిత బంధు లాంటి స్కీం లను తీసుకొచ్చిన వాడు, తమిళనాడు, ఢిల్లీ తర్వాత ఉచితాలను భారీగా అమలు చేసిన వాడు! ఒక్కసారి ప్రజలు ఓడించగానే, ప్రజలు కాంగ్రెస్ ఇచ్చిన హామీల, గ్యారంటీ లకు అత్యాశకు పోయారని మాట్లాడడం ఎంతవరకు సబబు, మిగితా విషయాల, రాజకీయాల జోలికి నేను వెళ్ళ దలుచుకోలేదు, ప్రజలను తప్పుపట్టడమే కాదు,

### ప్రజలు అత్యాశకు పోయారా!

ప్రజలు అత్యషకు పోయారు అని పేర్కొనడం చూస్తే, ఇంకా మాజీ సీఎం కేసీఆర్ లో ఓటమి పై సరిఅయిన సమీక్ష, ఆత్మ విమర్శ చేసుకున్నట్లు గా లేదు, అనేది స్పష్టంగా కనిపిస్తున్నది. కేసీఆర్ రాజకీయ జీవితం అనేది ప్రజలు పెట్టిన బిక్ష, వారికి మీ పాలన లో గౌరవం లభించలేదు. ప్రజలు ముఖా ముఖిగా మిమ్మల్ని మీ పది ఏండ్ల పాలనలో కలిసే అవకాశం ఇచ్చారు. మీ ఎమ్మెల్యే లకు, ఎంపిలకు, మంత్రుల కు సైతం మిమ్మల్ని కలవడానికి ఎన్నో ఆంక్షలు, ఎవరో కౌన్ కిస్కా గాండ్లు, దయ తలిస్తేనే మీ దర్శనం!గ్రౌండ్ రియాలిటీ రిపోర్ట్ కేవలం ప్రభుత్వ ఇంటలీజెన్స్ పైనే ఆధారపడడం, ఉద్యమం లో కలిసి నడిచిన వారికి, అసలు గౌరవమే లేదు. తెలంగాణ ఉద్యమం తెలంగాణ ఆత్మగౌరవం కోసం ప్రధానంగా సాగింది. అధికారం లోకి వచ్చాక ఆ ఆత్మగౌరవంకు పెద్ద గాయం చేశారు. అందుకు ప్రధాన భాద్యులు కేసీఆర్ మాత్రమే!

### స్వార్థ పొలిటికల్ గ్యాంగ్!

తెలంగాణ ఉద్యమం ను వ్యతిరేకించిన స్వార్థ పొలిటికల్ గ్యాంగ్ కు, అధికారంలోకి రాగానే మీ పక్కన చేర్చుకుని, కాంగ్రెస్ కు విపక్ష హొదా లేకుండా చేసి, చంకలు గుద్దుకుంటూ, వారికి మంత్రి పదవులు, ఎమ్మెల్యే, ఎంపీ టిక్కెట్లు ఇచ్చారు.మీ వద్ద పదవులు పొందిన వారే మీరు అధికారం కోల్పోగానే ఎటువైపుకు వచ్చి చేరారో, చేరుతున్నారో చూస్తున్నారు. మొత్తం మీ సంతానం కేటీఆర్, కవితమ్మ,బంధువు సంతోషయ్య రాజ్యం చేస్తిరి, మొదటి మీ ఐదు ఏండ్ల పాలనలో అసలు మహిళా మంత్రి లేకుండానే ముగిసింది. అన్ని పదవులకు మీరు అధికారం లో ఉన్నంత కాలం కొనసాగింపులేనాయే!

### నేలమీద క్యాడర్‌తో కనెక్షన్ కట్!


నికార్సైన బిఆర్ఎస్ క్యాడర్ తో కనెక్షన్ కట్ అయిపోయింది.జాతీయ పార్టీ అంటూ రాష్ట్రాలు తిరిగి తెలంగాణ లో డొల్ల చేసుకుంటిరి! నచ్చినోళ్లకు,పదవులు, నచ్చనోళ్లకు అవమానాలు, ఈసడింపులు, ఇవన్నీ మర్చిపోతే ఎట్లా కేసీఆర్ జీ! చీటికీ, మాటికీ మీ పార్టీ ఓటమికి ప్రజలదే తప్పు అని అనడం, కనీసం విపక్షం నేతగా అసెంబ్లీ కి వచ్చి, జనంలోకి వచ్చి మాట్లాడాలి అనే ఓపిక లేకుంటే ఎట్లా! ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో మాజీ సీఎం, దివంగత ఎన్టీఆర్ లాంటి వాడిని కూడా ప్రజలు పదవీ చ్యుతుడను చేసారు, అది మీకు తెలుసు! రాజకీయాల్లో గెలుపు, ఓటములు సహజం, సహనం, ఆత్మవిమర్శ అవసరం! కానీ ప్రజల మీద అలుగుతే మొదటికే మోసం అవుతుంది. సముద్రం మీద అలిగినట్లు అవుతుంది. తెలంగాణ కు రక్షకులం అని చెప్పుకుంటే కుదరదు! ఆచరించి చూపండి! సర్వేలు చూసి మురిసి పోవద్దు!కనీసం 50 శాతం అభ్యర్థులను మార్చినా బాగుండేది!ఎమ్మెల్యే ల మీద ప్రజల పిర్యాదులను సైతం పట్టించుకోకుండా 2023 అసెంబ్లీ ఎన్నికల్లో టిక్కెట్ లు ఇచ్చింది నిజం కాదా!అందుకే ప్రజలను తప్పు పట్టడం మానండి! బీ ప్రాక్టికల్ కేసీఆర్ జీ!



ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు,
9951865223,

# దివ్యానగర్ కాదది "సింగరేణి నగర్"!

**""సింగరేణీయుల" నుండి నల్ల మల్లారెడ్డి డెవలప్మెంట్ పేరుతో వసూలు చేసిన రూ.10.26 కోట్లపై ఉన్నతస్థాయి కమిటీతో విచారణ జరిపి న్యాయం చేయాలి!**



సింగరేనోళ్లు అంటే గడుసొల్లంటరు కొందరు. పట్టణాల్లో ఎల్.ఐసి,ఎన్ జీవో, పోస్టల్, రెవిన్యూ, బ్యాంక్, టీచర్స్, పోలీస్, జర్నలిస్ట్, ఎక్సైజ్ ఇలా ప్రభుత్వ ఉద్యోగుల కాలనీలు దర్శనమిస్తాయి. కాని దీపం పట్టుకొని వెతికినా సింగరేణి కాలనీలు కనిపించవు. బాయిల దిగి బొగ్గు తీసి మీదికెక్కినంక కుటుంబంతో ఉండడానికి ఏసుకున్న గుడిసెలను, కట్టుకున్న రేకుల షెడ్లను అక్రమ కట్టడాలుగా యాజమాన్యం కూలగొట్టింది. దానితో సమ్మెలు చేసి కోల్ బెల్ట్ ఏరియాలలో రేకుల షెడ్లను నిర్మించుకున్నారు. అందుకు ఇండ్ల స్థలాల కొనుగోలు డబ్బులను బ్యాంకు నుండి అప్పులు ఇప్పించడానికి మరియు అట్టి లోన్ డబ్బులను వేతనాల నుండి ఇఎంఐ(ఈక్వేటెడ్ మంత్లీ ఇన్ స్టాల్మెంట్) పద్ధతిన మినహాయించి బ్యాంకుకు చెలించడానికి ప్రణాళికలు వేసుకున్నాడు. వేతనాలలో బ్యాంక్ లోన్స్ మినహా యింపు గురించి ప్రయత్నాలు నెరపి సఫలం అయ్యాడు.న్యూఢిల్లీ నుండి సెంట్రల్ లేబర్ కమీషనర్ 1989 అక్టోబర్ 5న Lr. No.15(9)/ 89/LS.11 ద్వారా అలాగే సింగరేణి యాజమాన్యం నుండి 1989 అక్టోబర్ 28 న Lr. No. P.23/4807 /IR/1969 గల ఉత్తర్వులతో ఇండ్ల స్థలాల కొనుగోలుకై కార్మికులు తీసుకున్న బ్యాంక్ లోన్స్‌ను వేతనాల్లో ఇఎంఐ ప్రాతిపదికన మినహా యించి బ్యాంకుకు చెల్లించాలని సూచించుచు సింగరేణి అన్ని డివిజన్ ల జనరల్ మేనేజర్లకు,హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్‌లకు ఆదేశాలు జారీ అయినవి. అప్పుడు "హర్ష ఎస్టేట్ ప్రైవేటు లిమిటెడ్ " మేనేజింగ్ డైరెక్టర్ గా నల్ల మల్లారెడ్డి, అతని సిబ్బంది, సింగరేణి గనుల ఏరియాలలో తిరిగి 1991 నవంబర్ 22 నాటికి దాదాపు 901 మంది కార్మికులతో,ఉద్యోగులతో, అధికారులతో 'కాచవాని సింగారం' గ్రామ శివారులోని సర్వే నంబర్స్ 43, 44, 55, 56, 57, 58, 59, 60, 61, 62, 63, 64, 720, 721లలో "గ్రామ పంచాయతీ లే అవుట్"లో 200 చదరపు,260 చదరపు గజాల విస్తీర్ణంలో ఇండ్ల స్థలాలను కొనుగోలు చేయడానికి, మరియు వేతనాల నుండి బ్యాంక్ లోన్స్ రికవరీ గురించి అంగీకార పత్రాలపై సంతకాలు పెట్టించుకున్నారు.ఇండ్ల స్థలాల రిజిస్ట్రేషన్ నిజ పత్రాలను/ ఒరిజినల్ సేల్ డీడ్స్ లను "స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ P&SB డివిజన్ గన్ ఫౌండరీ బ్రాంచ్, హైదరాబాద్" వద్ద కుదువపెట్టించి చెక్ రూపకంగా భూమి స్వంత దారులకు డబ్బులను చెల్లింప చేశారు. మీ లోన్స్ డబ్బులను సింగరేణి యాజమాన్యం సకాలంలో మాకు పంపించనందున "ఓవర్ డ్యూ ఇంట్రెస్ట్ "చెల్లిస్తేనే ఒరిజినల్ సేల్ డీడ్స్ ఇస్తామని మెలిక పెట్టారు.అప్పుడు వ్యాసకర్త నైన నేను ""కరీంనగర్ జిల్లా వినియోగదారుల ఫోరం"లో కేసు వేయగా ఓవర్ డ్యూ ఇంట్రెస్ట్ లేకుండానే ఒరిజినల్ సేల్ డీడ్ పేపర్స్ ఇచ్చారు. కాని 36 నెలలు హోమ్ లోన్ డిపాజిట్ కింద మినహాయించుకున్న డబ్బులకు బ్యాంక్ వారు ఎగనామం పెట్టారు.ఇండ్ల స్థలాలు కొనుగోలు చేసిన సింగరేణీయులు బ్యాంక్ లోన్స్ వడ్డీ రూపేణా దాదాపు రూ.25,76,860 లను చెల్లించారు.హోమ్ లోన్ డిపాజిట్ కింద రికవరీ అయిన రూ.11,35,260 లను కోల్పోయి బ్యాంక్‌కు లాభం చేశారు.

అలాగే గ్రామ పంచా యతీ లేఅవుట్‌లో ఉన్న ఇండ్ల స్థలాలను హుడలో క్రమబద్ధీకరణ చేసుకోవాలి. అందుగురించి పురోగమన ఔత్సాహికులైన కొంత మంది సింగరేణీ యులు ""దివ్యానగర్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసి యేషన్"" గా ఏర్పడి కోల్ బెల్ట్ ఏరియా తిరిగి ప్లాట్ ఓనర్స్‌ను సమీకరించి ఇండ్ల స్థలాల డెవలప్మెంట్ కార్యాచరణ కు పూనుకున్నారు. సింగరేణి లో సివిల్ ఇంజనీర్‌గా పనిచేసి రాజీనామా చేసి రియాల్టర్‌గా పని చేసిన రవీందర్ రెడ్డి డెవలప్మెంట్ చేయడానికి ముందుకు వచ్చాడు.కాని బ్యాంక్ లోన్స్ ద్వారా మనకు ఇండ్ల స్థలాలను కొనుగోలు చేయింపచేసిన నల్ల మల్లారెడ్డికే ఇవ్వడానికి నిర్ణయం అయింది. సింగరేణి సంస్థ సివిల్ ఇంజనీర్లు డెవలప్మెంట్ చార్జీలను అంచనా వేసి,అలాగే హైదరాబాద్ పరిసరాల్లో రియాల్టర్స్ తీసుకుంటున్న చార్జీలను తెలుసుకుని చదరపు గజానికి రూ.350 నుండి రూ.400 లోపు ఇవ్వవచ్చునని అంచనాకు రావడం జరిగింది. నల్ల మల్లారెడ్డి మధ్య అసోసియేషన్ మధ్య పలు దఫాలుగా చర్చలు జరిగినవి.నేను చేసిన పనులు మన్నికగా ఉంటాయని, నాణ్యమై న సిమెంటు, ఐరన్, కరంటు వైర్లు, స్ట్రీట్ లైట్లు, వాటర్ పైపులు వేస్తానని, నమ్మ బలికిండు. చివరకు చదరపు గజానికి రూ.425 కింద డెవలఫ్‌మెంట్ చేయడానికి, హుడాలో క్రమ బద్ధీకరణ చేయడానికి మల్లారెడ్డి అంగీకరించారు. సింగరేణీయుల శ్రమ ఫలితంతో ఉత్పత్తి అయిన బొగ్గుతో కరంటు తయారీ, పారిశ్రామిక అభివృద్ధి జరిగింది.అలాగే చేసిన శ్రమకు ఫలితంగా పొందిన వేతనాలతోనే ఇండ్ల స్థలాల కొనుగోలుకై తీసుకున్న బ్యాంక్ లోన్స్, వడ్డీ, రిజిస్ట్రేషన్, హెచ్ఎండిఎ రెగ్యులరైజ్, డెవలప్మెంట్ పీజు,పన్నుల పేర వందలకోట్ల రూపాయలను భూమి పట్టా దారు లకు, నల్ల మల్లారెడ్డికి,ప్రభుత్వ ఖజానాకు సింగరేణి బొగ్గే మూలధనం.కాబట్టి ""దివ్యానగర్ పేరును సింగరేణినగర్‌గా""" పిలవడం సమంజసమే. ఎస్టేట్ డెవలపర్స్, బిల్డర్స్ వలన నష్టపోతున్న వారికి న్యాయం చేయాలని "సంరక్షక్" అనే స్వచ్ఛంద సంస్థ గౌరవ సుప్రీంకోర్టులో కేసు వేశారు.దానిపై విచారించిన ప్రధాన న్యాయమూర్తి కె.జి బాలకృష్ణన్,జస్టిస్ బాల సుబ్రహ్మణ్యం, జస్టిస్ రవీందర్ లతో కూడిన త్రిసభ్య బెంచ్ ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. విస్తృతమవుతున్న సామాజిక, ఆర్థిక,న్యాయ పరిధి దృష్ట్యా సంపద సృష్టి కర్తలకు న్యాయం చేయాలని సూచించారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా సామాజిక కోణంలో ప్రత్యేక చొరవతీసుకుని సింగరేణీయుల నుండి నల్ల మల్లారెడ్డి డెవలప్ మెంటు పేరుతో తీసుకున్న రూ.10.26 కోట్లపై,డెవలప్మెంట్ చేయకుండా చేతులెత్తేసిన చర్యలపై "ఉన్నత స్థాయి విచారణను జరిపించి న్యాయం చేయాలని కోరుతున్నారు.



మేరుగు రాజయ్య
సెల్ నంబర్ :
9441440791.



## గుండె నిండా ధైర్యం!!

గుండె నిండా ధైర్యంతో
విజయాన్ని అందుకో
ఆత్మవిశ్వాసం పెంచుకొని
ఆనందాన్ని పంచుకో..!!

వదిలేస్తే పిరికితనం
వీరుని వోలె కనిపించు
నమ్మకాన్ని పెంచుకుంటే
గెలుపు మంత్రం ఫలించు..!!

నిత్య సాధనతో
నింగినే గెలవచ్చు
వదలని పట్టుదలే
గమ్యాన్ని కల్పించు..!!

చరిత్రలో ఒక పేజీ
నీకై ఉంటుంది
అహర్నిశలు శ్రమిస్తే
ఆశయం సిద్ధిస్తుంది..!!

తల్లిదండ్రుల ఆశలు
సాధించి చూపించు
కలలు కన్న సామ్రాజ్యం
విస్తరించి నిలువు..!!

నిత్యశ్రమనే గెలుపు
జీవితపు మలుపు
కష్టమే నీ ఫలితం
అందించు అదే
ప్రతిఫలం..!!

ఆశలే నిచ్చెన
ఆలోచనే మార్పు
అభివృద్ధే జీవనం
శ్రమనే ప్రగతి..!!

విజ్ఞానమే సంపద
వినయమే ఆభరణం
సంతోషమే బలం
దుఃఖమే బలహీనత..!!

**కొప్పుల ప్రసాద్**
**నంద్యాల, 9885066235**

## నికృష్టులారా!

అన్యాయాలకు పాల్పడితే
ఎదురుతిరుగుతా
అకృత్యాలకు ఒడిగడితే
ఎండగడతా
అమానుషంగా ప్రవర్తిస్తే
తగినబుద్ధిచెబుతా
నోరు మూస్తే విదిలించుకుంటా

కళ్ళు కప్పితే విరుచుకపడుతా
చేతులు బందిస్తే తెంపుకుంటా
కాళ్ళు కట్టేస్తే తెంచుకుంటా
తలుపులు బిగిస్తే పగులగొడతా

రాక్షసులు అయితే శాస్తిచేస్తా
నలుగురుని ప్రోగుచేస్తా
నికృష్టులపనిపడతా
ఆడవారికి కొండంత

పేదవారిని కూడుస్తా
ప్రోత్సహిస్తా
ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తా
ప్రజాస్వామ్యాన్నికాపాడుతాజి

**గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,**
**భాగ్యనగరం**

# బస్తర్‌లో సమాధానం దొరకని ప్రశ్నలు?

నారాయణపుర్ జిల్లాలోని అడవుల్లో యూనిఫాం ధరించిన ఏడుగురు మావోయిస్టులను చంపినట్లు ఛత్తీస్‌గఢ్ పోలీసులు ప్రకటించిన వారం తర్వాత డిసెంబర్ 19నాడు వారిలో నలుగురి స్వస్థలం కుమ్మంకి వెళ్లాను. అప్పటికే వారిని ఖననం చేసేసారు. వారు సాధారణ గ్రామస్తులని, మావోయిస్టులు కాదని, తమ పొలాలకు దగ్గరగా ఉన్న పొదల్లో భద్రతా బలగాలు చంపాయని వారి కుటుంబీకులు చెప్పారు. డిసెంబరు 12న కాల్పులు జరిగినట్లు పోలీసులు చెబుతున్న ప్రదేశానికి గ్రామస్థులు నన్ను తీసుకెళ్లారు. ఇది కల్హాజా–దొండెర్ బెడా అడవుల నుంచి రెండున్నర గంటల నడకదూరంలో ఉంది. మేము ఆ ప్రాంతాన్ని పరిశీలిస్తున్నప్పుడు, ఊహించని దుర్వాసన వచ్చింది. ముక్కు మూసుకుని దగ్గరకు వెళ్ళేసరికి, ఒక యువకుడి కుళ్ళిపోతున్న శరీరం కనిపించింది. అతను రెండు ఛాయలున్న నీలం రంగు టీ–షర్టు, షార్ట్స్ (నిక్కరు) వేసుకుని ఉన్నాడు. తల ఒక వైపుకు తిరిగి, చేతులు బయటకు చాచి, ఒక కాలు మడిచి ఉంది. తలలో పెద్ద రంధ్రం ఉంది. పురుగులు అతని కళ్ళను కప్పేసాయి. గ్రామస్తులు అతన్ని కుమ్మం గ్రామ పటేల్, గుడ్సా ఓయం కుమారుడు నెవ్రు ఓయంగా గుర్తించారు. డిసెంబర్ 12న పోలీసు కాల్పుల్లో మరణించిన నలుగురిలో గుడ్సా ఓయం కూడా ఉన్నాడు. ఆ మృతదేహం కనిపించడంతో, వివాదాస్పద ఎన్‌కౌంటర్ లో మృతుల సంఖ్య ఎనిమిదికి పెరిగింది. ఘటనల గురించి పోలీసులు చెప్పిన కథనం చుట్టూ ఉన్న ప్రశ్నలు మరింత చిక్కనయ్యాయి.

### విభిన్న కథనాలు:

కుమ్మం గ్రామం నారాయణపూర్, ఓర్చా బ్లాక్‌లోని రేకావాయ పంచాయతీలో వున్నది. ఈ బ్లాక్ అబూజ్‌మాడ్‌లో ఉంది, అక్షరాలా 'తెలియని కొండలు'. ఎక్కువగా సర్వే చేయని ప్రాంతం, దీనిని నిషేధిత కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్ట్) గెరిల్లాలు స్థావరంగా ఉపయోగించుకుంటున్నారు. 2024లో, ఛత్తీస్‌గఢ్ పోలీసులు మాడ్ బచావో అభియాన్ ('మాడ్‌ను సంరక్షించండి' ప్రచారోద్యమం) పేరుతో మావోయిస్టు వ్యతిరేక దాడిని ప్రారంభించారు. అందులో భాగంగా, (అబూజ్)మాడ్, దాని చుట్టుపక్కల ప్రాంతాలలో 100 మందికి పైగా మావోయిస్టులను చంపినట్లు



పోలీసులు చెబుతున్నారు. 2024లో బస్తర్‌లో మావోయి స్టుల హత్యలుగా పోలీసులు ప్రకటించిన 217 మరణాలలో ఇవి దాదాపు సగం. అయితే, ఈ మరణాలలో చాలా వాటిని మృతుల కుటుంబాలు సవాలు చేస్తున్నాయి. పిల్లలు గాయపడడానికి సంబంధించి తీవ్ర నిరసనలు వ్యక్తం అవడంతో డిసెంబర్ 17న పోలీసులు విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో, మావోయిస్టులు కాల్చిన గ్రెనేడ్ల నుంచి వచ్చిన ముక్కలు ఈ గాయాలకు కారణమనిబీ సీనియర్ కేడర్ కార్తీక్ అలియాస్ దస్రు చుట్టూ ఒక మానవ రక్షణ వలయాన్ని ఏర్పరచార ని, పిల్లలు ఈ వలయంలో భాగమని అన్నారు.

డిసెంబర్ 13న మావోయిస్టులు విడుదల చేసిన ఒక ప్రకటనలో కార్తీక్ సీనియర్ సీపీఐ (మావోయిస్ట్) నాయకుడని, ఆయన వయసు 62 సంవత్సరాలు, అనారోగ్యంతో ఉన్నారని, అతనికి సహాయంగా రామ్లి మడ్కమ్ ఉన్నదని చెప్పారు. ఈ ఘటనలో మరణించిన ఏడుగురిలో, కార్తీక్, రమ్లీలు మాత్రమే మావోయిస్టులు. మిగతా ఐదుగురు సాధారణ గ్రామస్తులు. ఈ వాదనలను స్వతంత్రంగా దర్యాప్తు చేయడానికి, కుమ్మానికి, పోలీసుల కాల్పుల్లో మరణించిన మరో వ్యక్తి గ్రామమైన లెకావాడాకు వెళ్ళాను. కొండలు, అడవులు ఉన్న ప్రాంతం గుండా సాగిన కష్టతరమైన ప్రయాణం ముగింపుకు వచ్చేసరికి పోలీసులు చెప్పిన దానికంటే ఆశ్చర్యకరమైన, చాలా భిన్నమైన కథనం బయటపడింది. రెండు గ్రామాల్లోనూ నిస్సహాయులపై భద్రతా బలగాలు కాల్పులు జరిపినట్లు స్థానికులు తెలిపారు. కుమ్మం ఒక చిన్న గ్రామంబీ ఇందులో సుమారు 13 ఇళ్ళు ఉన్నాయిబీ ఇవన్నీ ఓయామ్ గణానికి చెందినవి. బస్తర్‌లో ఈ ప్రాంతంలో నివసిస్తున్న ఇతర ఆదివాసీ రైతుల మాదిరిగానే, వీరు కూడా ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి కొత్త అటవీప్రాంతాన్ని శుభ్రం చేసి పెండా ఖేతీ అని పిలిచే పోడు వ్యవసాయం చేస్తారు. గ్రామంలోని ప్రస్తుత పెండా లేదా తాత్కాలిక వ్యవసాయ క్షేత్రానికి వెళ్లడానికి సుమారు ఒక గంటపాటు కొండపైకి ఎక్కాలి. ప్రతి సంవత్సరం సెప్టెంబరులో, వర్షాకాలం ముగియగానే , గ్రామస్థులు యిక్కడ తాత్కాలిక ఇళ్లను కట్టుకొంటారు. మార్చి నెలవరకు అక్కడే ఉండి, స్థానిక చిరుధాన్యం కోస్రా బియ్యాన్ని పండిస్తారు. 2024లో కురిసిన నిరంతర వర్షాల వల్ల ఈ సారి పంట ఆలస్యమైంది అని అయు ఓయం (50 సం)వివరించారుబీ ఇతర గ్రామస్తులు కూడా అక్కడికి చేరారు. గ్రామంలోని కొందరు యువకులు సమీపంలోని అడవిలో దాక్కోవాలనుకున్నారు మావోయిస్టులకు మద్దతునిస్తున్నామని భావించే భద్రతా బలగాలు తమను లక్ష్యంగా చేసుకుంటాయని భయపడే ఈ ప్రాంత ప్రజల సాధారణ ప్రతిస్పందన అది. అడవిలోకి పారిపోయిన పదహారు మందిలో తొమ్మిది మంది అమ్మాయిలు వున్నారు. వఖర్జూరపు పొదలతో నిండిన అడవికి నన్ను తీసుకెళ్ళిన 19 ఏళ్ల మనీష్ ఓయం కూడా ఆ గుంపులో ఉన్నాడుబీ భద్రతా బలగాలకు కనిపించకుండా ఉండటానికి ఆ గుబురు గడ్డిలో ఎలా ఆశ్రయం పొందారో నడుము ఎత్తులో ఉన్న పొదల్లోకి వంగి కూర్చుని చూపించాడు. తామంతా రాత్రి అక్కడే గడిపామని చెప్పాడు. స్థానికులు దీనిని చింద్ ఘాస్ (చిందు గడ్డి)అని పిలుస్తారు. గడ్డి గుబురుగా ఉన్నప్పటికీ, మర్నాడు ఉదయం పోలీసులు వారి ఉనికిని గుర్తించారు. వారిపై నుంచి ఎగిరిన "చిన్న విమానం" (బహుశా భద్రతా బలగాలు ఉపయోగించే డ్రోన్) వల్ల కావచ్చని మనీష్ అనుమానిస్తున్నాడు.

**మాలినీ సుబ్రమణ్యం.**

## ఏదో ఒకరోజు వస్తాను..!!

ఏదో ఒకరోజు
నేనొక విస్ఫోటనమై
విజృంభించక మానను
అవినీతి శృంఖలాల్ని తెంపి
తారతమ్యాల్ని ఓడించక మానను

ఏదో ఒక సందర్భానికి
నేనొక అగ్ని శిఖరమై
బడజ్వాలాగ్ని కక్కక మానను
ధన గర్వాధికారానికి
కోరలు తుంచి కరాళనృత్యం చేస్తూ
అంతిమ గీతం ఆలపించక మానను

ఏదో ఒక దినాన
నేనొక సునామీ కాకపోను
భూబకాసురుల దురహంకారాన్ని
నీటి కెరటాల నీతి అలలుగా ఎగసి
మస్తిష్కాన్ని సుద్ది చేయకమానను


ఏదో ఒక తరునాన
నేనొక సమరశంఖాన్ని కాకపోను
విప్లవ నినాదపు అడుగులుగా
విస్తరించుకుపోతూ
సగటు జీవన వ్యధకు చరమగీతమై
ఎలుగెత్తి చాటించక మానను

ఏదో ఒక రోజున
ఒక కన్నీటి బొట్టును
మట్టికి అంకితం ఇవ్వక మానను
పేద బతుకుల రూపురేఖల మార్పుకై
ఎదురు దెబ్బల గురుతులనే
మట్టి పిడికిలిగా మార్చుకుంటూ
విజయ శంఖం పూరించక మానను

ఏదో ఒకరోజున
గెలుపు రేఖలై చొచ్చుకు వస్తాను
చీకటి బతుకుల వెలుగు కోసం
నిరంతరం శ్రమించక మానను
విప్లవ జెండా రెపరెపలాడించక మానను

ఏదో ఒక దినం
ఎర్రబడే కళ్ళతో ఎరుపు రేఖనై
లోకాన్ని జల్లెడ పడుతూ వస్తాను
బల్ల కింద చేతి నరాలను ఉండచేసి
మధ్య తరగతి బ్రతుకుల్లో
లంచాల రాకాసిని శిక్షించక మానను

**- నరెద్దుల రాజారెడ్డి**
**సెల్ : 9666016636**



## దుఃఖ సాగరం!

ప్రేమసాగరాల్లో ఓలలాడే ప్రేమికుల్ని చూస్తే
నాలో విస్మయం విరబూస్తోంది.
నే పూలడిగితే ముళ్ళదండని మెడకి తొడిగారు.

ఆనందపు అంచులకై చూపుల్ని
ఎగదోసినప్పుడు,
నాకు దుఃఖపు దుమ్మురేణువులు
దర్శనమిచ్చాయి.
నే వలపుగీతికలకై కాంక్షించినప్పుడు,
చల్లని నిట్టూర్పుల్లో ముక్కు చీదపట్టాను.
చుట్టూరా మనసులు నా గుండె గులాబీలని
దిగులు దివిటీలో తుంచాయి.

ఏ తోడూ లేకుండా పోయిందిప్పుడు.
ఓ క్షణం నిట్టూర్చి, తీవ్ర వేదనల్లోంచి
విడివడ్డాను.
అయినా, పిచ్చోళ్ళ చెయ్యట్టుకునే సమయం
ఎవరికీ ఉండదు.
నా నీడని నేనే తరచూ అపరిచితంగా
పరికిస్తాను.

మీరు దీన్నే జీవితమంటే నేనిలానే జీవిస్తాను.
ఒక్క మాటైనా మారు పలకకా, నా కన్నీళ్ళనే
తాగుతాను.
దుఃఖసంద్రాల్లో ఈదుతున్న నాకు,
పిల్లకాలువంటి ఈ దుఃఖానికే భయమేస్తుందా?

**(మూలం : ప్యాసా (1957) చిత్రం నుండి సాహిర్ లుధియాన్వి అందించిన సాహిత్యం)**

**బాలాజీ పోతుల**
**8179283830**

# ఆశా వర్కర్లను ఆదుకోవాలి!

దేశంలో జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా దేశ వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలలో పని చేస్తున్నవారు ఆశా వర్కర్స్, "అక్రిడేటెడ్ సోషల్ హెల్త్ వర్కర్" (ఆశా)గా వీళ్లను పిలవడం జరుగుతుంది, వీరు మినిస్టర్ ఆఫ్ హెల్త్ మరియు ఫ్యామిలీ వెల్ఫేర్ కింద వీరిని తీసుకున్నారు, అదేవిధంగా వీరు జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్‌లో కూడా బాగం గానే పనిచేస్తున్నారు, అయితే 2005 లో ప్రారంభం అయింది ఈ మిషన్, అలా నేటి వరకు విరి సేవలు కొనసాగుతూనే వస్తుంది. వీరు మొదట్లో వాలంటీర్ గానే కొద్దిగా గౌరవ వేతనం తో నేటికీ అలానే పనిచేస్తున్నారు.

### ఆరోగ్య వర్కర్లు :

ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో ఆశ వర్కర్లు చాలా క్రియాశీలకంగా పని చేస్తూ ఉంటారు, ఆరోగ్య సంబంధిత అన్నీ రకాల సేవలు గ్రామ స్థాయిలో వీరు ప్రజలకు అందించడం జరుగుతుంది, గ్రామాలలో ముఖ్యంగా వీరు విధులు మనం గమనిస్తే ఆరోగ్య సంబంధిత సలహాలు, సూచనలు, వీరు నిత్యం గ్రామంలో తిరుగుతూ చెప్పాల్సి ఉంటుంది, ముఖ్యంగా పారిశుధ్యం, దోమల నివారణ, డెంగ్యూ,మలేరియా, వంటి తీవ్ర వ్యాధులు ప్రజలకు కలగకుండా వీరు నిత్యం హెల్త్ ఎడ్యుకేషన్ చేస్తుంటారు, అదేవిధంగా ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలి, ఎలా ఆరోగ్యంగా ఉండాలి అనేది చెప్తూ విధులు నిర్వర్తిస్తున్నారు, గ్రామీణ స్థాయిలో గర్భిణి స్త్రీలు లకు మరియు చిన్న పిల్లల సంరక్షణ కూడా విరి బాధ్యత గా ఉంటుంది, వారికి అన్ని రకాల వైద్య ఆరోగ్య సౌకర్యాలు వీరు కల్పించాల్సిన అవసరం ఉంటుంది, నిత్యం వారి అరోగ్య రిపోర్ట్ తీసుకోని మండల హెల్త్ సెంటర్ లో చెప్పాల్సిన అవసరం ఉంటుంది, దానితో పాటు మొత్తం హెల్త్ సమాచారం తీసుకోవాల్సిన బాధ్యత కూడా వీరిదే, కాబట్టి పని భారం కూడా



అధికంగా ఉంటుంది అని చెప్పాలి.

### కొవిడ్‌లో విరి సేవలు అద్భుతం:

దేశంలో ఒక్కసారిగా హెల్త్ ఎమర్జెన్సీ వచ్చిన పని అయింది, కొవీడ్ లోక్ డౌన్ విధించినప్పుడు దేశంలో పెరుగుతున్న కేసులు దృష్ట్యా, ఒకరినీ ఒకరు ముట్టుకునే పరిస్థితి లేదు, సొంత బందువులు సైతం దగ్గరికి రాని రోజుల అవి, అలాంటి విపత్కర పరిస్థితుల్లో ఆరోగ్యం లెక్క చేయకుండా రోగుల కోసం నిరంతరం పని చేసిన వ్యక్తులు వీరు, విరి సేవలు మరువలేనివి అని చెప్పాలి.

### పని ఎక్కువ వేతనం తక్కువ:

ఆశా వర్కర్లు పని భారం చూస్తే వీరికి కనీసం 20 వేలకు పైచిలుకు వీళ్లకు ఇవ్వాల్సి ఉంటుంది, అందరి లాగే వీరికి రోజు ఏదో ఒక పని ఉంటుంది, అందులో కేంద్రం ప్రభుత్వం 60 శాతం మరియు రాష్ట్రం 40 కలిపి వీరికి గౌరవ వేతనం ఇవ్వాల్సి ఉంటుంది, అయితే మన రాష్ట్రం లో చూస్తే వీరికి నేడు ఉన్న సమాచారం ప్రకారం 9500 రూపాయలు అందుతున్నాయి అని తెలుస్తుంది, దేశ వ్యాప్తంగా చూస్తే అన్నీ రాష్ట్రాలలో పోలిస్తే మన రాష్ట్రం మరియు పక్క ఆంధ్ర ప్రదేశ్ కూడా కొంత మేర సమానంగా వేతనం ఇవ్వడం జరుగుతోంది, గతంలో 2021 కంటే ముందు విరి వేతనం ఇంకా తక్కువగా ఉండేది, కేసీఆర్ ప్రభుత్వం కొంత మేర పెంచి అది కాస్త పది వేలకు దగ్గర్లో కి చేసింది , అయితే వాస్తవాన్ని ఆశా వర్కర్లు కు కనీసం 20 వేల రూపాయలు ఇవ్వాలి వారి హక్కుగా మనం చెప్పవచ్చు, వారు అందరి ప్రభుత్వం ఉద్యోగాలతో పాటు చక్కగా విధులు నిర్వర్తిస్తున్నారు వారి సేవలు ప్రభుత్వము ఎందుకు గుర్తించడం లేదు? వారు ఒక్కరోజు సేవలు చేయకపోతే చాలా సమస్యలు వస్తాయి, కాబట్టి మిషన్‌లో భాగంగానే అటు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మరియు ఇటు రాష్ట్ర ప్రభుత్వం సైతం ఆశా వర్కర్ల విషయంపై చర్చించి, వీరికి వేతనం పెంచే విధంగా ప్రభుత్వాలు చర్యలు ముమ్మరం చేయాలి,



బొమ్మరగొనీ కిరణ్ అడ్వకేట్
సిటిజెన్ రైట్స్ ఫోరం తెలంగాణ
సెల్ : 7989381219

# భరోసా పథకాలకు ఎన్నికల కోడ్ గండం..!

- జాప్యం చేయడానికే జనంతో దోబూచులాట..?
- ఉద్దేశం ప్రకారమే వాయిదాలేస్తున్న ప్రభుత్వం




**వనపర్తి, జనవరి 31 (జనంసాక్షి) :** ఆది నుంచి అవరోధాలు ఎదుర్కొంటున్న ఆరు గ్యారెంటీల అమలుకు మళ్ళీ చిక్కులేర్పడే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఫ్రీ బస్సు ప్రయాణం మినహా 200 యూనిట్ల లోపు వాడకం దారుల కరెంటు బిల్లుల మాఫీ, రూ.500కే గ్యాస్ సిలిండర్లు, రూ.2 లక్షల పంట రుణాల మాఫీ పాక్షింగానే జరిగాయని లబ్ధిదారులతో పాటు విపక్షాలు చేస్తున్న ఆరోపణలు కొనసాగుతూనే ఉన్నాయి. అయితే దేశానికి రాజ్యాంగం సిద్ధించి 75 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా 26 జనవరి నుంచి రైతు భరోసా కింద పంట పెట్టుబడి సాయం, అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, భూములేని వ్యవసాయ కూలీలకి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రూ,12 వేల నగదు సహాయం చేస్తామని ప్రభుత్వం ఆర్భాటంగా చేసిన ప్రకటనల అమలుకు నోచుకోలేదు. మండలానికి ఒక అతి తక్కువ జనాభా కలిగిన గ్రామానికి మాత్రమే ఆ నాలుగు పథకాలకు లబ్ధి చేకూర్చి, పాలకులు చేతులు దులుపుకున్నారన్న విమర్శలు కొసాగుతున్నాయి. మిగిలిన గ్రామాల్లో ఫిబ్రవరిలో అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీల ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ కానున్నందున భరోసా పథకాలకు కోడ్ గండం తప్పదన్న చర్చ మొదలైంది. ప్రభుత్వం వద్ద ఆర్థిక వెసులుబాటు లేనందుకే ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేస్తున్నారని, ఈ తతంగమంతా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కనుసన్నలలోనే జరుగుతున్నదని బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఆరోపిస్తున్నారు.

### ఇందిరమ్మ ఇళ్ళదే అసలు సమస్య

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఇందిరమ్మ ఇండ్లు, రైతుభరోసా కింద పెట్టుబడి సాయం, కొత్త రేషన్ కార్డులు,వ్యవసాయ కూలీలకు ఆర్థిక సాయం అందించే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల అమలు జనవరి 26 నుంచి లాంఛనంగా ప్రారంభించారు. ఆ నాలుగు పథకాల్లో ఇందిరమ్మ ఇండ్ల మంజూరీయే అసలు సమస్యగా మారనుందన్న చర్చ జరుగుతోంది. అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో లక్షల్లో ఇండ్ల కోసం దరఖాస్తులు చేసుకోవడం, వాటిలో సింహభాగానికి అర్హత ఉందని గ్రామ, మున్సిపల్ వార్డుల సభల్లో ఆమోదం తీసుకున్నారు. దీంతో మంజూరీ ప్రక్రియ జటిలం కానుందని అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ద్వితీయ శ్రేణి నాయకులు ఆందోళనలో ఉన్నారు. అంతేకాకుండా మొదట దఫాలో గుడిసెలో ఉన్న వారికి, పాత ఇళ్లపై టార్పాలిన్లు కప్పి ఉన్న గృహాల కుటుంబాలకు, అనాథలు, వితంతువులు, ఒంటరి మహిళలు, ఎలాంటి భూమి లేని వ్యవసాయ కూలీలు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్, సఫాయి కర్మచారి, అట్టడుగున ఉన్న గిరిజనులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. కానీ పార్టీకి నమ్మకొని పని చేస్తున్న నిరుపేదల పరిస్థితేంటన్న సందిగ్ధంలో కాంగ్రెస్ శ్రేణులున్నారు. అడిగిన వాళ్ళందరికి ఇండ్లు ఇప్పిస్తామని నమ్మబలికి ప్రజలతో ఓట్లు వేయించామని, తీరా ప్రభుత్వం చేసిన నిర్ణయం తమను ఆందోళనకు గురిచేస్తున్నదని అవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు రానున్న వేళ ఇందిరమ్మ ఇండ్లను అరకొరగా మంజూరీ చేస్తే, తేనె తుట్టను కదిలించినట్లేనని కాంగ్రెస్ కార్యకర్తలు వాపోతున్నారు.

### రైతు భరోసా సాయం మాత్రం పక్కానే, కానీ..!

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇష్టారాజ్యంగా రైతుబంధు సాయం ఇచ్చి వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని రేవంత్ రెడ్డి సర్కార్ భావించింది.అందుకే విధి విధానాల పేరు మీద ఏడాది కాలం చర్చలు సమావేశాలు నిర్వహించింది. వ్యవసాయ యోగ్యం లేని భూములు, ఇళ్ల స్థలాలు, లే అవుట్లు, భూసేకరణ చేసిన స్థలాలు, ఎండోమెంట్ భూములు వంటివి గుర్తించి నివేదికలు సిద్ధం చేశారు. వాటిని పడావు (సాగుచేయని) భూములుగా గుర్తించి ఆ వివరాలను గ్రామసభల్లో ప్రకటించి ఆమోదం తీసుకున్నారు. వాటికి రైతు భరోసా ఇచ్చేది లేదని నిర్ణయించారు.మిగతా సాగుకు యోగ్యమైన అన్ని భూములకు పంట పెట్టుబడిని అందజేయడానికి ప్రభుత్వం సిద్ధమైంది. తాము అధికారంలోకి వస్తే ఎకరానికి రూ.15,000 ఇస్తామని చెప్పినప్పటికీ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేనందున ఎకరాకు 12 వేలు ఖరారు చేశారు .అయితే రైతు భరోసా సాయం పక్కా అయినప్పటికీ ఎన్ని సీజన్లకు ఇస్తారన్న మీమాంస నెలకొంది.

### కొత్త రేషన్ కార్డుల ఎంపికపై సందిగ్ధత

కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో 95 శాతం వరకు ఉమ్మడి కుటుంబానికి చెందిన వారున్నారు. వారిలో చాలా మందికి పెళ్లిళ్ళు, పిల్లలైనప్పటికీ పాత కార్డుల్లో పేర్లు లేవు. అందువల్ల పాత కార్డుల్లో మార్పులు చేయకుండా, కొత్తగా ఎలా జాబితా తయారు చేస్తారనే సందిగ్ధత దరఖాస్తుదారుల్లో నెలకొంది.మార్పులు, చేర్పులు మీ సేవ పోర్టల్ లో అప్ లోడ్ చేయించడానికి వెళితే తమకు ప్రభుత్వం నుంచి విధి విధానాలు జారీ కాలేదని వాటి నిర్వాహకులు అంటున్నారు .అయితే బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన సమగ్ర కుటుంబ సర్వే (ఎస్.కే.ఎస్) సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో ఇండ్ల నెంబర్లు కలిగిన కుటుంబాల కంటే, రేషన్ కార్డులు అధికంగా ఉన్నాయని లెక్కలు తేల్చారు.బోగస్ కార్డులను ఏరి వేసిన అనంతరం కొత్త కారులు ఇవ్వాలని కేసీఆర్ ప్రభుత్వం అప్పట్లో ఆ ప్రక్రియను నిలిపి వేసింది. మరి కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల చేయించిన ఇంటింటి సర్వేలో కూడా కుటుంబాలు తక్కువ, రేషన్ కార్డులు ఎక్కువ ఉంటే ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో అన్న ఉత్కంఠ దరఖాస్తుదారుల్లో స్పష్టంగా కనిపిస్తున్నది. అందుకే కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ళు అర్హులు, అవసరం ఉన్న వాళ్ళకు ఇవ్వకుంటే దాని ప్రభావం త్వరలో జరుగనున్న గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్ లు, మున్సిపాలిటీల ఎన్నికల్లో పడుతుందన్న భయం అధికార పార్టీ శ్రేణుల్లో కనిపిస్తోంది ప్రభుత్వం కూడా ఇదే ఆలోచనతో నాలుగు పథకాల అమలును జాప్యం చేయడానికే మొగ్గు చూపుతున్నదన్న ప్రచారం జరుగుతున్నది.ఏదేమైనా అధికారంలోకి రావడం కోసం ఎన్నికల సందర్భంగా ఎడాపెడా చేసిన గ్యారెంటీలు, కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయనడంలో అతిశయోక్తి కాదేమో వేచి చూడాలి..

# గ్రామంలో ఎక్కడ పడితే అక్కడే చెత్త

- పట్టించుకోని అధికారులు



**మల్దకల్, జనవరి 31 (జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం నాగర్ దొడ్డి గ్రామపంచాయతీలో గత వారం రోజుల నుంచి చెత్త ట్రాక్టర్ నిలిచిపోయింది. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా చెత్తాచెదారం కుప్పలు కుప్పలుగా నిలిచిపోయి అపరిశుభ్రంగా మారింది. దీనివలన ఇంటిపక్కల కుటుంబాలు దుర్వాసనతో రావడం వల్ల అనారోగ్యాలకు పాలవుతున్నారు. ప్రతి రోజు చెత్త ట్రాక్టర్‌తో చెత్తను తీయాల్సి ఉండగా సంబంధిత గ్రామపంచాయతీ కార్యదర్శి చెప్పిన కూడా పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామపంచాయతీ నిధులు లేకపోవడం వల్ల చెత్త ట్రాక్టర్ ఆగిపోయిందని కార్యదర్శి అంటున్నారు. మిగతా గ్రామపంచాయతీలలో చెత్త ట్రాక్టర్ యధావిధిగా కొనసాగుతున్న ఈ గ్రామంలో మాత్రమే నిధులు కొరత ఉందా అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలోని చెత్తను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలను సొంత పిల్లలుగా ఆదరించాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్




**మెదక్ జిల్లా బ్యూరో, జనవరి 31 (జనంసాక్షి) :** అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలను తమ సొంత పిల్లలుగా ఆదరించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శుక్రవారం మెదక్ జిల్లా హవేలీ ఘన్పూర్ మండలం బ్యాతోల్ గ్రామపంచాయతీలోని అంగన్వాడి కేంద్రం, ప్రాథమిక పాఠశాల గ్రామ పరిసరాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించి. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అంగన్వాడి కేంద్రాలు పనితీరు ఆదర్శం అని చెప్పారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణీలు, బాలింతలు, ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అలవాటు చేసుకునేలా చూడాలని అన్నారు. పిల్లలతో కలెక్టర్ కాసేపు ముచ్చటించి వారికి అందిస్తున్న పౌష్టికాహారం ఆహారం వివరాలను తెలుసుకొని, చిన్నపిల్లలకు కలెక్టర్ స్వయంగా భోజనం వడ్డించి పిల్లలతో కలిసి ఆహారాన్ని తీసుకున్నారు. అంగన్వాడీ లోని పిల్లలతో కాసేపు సరదాగా గడిపారు. అంగన్వాడీ కేంద్రం ద్వారా వారికి నేర్పిస్తున్న విద్యాభోదనలు, రైమ్స్ కలెక్టర్ ఆలకించారు. ఈ సందర్బంగా పిల్లలకు పౌష్టిక ఆహారాన్ని అందించాలని కలెక్టర్ సూచించారు . ప్రాథమిక పాఠశాలను పరిశీలించిన కలెక్టర్ స్వయంగా పాఠాలు బోధించి విద్యార్థిని విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు పాఠశాల పరిసర ప్రాంతాలను కలియ తిరిగి డ్రింకింగ్ వాటర్, కిచెన్ షెడ్, ఇతర సౌకర్యాలను పరిశీలించి సమర్థ నిర్వహణకు తగు సూచనలు చేశారు. గ్రామంలో పారిశుద్ధ్య పనుల పరిశీలనలో, పారిశుద్ధ్య పనులకు సంబంధించిన సమస్యలను గుర్తించి, వాటికి పరిష్కారాలు సూచించడం జరుగుతుందన్నారు. కాలువల్లో ఎప్పటికప్పుడు చెత్తాచెదారం తొలగించాలి,, తీసిన చెత్తను డంపింగ్‌యార్డ్‌కు తరలించాలి, దోమల వ్యాప్తిని నివారించేలా ప్రజలకు అవగాహన కల్పించాలి, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన నివారణ చర్యలు తీసుకోవాలి. కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసా అందరికీ అందేలా చూడండి

- మంజీరా రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు పృథ్వీరాజ్



**సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 31 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న రైతు భరోసా కొంతమంది రైతులకు మాత్రమే అందుతుందని రాష్ట్రవ్యాప్తంగా రైతులందరికీ రైతు భరోసా అందేలా చూడాలని మంజీరా రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు తుమ్మలపల్లి పృథ్వీరాజ్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో పాత్రికేయుల సమావేశంలో పృథ్వీరాజ్ మాట్లాడుతూ పెట్టుబడి సాయం కింద రైతులకు అందిస్తున్న రైతు భరోసా పూర్తిస్థాయిలో రైతులకు అందడం లేదని వెంటనే రైతులందరికీ రైతు భరోసా అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కొంతమంది రైతులకు రైతు రుణమాఫీ కావలసి ఉందని అలాంటి వారికి కూడా రుణమాఫీ చేయాలని ప్రభుత్వానికి కోరారు. ఆయన వెంట నాయకులు రవీందర్, అశోక్, శేఖర్ ఉన్నారు.

# కొత్త మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు అందించాలి

- హాస్టల్ పరిసరాలను శుభ్రంగా ఉంచాలి
- పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి
- మహాత్మ జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల తనిఖీ
- జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి



**సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 31 (జనంసాక్షి) :** కొత్త మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు అందించాలని జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి సూచించారు. సంగారెడ్డి పట్టణం శాంతినగర్ లోని మహాత్మ జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. తనిఖీలో గురుకుల పాఠశాల నిర్వహణ, భోజనశాల, హాస్టల్ పరిస్థితులు, వంటి అంశాలను ఆమె పరిశీలించారు. పాఠశాలలో వినియోగిస్తున్న బియ్యం, కూరగాయలు, పప్పులు, ఇతర కిరాణా సరుకుల నిల్వలను భద్రపరిచే స్టోర్ రూమును తనిఖీ చేశారు. బియ్యం నాణ్యతను స్వయంగా పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బియ్యం తేమ గురించి ప్రత్యేకంగా ఆరా తీసిన కలెక్టర్, తేమ చేరకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, సరైన రీతిలో నిల్వ చేయాలని సూచించారు. కొత్త మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు అందించాలని ఆదేశించారు. విద్యార్థులకు అందించే భోజనం మెనూ ప్రకారం ఉందో లేదో పరిశీలించారు. విద్యార్థుల నుండి ఆహార నాణ్యత, రుచిని గురించి ఫీడ్‌బ్యాక్ కూడా తీసుకున్నారు. డైనింగ్ హాల్, కిచెన్ షెడ్యూల్, ఆహారం తయారీ విధానాలు, ఉపయోగిస్తున్న పదార్థాల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు హాస్టల్ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. టెన్త్ క్లాస్ విద్యార్థుల ప్రిపరేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పరీక్షల్లో మెరుగైన ఫలితాలను సాధించేందుకు విద్యార్థులకు అదనపు సహాయం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దేవదాస్, ఆర్‌సిఓ గౌతంకుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఐఐటీ సందర్శించిన కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్

- స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి



**సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 31 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ-హైదరాబాద్ (ఐఐటీ)ని శుక్రవారం కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ సందర్శించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందించి సాదరంగా స్వాగతం పలికారు. ఐఐటీ క్యాంపస్‌లో గవర్నర్ పర్యటన సందర్భంగా అధ్యాపకులతో పాటు ఇతర అధికారులు పెద్ద ఎత్తున హాజరై స్వాగతం పలికారు .ఈ సందర్భముగా జిల్లా అభివృద్ధికి సంబంధించి ఐఐటీ తో భాగస్వామ్య అవకాశాల గురించి కలెక్టర్ వివరించారు. ఈ సందర్భముగా కళాశాల డైరెక్టర్ నూతన పరిశోధనలు, విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలు, ఐఐటీ నుంచి ప్రభుత్వ రంగ అభివృద్ధికి తోడ్పాటు వంటి విషయాలపై గవర్నర్‌కు వివరించారు. ఐఐటీ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ ల్యాబ్ లో అత్యాధునిక పరిశోధనలు, స్టార్టప్ సహకారాలు, పరిశ్రమలతో భాగస్వామ్యాల గురించి గవర్నర్‌కు వివరించారు. ముఖ్యంగా ఆటోమేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, గ్రీన్ ఎనర్జీ, హైడ్రోజన్ ఫ్యూయల్ టెక్నాలజీ తదితర రంగాల్లో ఐఐటీ చేస్తున్న పరిశోధనలపై ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భముగా గవర్నర్ మాట్లాడుతూ భవిష్యత్ భారతదేశ నిర్మాణంలో ఐఐటీ విద్యార్థులు కీలక పాత్ర పోషించాలన్నారు. ఆధునిక సాంకేతికత వినియోగంతో దేశ ఆర్థిక అభివృద్ధికి తోడ్పడాలని, విద్యార్థుల నూతన ఆవిష్కరణలు, స్టార్టప్‌లు ప్రోత్సహించేందుకు ప్రభుత్వ సహాయం అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ డైరెక్టర్, ప్రొఫెసర్ బిఎస్ మూర్తి, అదనపు ఎస్పీ సంజీవరావు, ఆర్డీఓ రవీందర్ రెడ్డి, డిఎస్పీ సత్తయ్య, కంది తహసీల్దార్ విజయలక్ష్మి, డిటి మల్లయ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# చేర్యాల ప్రాంతానికి మోసం చేసిన ఘనత బీఆర్ఎస్ పార్టీది..

- బీఆర్ఎస్ నాయకులకు కాంగ్రెస్‌ను విమర్శించే నైతిక హక్కు లేదు
- బీఆర్ఎస్‌లో ఎమ్మెల్సీగా ఉండి డివిజన్ ఎందుకు తీసుకురాలే..
- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి కాంగ్రెస్ నాయకుల కౌంటర్



**చేర్యాల, జనవరి 31 (జనంసాక్షి) :** చేర్యాల ప్రాంతానికి మోసం చేసిన బీఆర్ఎస్ పార్టీ కి కాంగ్రెస్ పార్టీ నాయకులను విమర్శించే నైతిక హక్కు బీఆర్ఎస్ జేఏసీ నాయకులు లేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పుర్మ ఆగం రెడ్డి, మండల అధ్యక్షులు కొమ్ము రవి, పట్టణ అధ్యక్షుడు దాసరి శ్రీకాంత్ విమర్శించారు. చేర్యాల మండల కేంద్రంలోని కొమ్మూరి నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. 10 సంవత్సరాలు బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నన్ని రోజుల్లో రెండు పర్యాయాలు బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఉన్న పల్లా రాజేశ్వర్ రెడ్డి గెలిచి ఈ ప్రాంత భౌగోళిక రాజకీయ ఆర్థిక పరిస్థితులను ఏనాడు పట్టించుకోలేదని, ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అన్ని రాజకీయ పార్టీలను ఏకం చేసి జేఏసీగా ఏర్పడి అనేక దీక్షలు, ధర్నాలు, రాస్తారోకోలు, ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి నాడు ప్రతిపక్షంలో నేడు అధికారపక్షంలో ఉండి కూడా తమ ప్రియతమ నాయకుడు కొమ్మూరి ప్రతాపరెడ్డి నాయకత్వంలో మంత్రులను ప్రభుత్వ అధికారులను కలుస్తూ కార్యక్రమాలతో పాటు లాబీయింగ్ చేస్తూ చేర్యాల ప్రాంత ముద్దుబిడ్డగా ఈ ప్రాంత అస్తిత్వం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నాడని గుర్తు చేశారు. దొంగ ఓట్లతో దొంగచాటున గెలిచిన పల్లా రాజేశ్వర్ రెడ్డి పది ఏండ్లు అధికారంలో ఉండి డివిజన్ తీసుకురాలేక చేతగాక నేడు ప్రజల ఆదరణ పొందడానికి కల్లబొల్లి మాటలతో చిల్లర రాజకీయాలకు పాల్పడుతూ ఓ రెండు పార్టీలతో కొత్త జేఏసీ ఏర్పాటు చేసుకొని ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని, మీ అన్యాయాలను, అక్రమాలను, మోసాలను ప్రజల్లో ఎప్పటికప్పుడు ఎండ కడతామని ఈ సందర్భంగా తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల జోలికి వస్తే ప్రజలే తగిన రీతిలో బుద్ధి చెప్పక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సీనియర్ నాయకులు ఆడేపు చంద్రయ్య, బందీగ రాకేష్ కృష్ణ, మంచాల చిరంజీవులు, చెవిటి లింగం, ముస్త్యాల యాదగిరి, బైతి శ్రీనివాస్, పాల లక్ష్మి నారాయణ, ఏండి.జహురుద్దీన్, వెలుగల దుర్గయ్య, అంబాల రాములు గౌడ్, పోతుగంటి ప్రసాద్, చింతల మల్లేశం, మిట్టపల్లి నర్సిరెడ్డి, కోరే శ్రీశైలం, తాళ్ళపల్లి రమేష్, రంగు శంకర్, కర్క సంతోష్ రెడ్డి, మేడిచెల్మి రాకేష్, ఏండి, ఖాజా, ఎండీ తాహెర్, అల్లం రమేష్, కొల్పుల మల్లేశం, చింతల మల్లేశం, బండి శ్రీనివాస్, చెవిటి కిషన్, తదితరులు పాల్గొన్నారు.

# నగదు కోసం హద్నూర్‌లో ఖాతాదారుల పడిగాపులు

**న్యాల్‌కల్, జనవరి 31 (జనంసాక్షి) :** మండలంలోని హద్నూర్, కొత్తూర్ కెనరా బ్యాంకులు, చాల్కిలోని తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంకుల్లో ఖాతాదారులకు అవసరం మేర నగదు నిలువలు అందుబాటులో లేకపోవడంతో ఆయా బ్యాంకుల పరిధిలోని ఖాతాదారులు గత కొన్ని రోజులుగా నానా అవస్థలు పడుతున్నారు. గంటల తరబడి బ్యాంకుల్లో పడిగాపులు కాస్తున్న రూ:50 వేలకు మించి నగదు అందడం లేదని ఖాతాదారులు వాపోయారు. స్థానిక బ్యాంకులో పూర్తిస్థాయిలో సిబ్బంది లేకపోవడం ఖాతాదారులు వివిధ అవసరాల కోసం అవస్థలు పడుతున్నారు. జిల్లా బ్యాంక్ ఉన్నతాధికారులు మండలంలోని ఆయా బ్యాంకులో అవసరం మేరకు నగదు నిలువలు అందుబాటులో ఉంచాలని ఖాతాదారులు కోరుతున్నారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి


- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, జనవరి 31 (జనంసాక్షి) :** ప్రభుత్వ ఆసు పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించా లని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నా యక్ అన్నారు.శుక్రవారం మద్దూరు కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఓ.పీ. విభా గంలో ఆస్పత్రికి వచ్చే ఔట్ పేషంట్ ల వివరాలు తెలుసు కున్నారు.ఆస్పత్రిలో విధులు నిర్వహించే డాక్టర్లు, స్టాఫ్‌నర్స్‌లు, ఏఎన్‌ఎంలు ఎంత మంది ఉన్నారని, వారు ఎన్ని రోజులు ఏ ఏ సమయాలలో విధులు నిర్వహిస్తున్నారని సమన్వయ కర్త డాక్టర్ పావనిని అడిగి తెలు సుకున్నారు. మొత్తం ఏడుగురు వైద్యులు 8 గంటల చొప్పున మూడు సిఫ్టులుగా విధులు నిర్వహిస్తున్నట్లు పావని తెలిపారు. తర్వాత ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించి ఎందుకు ఆపరేషన్ థియేటర్‌ను ఉపయోగించడం లేదని ప్రశ్నించారు.కోట్ల నిధులతో చక్కటి రెండస్తుల భవనం లో కొనసాగుతున్న ఆసుపత్రిలో థియేటర్ ను ఎందుకు ఉపయో గించుకోవడం లేదని, వెంటనే ఆపరేషన్ థియేటర్ ను వినియోగంలోకి తెచ్చి ఇక్కడే ఆపరేషన్లు చేయాలని ఆదేశించారు.థియేటర్ ముందు భాగంలో నిల్వ ఉంచిన మందులను వేరే గదిలోకి మార్చి థియేటర్ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలనిసూచించారు.అనంతరం కలెక్టర్ ఆస్పత్రి లోని మేల్, ఫిమేల్, చిన్న పిల్లల వార్డులకు వెళ్లి రోగు లతో ఆప్యాయంగా మాట్లాడారు. వైద్య సేవలు ఎలా అందుతున్నాయని, డాక్టర్లు వస్తున్నారా అని రోగులతో ఆరా తీశారు.డాక్టర్లు మంచిగా చూస్తున్నారని రోగులు, వారి బంధువులు కలెక్టర్‌కు తెలిపారు. రోగుల మంచాల పై బెడ్ సీట్లు వేయకపోవ డంపై అసహనం వ్యక్తం చేశారు. మంచాలపై తప్పని సరిగా బెడ్ సీట్లు వేయాలని ఆదేశించారు. వేసిన బెడ్ సీట్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. తర్వాత కలెక్టర్ ఆసుపత్రి ల్యాబ్‌కు వెళ్లి ఏఏ రక్త పరీక్షలు చేస్తారని ప్రశ్నించారు. రిజిస్టర్‌ను పరిశీలించి సీడీఎస్ పరీక్ష చేయడానికి మహబూబ్‌నగర్‌కు ఎందుకు రిఫర్ చేస్తారని, ఇక్కడే చేయవచ్చు కదా..? లేదా నారాయణపేటకు పంపించ వచ్చు కదా అన్నారు. ఇంకోసారి సీడీఎస్ పరీక్షకు మహబూబ్ నగర్ ఆస్పత్రికి రెఫర్ చేయవద్దని అక్కడి సిబ్బందిని ఆదేశించారు. అన్ని వసతి, సౌకర్యాలు కలిగిన ఆసుపత్రిలో ఏడుగురు వైద్యులు ఉండి, ఇక్కడికి వచ్చే రోగులను నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రులకు రెఫర్ చేయడం సరికాదన్నారు. ఇంకోసారి రెఫర్ అనే మాట వినపడ కూడదని ఆదేశించారు.

# విద్యతో పాటు సాంకేతిక నైపుణ్యాన్ని విద్యార్థులకు అందించాలి

- సీఎం రేవంత్ రెడ్డి
- మొగిలిగిద్ద గ్రామానికి అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ మంజూరు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జనవరి 31 (జనంసాక్షి) :** విద్యతో పాటు సాంకేతిక నైపుణ్యాన్ని విద్యార్థులకు అందించాల్సిన అవసరం ఉంది అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు.మొగిలిగిద్ద అభివృద్ధికి 16 కోట్ల రూపాయల నిధులు కేటాయించినట్లు ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.శుక్రవారం షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధ్యక్షతన రంగారెడ్డి జిల్లా మొగిలిగిద్ద ప్రభుత్వ పాఠశాలలో 150 వ వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్ రెడ్డి హాజరై అదేవిధంగా ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, ప్రొఫెసర్ హరగోపాల్ ఎమ్మెల్సీ కోదండరామ్,ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి,అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, సైబరాబాద్ సిపి అవినాష్ మహంతి, డీసీసీ అధ్యక్షుడు చల్ల నరసింహ రెడ్డి,బండ్ల గణేశ్ ,కాంగ్రెస్ సీనియర్ నాయకులు సి. పెంటయ్య, ఆశన్నగరి భుజంగ రెడ్డి, మొహమ్మద్ ఇబ్రహీం, ఇసాక్, సాధిక్ తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఈ గ్రామాన్ని, పాఠశాలను అభివృద్ధి చేయాలని ప్రొఫెసర్ హరగోపాల్ విజ్ఞప్తి చేశారు..150 సంవత్సరాల ఈ పాఠశాల గొప్పతనాన్ని వివరించారు. హైదరాబాద్ రాష్ట్ర మొట్టమొదటి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు లాంటి వారిని ఈ పాఠశాల మనకు అందించిందన్నారు. ఎంతో మంది మేధావులను అందించిన పాఠశాల మొగిలిగిద్ద పాఠశాల, తెలంగాణలో ఈ గ్రామాన్ని, పాఠశాలను అభివృద్ధి భావితరాలకు ఒక చరిత్రగా అందించాల్సిన అవసరం ఉంది.అందుకు అవసరమైన నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. హైదరాబాద్‌ను స్పోర్ట్స్ హబ్‌గా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించి పాఠశాలల ప్రతిష్ట పెంపొందించాలన్నారు. లోపాలను సవరించుకుని విద్యా ప్రమాణాలు పెంచుకుందాం అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు.

# సంక్షేమ పథకాలపై అధికారులతో కలెక్టర్ సమీక్ష



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, జనవరి 31 (జనంసాక్షి) :** నారాయణపేట జిల్లాలోని మద్దూరు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మండలానికి చెందిన అధికారులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల అమలు పై సమీక్ష జరిపారు. ఈ సమీక్షలో ప్రధానంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డుల జారీ పథకాలపై గ్రామాల వారీగా అర్హుల జాబితా వివరాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఆయా జాబితాలపై కూలంకషంగా చర్చించారు.ఆయా పథకాలకు అర్హుల జాబితాను ఏ ప్రాతిపదికన తయారు చేశారని సంబంధిత అధికారులను కలెక్టర్ ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోనే మద్దూరు మండలం ఉందని అధికారులు గుర్తుపెట్టుకుని పనిచేయాలని, ఎక్కడ ఏ చిన్న పొరపాటు జరిగిన శాఖా పరమైన చర్యలు ఉంటాయని కలెక్టర్ సున్నితంగా హెచ్చరించారు.సమీక్షా సమావేశం ఉంటుందని ముందుగానే సమాచారం ఇచ్చినా కూడా ఎందుకు అన్ని వివరాలతో సమావేశానికి రాలేదని ఇద్దరు ముగ్గురు అధికారులను ఆమె నిలదీశారు. గతనెల జనవరి 26న మండలంలో ఎంపిక చేసిన గ్రామంలో నాలుగు పథకాలకు సంబంధించి ఎంతమందికి మంజూరీ పత్రాలను అందజేశారని అడిగారు. ఆయా గ్రామాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.మద్దూరు రోడ్డు విస్తరణ పనులు ఎంత వరకు వచ్చాయని, పనులను వేగంగా పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు.కొత్త మున్సిపాలిటీకి ఎంత మంది అధికారులను నియమించారని కలెక్టర్ ప్రశ్నించగా నారాయణపేట మున్సిపాలిటీ కి చెందిన ఇంజనీర్, టీపీఓ, అకౌంటెంట్ ను మద్దూరు మున్సిపాలిటీకి ఇన్ చార్జీలుగా ప్రభుత్వం నియమించినట్లు ఇన్ చార్జీ కమిషనర్ నాగరాజు తెలిపారు.మద్దూరు మున్సిపాలిటీ జనాభా వివరాలను అడిగి తెలుసుకున్న కలెక్టర్ నాలుగు గ్రామాలు విలీనం అయితే మద్దూరు మున్సిపాలిటీ జనాభా 20 వేలు దాటుతుందని తెలిపారు. ఈ మున్సిపాలిటీ లో అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అధికారులంతా సమన్వయంతో అర్హులందరికీ అమలు చేయాలని కలెక్టర్ సూచించారు.ఈ సమీక్షలో మండల ప్రత్యేక అధికారి, జిల్లా సివిల్ సప్లై అధికారి సుదర్శన్, తహసిల్దార్లు మహేష్ గౌడ్, జయ రాం, ఎంపీడీఓ లు నరసింహ రెడ్డి, కృష్ణా రావు, ఎంఈఓ బాల కిష్టప్ప, ఎంపీఓ రామన్న, ఇరిగేషన్ ఏఈ మమత, వ్యవసాయశాఖ ఏ.వో, ఏపీఓ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# నెల రోజులపాటు 30, 30(ఎ) పోలీసు యాక్ట్

- జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్



**సంగారెడ్డి, జనవరి 31 (జనంసాక్షి) :** జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని నెల రోజుల పాటు (ఫిబ్రవరి 1వ తేది నుండి 28 వరకు) జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్-1861 అమలులో ఉంటుందని జిల్లా యస్పి చెన్నూరి రూపేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ అధికారుల ముందస్తు అనుమతి లేనిది సంగారెడ్డి జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగే విధంగా, ప్రజాధనానికి నష్టం కల్గించే, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టకూడదన్నారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు విషయంలో పోలీసు వారికి సహకరించవలసిందిగా సూచించారు. అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టరీత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# గంజాయి అమ్మకందారుడికి ఐదేళ్లు జైలు శిక్ష

- రూ. 25 వేల జరిమానా



**సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 31 (జనంసాక్షి) :** సంగారెడ్డి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో 2009లో ఐదు కిలోల గంజాయి అమ్మకాలు చేపడుతు పట్టుబడిన మహ్మమద్ షమీ అన్సారీ అలియస్ బిలాల్ కేసులో శుక్రవారం సంగారెడ్డి పస్టుక్లాస్ అడిషనల్ జిల్లా సేషన్ కోర్టు న్యాయమూర్తి కె. జయంతీ ఐదేళ్లు జైలు శిక్ష, రూ. 25 వేల జరిమానా విధించారు. వివరాల్లోకి వెళితే... 2009 సంగారెడ్డి నవాబ్‌గడ్డ ప్రాంతంలో రౌడీ షీటర్‌గా ఉంటు గంజాయి అమ్మకాలు చేపడుతున్న మహ్మమద్ సెమీ అన్సారీ అలియస్ బిలాల్‌ను సంగారెడ్డి ఎక్సైజ్ ఎస్‌హెచ్ఓ (సీఐ) మధ్నాబాబు ఐదు కిలోల గంజాయితో పట్టుకున్నారు. సీఐ మధ్నాబాబు చార్జీ షీట్ వేయడం, కేసును స్వయంగా విచారించడంతో నిందితుడికి శిక్ష పడింది. అప్పటి సంగారెడ్డి సీఐ మధు బాబు ఇప్పుడు ధూల్‌పేట్ ఎస్‌హెచ్ఓగా పని చేస్తున్నారు. సంగారెడ్డి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ నుంచి నమోదు చేసిన మూడు కేసుల్లో శిక్షలు పడడం గమర్హం. శిక్ష పడిన బిలాల్‌ను కోర్టు కానిస్టేబుల్ సి.హెచ్.రాములు బిలాల్‌ను జైలుకు తరలించారు. గంజాయి అమ్మకాలు చేపట్టిన వ్యక్తి ఐదేళ్లు శిక్షపడే విధంగా చార్జీ షీట్‌ను తయారు చేసిన సీఐ మధ్నాబాబును ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి అభినందించారు.

# రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి

- రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి



**శేరిలింగంపల్లి, జనవరి 31 (జనంసాక్షి) :** ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రత వ్యవహారాలకు సంబంధించి ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి పేర్కొన్నారు. కొండాపూర్ డివిజన్ ఆర్టిఏ కార్యాలయంలో 'రోడ్డు భద్రత మాస ఉత్సవం 2025' ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించగా డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ సదానందంతో కలిసి రాష్ట్ర పిఎసి చైర్మన్ చైర్మన్ శుక్రవారం దానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అరికెపూడి తదితరులు జెండాను ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రహదారి భద్రతా అవగాహనా కార్యక్రమాలను నిర్వహించడం చాలా సంతోషకరమైన విషయమని, ప్రతి ఒక్కరికి రోడ్డు భద్రత పై అవగాహన అవసరమని అన్నారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలని, విద్యార్థులకు చదువుకునే వయసులో రోడ్డు భద్రత అవగాహన అంశాలు బోధిస్తే భవిష్యత్తులో తప్పనిసరిగా బాధ్యతగల పౌరులుగా ఎదగడానికి అవకాశం ఉంటుందన్నారు. ద్విచక్రవాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వారికోసం ఇంటివద్ద కుటుంబం ఎదురుచూస్తుందనే విషయం గుర్తించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మద్యం తాగి వాహనాలు నడిపి ఇబ్బందుల పాలవడంద్వారా తమ కుటుంబానికి నష్టం కలిగించుకోకూడదని, సమాజంలో ప్రతి ఒక్కరిని చైతన్యం చేయడానికే ఈ రోడ్డు భద్రత మాసోత్సవం అవగహన ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. డ్రైవింగ్ సమయంలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ నియమాలను పాటించి నిర్దేశించిన వేగం మించకుండా వాహనాలను నడపాలని గాంధీ తెలియచేసారు. ఈ కార్యక్రమంలో కొండాపూర్ ఆర్టిఏ మోటారు వెహికల్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్, నవీన్, కృష్ణవేణి, డ్రైవింగ్ స్కూల్స్ అసోసియేషన్ సభ్యులు, వాహనదారులు, మోటార్ వెహికల్ అసిస్టెంట్ ఇన్స్పెక్టర్లు మనోజ్ కుమార్, శ్రీముఖి, స్వాతి, ఉపాసిని నాయకులు వుట్ల కృష్ణ, ఎర్ర గుడ్ల శ్రీనివాస్ యాదవ్, అక్తర్, చాంద్ పాషా, వుట్ల దశరథ్, తిరుపతి, గుమ్మడి, శ్రీనివాస, రామచందర్, పితాని శ్రీనివాస్, రాజు, ఉమ, జహీర్ ఖాన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# గద్దర్ ప్రపంచం మొత్తం గర్వించదగ్గ కళాకారుడు

- జిల్లా పౌర సంబంధాల అధికారి మొహమ్మద్ ఆరిఫుద్దీన్



**గద్వాల నడిగడ్డ, జనవరి 31 (జనంసాక్షి) :** తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి గళమెత్తిన ప్రజా యుద్ధ నౌక గద్దర్ ప్రపంచం మొత్తం గర్వించదగ్గ కళాకారుడని జిల్లా పౌర సంబంధాల అధికారి మహమ్మద్ అరీఫుద్దీన్ అన్నారు. శుక్రవారం ప్రజా గాయకుడు గద్దర్ జయంతి వేడుకలను వైయస్ఆర్ చౌరస్తా వద్ద రాష్ట్ర సంస్కృతిక శాఖ ఆధ్వర్యములో జిల్లా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులతో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా పౌర సంబంధాల అధికారి, జిల్లా సాంస్కృతిక సారథి కళాకారులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి, గద్దర్ చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళు లు అర్పించారు.అనంతరం జిల్లా సాంస్కృతిక సారథి కళాకారుల ఆట పాటలతో గద్దర్ స్వయంగా పాడిన పాటలు,ఆయన పై కళాకారులు రచించిన పాటలు పాడుతూ ప్రజల్లో గద్దర్ యొక్క జ్ఞాపకాలను మననం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంస్కృతిక సారథి కళాకారులు రేలారే ప్రసాద్,రమాదేవి, స్వామి,కేశవులు,కృష్ణ, హజరత్, రాహుల్, భూపతి, కవిత, ప్రజా సంఘాల నాయకులు, అఖిల పక్ష కమిటీ నేతలు, ప్రజానాట్య మండలి, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

# బాల కార్మికుల అప్పగింత



**మెదక్ జిల్లా బ్యూరో, జనవరి 31 (జనంసాక్షి) :** మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్.పి. డి.ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో గల బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో 1 జనవరి 2025 నుండి 31 జనవరి 2025 ఆపరేషన్ స్మైల్ నిర్వహించారు. ఇందులో భాగంగా 122 మంది (బడి మానేసిన, వివిధ దుకాణాలలో కానీ కర్మాగారాలలో కానీ మరియు ఇటుక భట్టిలలో పనిచేస్తున్న) పిల్లలను గుర్తించి, రెస్క్యూ చేసి వారికి, వారి తల్లితండ్రులకు, యజమానులకు కౌన్సిలింగ్ ఇచ్చి తల్లితండ్రులకు అప్పగించి, ఆ పిల్లలను పాఠశాలలో/కళాశాలలో చేర్పించారు.

ఇతర రాష్ట్రాల పిల్లలను రెస్క్యూ చేసి వారి తల్లితండ్రులు వచ్చే వరకు మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడిపే సంరక్షణ కేంద్రాల్లో ఉంచి తల్లితండ్రులు వచ్చిన తరవాతే వారిని అప్పగించారు. వారికీ వారి రాష్ట్రలో (జిల్లాలో) గల మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యాలయానికి తదుపరి ప్రక్రియ కై ఆ రాష్ట్రానికి వెళ్లి హాజరు అవ్వలిసిందిగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది, పోలీస్ శాఖా సిబ్బంది, లేబర్ డిపార్ట్మెంట్ శాఖా సిబ్బంది సమన్వయంతో నిర్వహించినట్లు తెలిపారు.

# చారకొండలో యువకుడిపై పోక్సో కేసు నమోదు

**చారకొండ, జనవరి 31 (జనంసాక్షి) :** ఓ మైనర్ బాలికను వేదింపులకు గురి చేసిన యువకుడిపై ఫోక్సో కేసు నమోదు అయిన సంఘటన నాగర్ కర్నూల్ జిల్లా చారకొండ మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది.

వెల్దండ సీఐ విష్ణువర్ధన్ రెడ్డి తెలిపిన కథనం ప్రకారం చారకొండ మండల కేంద్రానికి చెందిన యువకుడు మహేష్ గౌడ్ (22) అదే గ్రామా నికి చెందిన 16 ఏళ్ల మైనర్ బాలికపై ఇంట్లో ఎవరు లేని సమయంలో మహేష్ గౌడ్ ప్రేమిస్తున్నాని వేదించడంతో బాలిక తల్లి ఫిర్యాదు మేరకు యువకుడిపై పోక్సో యాక్టు కింద కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు.

# చీరలు, వ్యవసాయ ఎగుమతులు పెంచేందుకు అన్ని వసతులు కల్పిస్తాం

- జిల్లా కలెక్టర్ సంతోష్



**గద్వాల నడిగడ్డ, జనవరి 31 (జనంసాక్షి) :** జిల్లాలోని గద్వాల చీరలు,ఎగుమతులకు, ఇతర ఉత్పత్తుల ఎగుమతిని పెంచేందుకు అన్ని అవసరమైన వసతులు కల్పిస్తామని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా నుంచి ఎగుమతి ప్రోత్సాహాన్ని పెంపొందించడంతో పాటు జిల్లాను ఎగుమతి హబ్‌గా మార్చేందుకు స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు జిల్లా స్థాయి ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. జిల్లా నుంచి ఎగుమతి అయ్యే ఉత్పత్తుల వివరాలను సంబంధిత అసోసియేషన్ల సహాయంతో సేకరించి, విశ్లేషించి,నివేదిక రూపంలో సమర్పించాలని అధికారులను ఆదేశించారు. గద్వాల చీరలు, పత్తి, గ్రౌండ్‌నట్, మామిడి, బియ్యం వంటి ఉత్పత్తులు పెద్ద ఎత్తున అవుతున్నాయని, వాటిని ఎగుమతికి అవకాశాలు పెంచాలని సూచించారు. ఎగుమతుల గురించి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అసోసియేషన్ ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని,వాటిని పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హ్యాండ్లూమ్ తప్పనిసరిగా ఎగుమతి, దిగుమతి కోడ్ నమోదు చేసుకోవాలని, దేశంలో నిర్వహించే ప్రదర్శనల్లో పాల్గొని గద్వాల చీరలను ప్రాచుర్యంలోకి తేవాలని సూచించారు. జిల్లాలో ఒక సాధారణ సౌకర్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, ఇందుకు సంబంధించిన భూ సమస్యలను పరిష్కరించాలని అన్నారు. బియ్యం మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా గుర్తించి వాటికి పరిష్కారం కనుగొనాలని అధికారులను ఆదేశించారు. ఇవన్నీ సమన్వయం చేసేందుకు పరిశ్రమల జనరల్ మేనేజర్‌ను నోడల్ అధికారిగా ఉండి, నిరంతరం అప్‌డేట్స్ ఇవ్వాలని,అవసరమైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఉత్పత్తి పెంచడమే కాక, మార్కెటింగ్‌ను స్థానికంగా, అంతర్జాతీయ స్థాయిలో విస్తరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. టీఎస్-ఐ పాస్ కింద పరిశ్రమల స్థాపనకు వచ్చిన దరఖాస్తులన్నింటినీ నిశితంగా పరిశీలించి సకాలంలో ఆమోదించాలని అన్నారు. టి-ప్రైడ్ కింద మహిళా లబ్ధిదారులు 45 శాతం సబ్సిడీకి అర్హులు కాగా, పురుష లబ్ధిదారులు 35 శాతం సబ్సిడీని అందుకుంటారు. ఎస్టీ,ఎస్సీ కేటగిరీ అభ్యర్థులకు 25 యూనిట్ల సబ్సిడీ మంజూరికి ఆమోదించారు. ఈ సమావేశంలో ఈ కామర్స్ డిప్యూటీ డైరెక్టర్ సుధీన్ పాల్, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ రామలింగేశ్వర్, ఏప్.ఐ.ఈ.ఓ కులకర్ణి, జాయింట్ డైరెక్టర్ సుజాత, సీపీఓ లక్ష్మణ్, ఎల్డీయం అయ్యప్ప రెడ్డి, అగ్నిమాపక అధికారి అశోక్, చేనేత జౌళి సహాయ సంచాలకులు గోవిందయ్య, వ్యవసాయ శాఖ అధికారి సక్రియా నాయక్, జిల్లా ట్రెజరీ అధికారి విజయ్ కుమార్, ఉద్యానవన శాఖ అధికారి అక్బర్ భాష, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కృష్ణ రెడ్డి, కాలుష్యనియంత్రణ మండలి ఇఇ సురేష్ బాబు, గ్రౌండ్ వాటర్ మోహన్, ఐ.పి.ఓ జి భాస్కర్ రెడ్డి హ్యాండ్లూమ్, రైస్ మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించాలి

- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట జిల్లా బ్యూరో, జనవరి 31 (జనంసాక్షి) :** పదో తరగతి పరీక్షా ఫలితాలలో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా వారిలో ఉపాధ్యాయులు ఆత్మవిశ్వాసం పెంపొందించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో గత రెండు రోజులుగా జిల్లాలో 88 పాఠశాలలకు చెందిన ఆక్టివ్ టీచర్లకు కెరీర్ గైడెన్స్ అండ్ కౌన్సిలింగ్ అనే అంశంపై కొనసాగుతున్న ఓరియంటేషన్ కార్యక్రమానికి శుక్రవారం జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడారు. ఇలాంటి కార్యక్రమాలలో నేర్చుకున్న అంశాలను ఆచరణలో పెడితే ఆశించిన ఫలితం దక్కుతుందన్నారు. నేర్చుకున్న అంశాలను పాఠశాలలోని మిగతా సబ్జెక్టుల ఉపాధ్యాయులకు వివరించాలన్నారు.ముఖ్యంగా విద్యార్థులకు పరీక్షల పట్ల భయం, ఆందోళనను తొలగించాలన్నారు. గతేడాది మాదిరిగానే ఈ సారి కూడా పది లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థులలో పఠనాసక్తిని పెంచాలన్నారు.వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను అన్ని విధాలుగా సిద్ధం చేసి జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చేందుకు కృషి చేయాలని సూచించారు.ఇలాంటి శిక్షణా కార్యక్రమాలను నిర్వహించిన విద్యాశాఖ అధికారిని, జిల్లా విద్యా శాఖను కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డిఇఓ గోవిందరాజులు, ఏఎంవో విద్యాసాగర్, సీఏంఓ రాజేందర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# సైబర్ క్రైమ్ నేరాలపై అవగాహన కల్పించాలి




**ములుగు బ్యూరో,జనవరి31(జనం సాక్షి):**

**డ్రగ్స్ రహిత జిల్లాగా ములుగును తీర్చిదిద్దాలి**

**మావోయిస్టు కార్యకలాపాలపై నిఘా పెట్టాలి**

**ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలి**

**హెూంగార్డ్స్, ఆర్గనైజేషన్ అడిషినల్ డీజీపీ స్వాతి లక్రా**

ములుగు జిల్లాలోని ప్రజలకు సైబర్ క్రైమ్ నేరాలపై అవగాహన కల్పించాలని, యువత డ్రగ్స్ కి బానిసలు కాకుండా చర్యలు తీసుకోవాలని డ్రగ్స్ రహిత జిల్లాగా ములుగును మార్చాలని,గ్రామీణ యువత నిషేధిత మావోయిస్టు భావజాలానికి లోను కాకుండా ఉద్యోగ అవకాశాలు కల్పించాలిని,మావోయిస్టు కార్యకర్తలపై అనునిత్యం నిగా ఉంచాలని,ములుగును మావోయిస్టు రహిత జిల్లాగా మార్చాలని ఆర్గనైజేషన్, హెూంగార్డ్స్ అడిషినల్ డీజీపీ స్వాతి లక్రా అధికారులకు సూచించారు.వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం ఉదయం ఆర్ అండ్ బి అతిథి గృహానికి చేరుకున్న అడిషినల్ డీజీపీకి ములుగు జిల్లా ఎస్పీ డా.శబరీష్.పి పుష్పాగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. తొలుత సాయుధ పోలీసులు గౌరవవందనం చేసారు. ఆర్ అండ్ బి అతిథి గృహంలో ములుగు జిల్లాకు చెందిన పోలీస్ అధికారులతో సమావేశమయిన అడిషినల్ డీజీపీకి ముందుగా ములుగు జిల్లా విభాగం పనీతీరును,శాంతి భద్రత నియంత్రయణలో భాగంగా తీసుకుంటున్న ముందస్తు చర్యలపై జిల్లా ఎస్పీ పవర్ పాయింట్ ప్రజేంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీజీపీ మాట్లాడుతూ నేర నియంత్రణలో ములుగు జిల్లా పోలీస్ చేస్తున్న కృషిని, శాంతి భద్రతల్లో తీసుకుంటున్న రక్షణ చర్య లను,లోక్ అదాలత్ ద్వారా కేసుల సత్వర పరిష్కారానికి చేస్తున్న కృషిని ప్రశంసించారు. డయల్ 100 నుండి వచ్చే ఫిర్యాదులపై స్టేషన్ అధికారులు, సిబ్బంది తక్షణమే స్పందించి సంఘటన స్థలానికి చేరుకోవాలని, సైబర్ నేరాలకు సంబంధించి వచ్చే ఫిర్యాదులపై స్టేషన్ అధికారులు తప్పక కేసు నమోదు చేయాలని, కోర్టుల్లో ట్రయల్స్ లో ఉన్న కేసులను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని, రోడ్డు ప్రమాదాల నివారణ కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ,ప్రధానంగా విద్యార్థుల్లో ట్రాఫిక్, మత్తుపదార్థాలు,సైబర్ నేరాలు, ర్యాగింగ్‌లపై అవగాహన కల్పించేందుకు ప్రతి కళాశాలలో సేఫ్టీ వుమెన్, యాంటీ డ్రగ్స్, ట్రాఫిక్ స్టేఫ్టీ, ర్యాగింగ్ కు లోను కాకుండా యాంటీ ర్యాగింగ్ కమిటీలు,క్లబ్స్‌ను ప్రతి పీఎస్ పరిధిలో ఏర్పాటు చేసి సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని, వీటీపై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, బాలకార్మికుల వ్యవస్థ నిర్మూలకోసం నిరంతరం తనిఖీలు కొనసాగించాలని అడిషినల్ డీజీపీ తెలిపారు.అనంతరం జాకారంలోని డిటిసి సెంటర్ ను, ఏఆర్ హెడ్ క్వార్టర్స్ లోని డాగ్ స్కాడ్, ప్రస్తుత డిపిఓ భవనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమములో ములుగు జిల్లా ఓఎస్డి గీతే మహేష్ బాబా సాహెబ్ ఐపీఎస్,ఏఆర్ అడిషనల్ ఎస్పీ సదానందం, ఏటూరునా గారం ఏఎస్పి శివం ఉపాధ్యాయ,ములుగు డిఎస్పి రవీందర్ తో పాటు ఇన్స్‌స్పెక్టర్లు, ఆర్ఐ లు ఎస్సైలు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## చెరువులపై ఆక్రమణలు జరగకుండా పటిష్టమైన చర్యలు

**సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 31(జనం సాక్షి )**



**డిజిటల్ మ్యాప్స్, సర్వే డేటా ఆధారంగా నివేదిక సమర్పించాలి**

**తెల్లాపూర్ చెరువుల అభివృద్ధిపై జిల్లా కలెక్టర్ సమీక్ష**

సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం మండలం , తెల్లాపూర్ ప్రాంతంలోని మూడు ప్రధాన చెరువుల అభివృద్ధి, పరిరక్షణ, నీటి నిల్వ సామర్థ్యాన్ని మెరుగుపరిచే అంశాలపై శుక్రవారం జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు సమీక్ష నిర్వహించారు. చెరువుల ప్రస్తుత స్థితిగతులను అధ్యయనం చేసి, వాటి పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యల గురించి అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్ , మాధురి లతో కలిసి సమీక్షించారు. ఈ సమీక్షలో నీటిపారుదల శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భముగా జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ చెరువులు, కుంటలు, నీటి వనరులను పరిరక్షించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని పేర్కొన్నారు. వాటిపై అక్రమ ఆక్రమణలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చెరువులకు అనుబంధంగా ఉన్న ఎఫ్‌టిఎల్ (ఫుల్ ట్యాంక్ లెవల్), బఫర్ జోన్ పరిధులను గుర్తించి ఎలాంటి ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు . గతం లో చెరువుల నీటి నిల్వ స్థాయిలు, ఆక్రమణ పరిస్థితులు, పర్యావరణ మార్పులు ఎలా ఉన్నాయనే సమాచారాన్ని అందించాలని ఆదేశించారు.చెరువుల అసలు పరిమాణం, ప్రస్తుత స్థితిని పోల్చి డిజిటల్ మ్యాప్స్, సర్వే డేటా ఆధారంగా పూర్తిస్థాయి నివేదిక సమర్పించాలని ఆదేశించారు .తెల్లాపూర్ ప్రాంతం హెచ్ఎండిఏ పరిధిలోని భవనాల అనుమతులను చాలా జాగ్రత్తగా పరిశీలించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు . ఎవరైనా నిబంధనలు అతిక్రమిం చి ఉంటే తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారు లను ఆదేశించారు.హెచ్ఎండిఏ, రెవెన్యూ, నీటిపారు దల శాఖలు కలిసి సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదలశాఖ ఈ ఈ జయభీమ్ , ఆర్డీఓ రవీందర్ రెడ్డి , సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కెసిఆర్ అసెంబ్లీకి రా..

**షాద్ నగర్ (జనంసాక్షి)**



**లెక్కతో సహా చెప్తా..**

**సరిగ్గా కర్ర లేకుండా నిలబడలేవు..**

**ఫామ్ హౌస్ నుండి బయటికి వస్తావా..**

**కాలం చెల్లిన వెయ్యి రూపాయల నోటు నువ్వు..**

రంగారెడ్డి జిల్లా ఫరూఖ్ నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామంలో జరిగిన బహిరంగ సభ షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధ్యక్షతన జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై ప్రసంగించారు గత పదేళ్ల బిఆర్ఎస్ హాయంలో తెలంగాణ రాష్ట్రాన్ని గత పాలకులు అప్పుల కుప్పగా మార్చారని బిఆర్ఎస్ నేతల నిర్బంధలను అరాచకాలను బరించలేని తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్ట బెటరని అందుకే రోజుకు 20 గంటలు కష్టపడి తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నమని ఇక కేసీఆర్ ఫామ్ హౌస్ నుండి బయటకి వస్తానని అనడం ఆశ్చర్యానికి గురి చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు కేసీఆర్ అసెంబ్లీకి రా ప్రజలకు అభివృద్ధి చేసిన సంక్షేమ పథకాలను లెక్కతో సహా చెప్తా సరిగ్గా కర్ర లేకుండా నిలబడలేవు ప్రస్తుతం నువ్వు కాలం చెల్లిన వెయ్యి రూపాయల నోటువూ అంటూ రేవంత్ రెడ్డి బహిరంగ సభలో కెసిఆర్ పై విమర్శలు గుప్పించారు బిఆర్ఎస్ నాయకులు వారు ఇచ్చిన హామీలను అమలు చేయలేనందుకే వారి నిర్బంధాలు అరాచకాలు తట్టుకోలేకనే ఆయనను ఫామ్ హౌస్ కు పరిమితం చేశారని కాంగ్రెస్ కు ప్రజల అధికారం మిచారన్నారు అధికారం కోల్పోయాక కూడా కుమారుడు కేటీఆర్ అల్లుడు హరీష్ రావు డ్రామాలకు తెరలేపుతున్నారన్నారు అసెంబ్లీ ఎన్నికల్లో వీరిని ప్రజలు ఇంటికి పంపిస్తే పార్లమెంట్ లో గుండు సున్నా చూపారని పాలమూరు ప్రాజెక్టులను నిర్మించలేక పాలమూరు జిల్లాను ఎడారి చేశారని పాలమూరు ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రాజెక్టులను పూర్తిచేసి రైతాంగానికి సాగునీరు త్రాగునీరు అందిస్తామన్నారు రైతు రుణమాఫీ రైతు భరోసా మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం ఇందిరమ్మ ఇళ్లు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ ఉచిత విద్యుత్తు వృద్ధులకు వికలాంగులకు పెన్షన్ ఇస్తున్నమని రాష్ట్రం అప్పుల కుప్పగా మారిన ప్రజలకు ఇచ్చిన సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు..

## మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల కళాశాలలో గ్యాస్ లీకై ఎగిసిన మంటలు

**ప్రమాదాలు జరగకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలి**

**సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు**

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 31 (జనం సాక్షి)**



: గురుకుల విద్యాలయాల్లో అధికారుల పర్యవేక్షణ లోపం, ఆ విద్యాలయాల నిర్వాకుల నిర్లక్ష్యం కారణంగా జిల్లాలో ఏదో ఒకచోట తరచుగా ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలోని మహాత్మ జ్యోతిబాపూలే బిసి బాలుర గురుకుల విద్యాలయంలో శుక్రవారం గ్యాస్ సిలిండర్ పైప్ గుండా గ్యాస్ లీకై మంటలు ఎగిసి పడ్డాయి. మధ్యాహ్నం వంట చేస్తుండగా రెగ్యులేటర్ గుండా గ్యాస్ లీక్ అవ్వడం, మంటలు పెద్ద మొత్తంలో రావడంతో కళాశాలలో విద్యార్థులతో పాటు, వంట మనుషులు, అధ్యాపకులు ఉలిక్కిపడ్డారు. దీంతో వెంటనే కాగజ్ నగర్ అగ్ని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పి వేశారు. దీంతో కళాశాలలో సుమారు అరగంటకు పైన మంటలు వ్యాపించాయి. విషయం తెలుసుకున్న సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఈ.సందర్భంగా ఘటనకు దారి తీసిన పరిస్థితులను అక్కడ ఉన్న సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు ఘటన స్థలానికి చేరుకొని మంటలు ఆర్పేందుకు సహకరించారు. ఈకళాశాల ప్రిన్సిపాల్ మంగమ్మ వ్యవహార శైలి పై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కళాశాలలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తుందని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

కళాశాల ప్రిన్సిపాల్ ను సస్పెండ్ చేయాలి : ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సాయి కృష్ణ

కాగజ్ నగర్ పట్టణంలోని మహాత్మ జ్యోతిబాపూలే బిసి గురుకుల విద్యాలయంలో గ్యాస్ లీకేజ్ కి కారణమైన ప్రిన్సిపాల్ మంగమ్మ ను సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సాయి కృష్ణ డిమాండ్ చేశారు. కాలం చెల్లిన రెగ్యులేటర్, పైపు వల్లనే గ్యాస్ లీక్ అయిందని అన్నారు. ఉన్నత అధికారులు కళాశాల ప్రిన్సిపాల్ తో కుమ్మక్కై కావడంతో తరచూ విద్యాలయాల్లో గ్యాస్ లీకేజీలు, ఆహారం కలుషితం కావడం జరుగుతుందని అన్నారు. గత సంవత్సరం ఆగస్టు మాసంలో వాంకిడి బాలికల ఆశ్రమ విద్యాలయంలో ఫుడ్ పాయిజన్ తో సుమారు 60 మంది విద్యార్థులు ఆస్పత్రి పాలు అయ్యారని అన్నారు. ఇందులో శైలజ 9వ తరగతి విద్యార్థిని నెల రోజులు పైన చికిత్స పొంది మృత్యువాత పడ్డారని అన్నారు. ఘటనలు ఇలాగే పున్నరావృతం అయితే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## గ్రామాల్లో నీటి సమస్య రాకుండా ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకుందా మిషన్ భగీరథ డిఈ హారిక

**మొయినాబాద్,జనవరి 31(జనం సాక్షి):**



సమీపిస్తున్న వేసవిని దృష్టిలో పెట్టుకోని గ్రామాల్లో అధికారులు ఇప్పటి నుంచే నీటి సమస్యలు రాకుండా చిన్న చిన్న వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలని మిషన్ భగీరథ డిఈ హారిక పేర్కొన్నారు. శుక్రవారం మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాలకు సంబంధించిన పంచాయతీ కార్యదర్శులతో నీటి సమస్యపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా హారిక మాట్లాడుతూ గ్రామాల్లో నీటి సరఫరా ఎలాంటి వరిస్థితుల్లో సమస్య రాకూడదని వివరించారు. సమీపిస్తున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకోని బోరు బావుల్లో ఉన్న మోటర్లను సక్రమంగా చూసుకోవాలన్నారు. అదే విధంగా అక్కడకక్కడ ఉన్న చేతి పంపులు చెడిపోతే మరమ్మత్తులు నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. ఏదిఏమైనా వచ్చే వేసవిలో నీటి సమస్య రాకుండా అధికారులే బాధ్యత అని ఆమె సూచించారు. అనంతరం మండల అభివృద్ధి అధికారి సంధ్య మాట్లాడుతూ అధికారులు ప్రజలతో కలిసి గ్రామాల్లో ఉన్న సమస్యలను తెలుసుకోని వెంటనే పరిష్కరిస్తే సమస్యలు తలెత్తవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కిషన్రావు, ఎంపీడీవో సంధ్య, ఎంపీవో వెంకటేశ్వర్రెడ్డి, మిషన్ భగీరథ ఏఈ ఇమ్రాన్, మిషన్ భగీరథ గిడ్ ఏఈ ప్రియదర్శిని, పంచాయతీ కార్యదర్శులు కవిత, శివకుమార్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## మీసేవ సర్వర్ డౌన్ విద్యార్థులు లబోదిబో

**మల్హర్, జనవరి 31(జనంసాక్షి)**

గురుకుల విద్యాలయాలలో ప్రవేశ పరీక్ష కు ఫిబ్రవరి 2 కు చివరి తేదీ,కాటఫ్ డేట్ వరకు ఉత్సహం ఉన్నా అర్హులైన విద్యార్థులు మీసేవ లో ఆన్లైన్ చేసుకోవాలి. గురువారం, శుక్రవారం రోజులలో సర్వర్లు డౌన్ అవటం తో విద్యార్థిని, విద్యార్థులు లబోదిబో అంటున్నారు.ఇంకా చాలా మంది విద్యార్థులు ఆన్లైన్ చేసుకోలేదు.మీసేవ, ఆన్లైన్ సెంటర్ల కు పోతే సర్వర్ డౌన్ అని చెపుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోవుచున్నారు. సంబందిత అధికారులు గురుకులలో ప్రవేశ పరీక్ష తేదిని పొడిగించాలి అని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుచున్నారు.

## రైలు ఢీకొని మహిళ దుర్మరణం.



**తాండూరు జనవరి 31(జనంసాక్షి)**

రైల్వే గేటు దగ్గర పట్టాలు దాటుతుండగా ఓ మహిళను రైలు ఢీకొని దుర్మరణం చెందిన సంఘటన శుక్రవారం తాండూరు పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. పట్టణంలోని పాత తాండూరు వెళ్లే మార్గంలో రైల్వే గేట్ దగ్గర పాత తాండూరు చెందిన ఓనాడి నర్సమ్మ తన ఇంటికి వెళ్లేందుకు గేటు దాటుతుండగా పార్సల్ గూడ్స్ రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందింది.

## లక్ష డప్పులు వేల గొంతుకలు సభను విజయవంతం చేయండి

**గణపురం, జనవరి 31 ( జనం సాక్షి):**



**నంది అవార్డు గ్రహీత ప్రజా కవి మిట్టపల్లి సురేందర్**

**కోటగుళ్ళలో పోస్టర్ ఆవిష్కరణ**

లక్ష డప్పులు వేల గొంతుకలు సభను విజయవంతం చేయాలని నంది అవార్డు గ్రహీత ప్రజా కవి మిట్టపల్లి సురేందర్ అన్నారు. శుక్రవారం గణపురం మండల కేంద్రంలోని కోట గుళ్ళు లో సభ పోస్టర్లను ఆవిష్కరించారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ చేస్తున్న ఎస్సీ ఏబిసిడి వర్గీకరణ ఉద్యమం చివరి దశకు చేరిందని, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఎస్సీ ఏబిసిడి వర్గీకరణ జరిగి తీరాల్సిందే అని ఫిబ్రవరి ఏడవ తేదీన హైదరాబాద్ మహానగరంలో లక్ష డప్పులు వేల గొంతుకలు అనే కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ చేస్తున్న ఎస్సీ ఏ బి సి డి వర్గీకరణ ఉద్యమం మహెూన్నతమైనదనిఈ ఉద్యమానికి తెలంగాణ రాష్ట్రంలోని కవులు కళాకారులు, మేధావులు, విద్యావేత్తలు, ఆయా కుల సంఘాల పెద్దలు మద్దతుగా ఫిబ్రవరి ఏడవ తేదీన నిర్వహించే లక్ష డప్పులు వేల గొంతుకలు కార్యక్రమాన్ని విజయవంతం చేయడం కోసం తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి మాదిగ పల్లె నుండి డప్పు సంకనేసుకుని హైదరాబాదు మహానగరాన్ని చేరుకోవాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షులు గోల్కొండ బుచ్చన్న,, అడువాల తిరుపతి పటేల్ డాక్టర్ పుల్లా శ్రీనివాస్‌దూడపాక శంకర్ కర్ర రగోత్తం రెడ్డి దూడ పాక అఖిల్ పున్నం రమేష్ తదితరులు పాల్గొన్నారు



## విలువలతో కూడిన సత్ప్రవర్తన అవసరం...

**-జిల్లా విద్యాధికా జగన్మోహన్ రెడ్డి**

**వేములవాడ గ్రామీణం, జనవరి 31 (జనంసాక్షి):**

విలువలతో కూడిన సత్ప్రవర్తన భావితరాలకు ఎంతగానో అవసరమని జిల్లా విద్యాధికారి జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తిప్పాపురం ప్రధానోపాధ్యాయులు బోయిన్ పల్లి తిరుపతి పదవీ వివరణ కార్యక్రమం శుక్రవారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ తిరుపతి, తాను చిన్ననాటి మిత్రులమని, ఒకే పాఠశాలలో విద్యను అభ్యసించడం జరిగిందన్నారు. పాఠశాలకు ప్రతిరోజు 8 కి.మీ కాలినడకన వచ్చేవారమని, ఇప్పుడున్న వసతులు ఏమాత్రం ఆనాడు అందుబాటులో ఉండేవి కాదన్నారు. ఉపాధ్యాయుల పనితీరు విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలన్నారు. తాము ప్రస్తుతం ఈ స్థితిలో ఉండడానికి గురువుల మార్గ నిర్దేశమే కారణమన్నారు. విద్యార్థులు అనవసర విషయాలపై కాలక్షేపం చేయకుండా సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. పరీక్షలు విద్య యొక్క కొలమానం మాత్రమేనని, విద్యార్థి ప్రతి సబ్జెక్టు పై పట్టు సాధించేలా చదవాలన్నారు. అనంతరం పదవీ విరమణ పొందిన తిరుపతిని శాలువాతో సత్కరించి, మెమొంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు బన్నాజీ, కిషన్, ప్రధానోపాధ్యాయులు రాజారత్నం, శ్రీకాంత్ రావు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్, జెడ్పిహెచ్ఎస్, ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయ బృందం, బాల్య మిత్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎన్నికల నియమాలు పాటించాలి..

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ..**

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):**



ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్ ప్రకటించినందున ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయుటకు నోడల్ అధికారులను నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిందన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం వరంగల్-ఖమ్మం- నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. జిల్లాలో తక్షణమే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బంధీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నియమ నిబంధనలు, చట్టాలపై నోడల్ అధికారులు సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ నాయకులకు సంబంధించిన ఫోటోలు, ప్రకటనలు, పోస్టర్లు, బ్యానర్లు తొలగించాలని, బస్టాండ్ వంటి ప్రాంతాల్లో ఉన్న హెూర్డింగులు, బ్యానర్లు, స్టిక్కర్లు తొలగించాలని ఆదేశించారు. ప్రజలను ప్రభావితం చేసేలా గోడలపై ఉన్న రాతలను చెరిపి వేయాలని, దేశ, రాష్ట్ర, స్థానిక రాజకీయ నాయకులకు సంబంధించిన విగ్రహాలను కవర్ చేయాలని ఆదేశించారు. ప్రతి రోజు నివేదికలు అందచేయాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన జరిగితే ఎన్నికల సంగం మార్గదర్శకాల మేరకు తగు చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

## ఈ బడ్జెట్‌లోనే కృష్ణ వికారాబాద్ రైల్వే లైన్ మంజూరు చేయాలి



● సిపిఎం డిమాండ్

**మాగనూర్, జనవరి 31 (జనంసాక్షి) :** కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఈ బడ్జెట్ సమావేశాలలోనే కృష్ణ వికారాబాద్ రైల్వే లైన్, సైనిక్ స్కూల్ నవోదయ పాఠశాలలను వెంటనే మంజూరు చేయాలని , పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కేంద్ర ప్రభుత్వ హామీ మేరకు జాతీయ హెూదా కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పుంజనూర్ ఆంజనేయులు సీనియర్ నాయకులు భరత్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం మాగనూరు మండల కేంద్రం లో జాతీయ రహదారిపై నిరసన తెలిపారు. ఫిబ్రవరి 1 నుండి కేంద్రంలో పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారం భం అవుతున్న సందర్భంగా నారాయణపేట జిల్లా అన్ని విధాలుగా వెనుకబడి ఉన్న దని నారాయణపేట జిల్లా కేంద్రం అభివృద్ధి కొరకు 500 కోట్ల ప్రత్యేక నిధులు బడ్జెట్ లో కేటాయించాలని కోరారు. ఇటీవల జిల్లా కేంద్రానికి వచ్చి న కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, మహబూబ్నగర్ పార్లమెంటు సభ్యు రాలు డీకే అరుణమ్మకు సిపి ఎం పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రం కూడా అందజేయడం జరిగిందని గుర్తు చేశారు. 12 సంవత్సరములుగా కేంద్ర బీజేపీ ప్రభుత్వ గత బడ్జెట్ లన్ని నారాయణపేట జిల్లాకు నిరాశ కలిగించాయని ఇప్పు డన్న నారాయణపేట జిల్లా ప్రజల ఆశలు నేరవేర్చాలని కోరారు .ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు సగరం ఆంజనేయులు పుంజనూర్ బాలరాజ్ కే నరసింహ నయీమ్ పుంజనూర్ మహాదేవ్ వెంకటప్పతదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ కూలీల ట్రాక్టర్ బోల్తా

● ఒకరి మృతి, ముగ్గురి పరిస్థితి ఆందోళనకరం
● పదిమందికి తీవ్ర గాయాలు - ఆరుగురికి స్వల్ప గాయాలు
● ఓవర్ టేక్ చేయబోయపోతుండగా ప్రమాదం
● డ్రైవర్ అతివేగం, నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణం
● సంఘటన స్థలంలో బంధువుల రోదన మిన్నంటింది
● క్షతగాత్రులు అందరూ బోనకల్ కూలీలు, బంధువులే



**బోనకల్, జనవరి 31 (జనంసాక్షి) :** పొట్టకూటి కోసం ఆంధ్ర ప్రాంతానికి ట్రాక్టర్ మీద 25 మంది కూలీలు వెళుతున్నారు. అయితే ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగం ప్రమాదానికి కారణం కావడంతో 25 కుటుంబాలు ప్రమాదంలో గాయపడ్డారు. ఇందులో ఒకరు అక్కడకక్కడే మృతి చెందింది. ముగ్గురికి పరిస్థితి ఆందోళనకారంగా ఉంది. పదిమందికి తీవ్ర గాయాలు కాగా 10 స్వల్ప గాయాలు అయిన సంఘటన మండల కేంద్రంలోని వైరా - జగ్గయ్యపేట ప్రధాన రహదారిలోనే సాగర్ కాలువ వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బోనకల్ గ్రామానికి చెందిన 25 మంది వ్యవసాయ కూలీలు ఆంధ్ర ప్రాంతంలోనే ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండల కేంద్రానికి చెందిన రైతుకు మిర్చి పనుల కోసం రైతు పంపించిన ట్రాక్టర్ లో వెళ్తున్నారు. బోనకల్ గ్రామం దాటగానే సాగర్ కాలువ సమీపంలో వ్యవసాయ కూలీలతో వెళు_న్న ట్రాక్టర్ డ్రైవర్ ముందుగా వెళుతున్న ఓ వాహనాన్ని ఓవర్ టేక్ చేయబోగా ఎదురుగా లారీ వస్తుండటంతో ఒక్కసారిగా డ్రైవర్ కంగుతున్నాడు. దీంతో ట్రాక్టర్ రోడ్డు పక్కనే గల లోయలో బోల్తా పడింది. కూలీలు ఉన్న ట్రక్ బోల్తా పడటంతో యార్లగడ్డ వరమ్మ, ఆత్మకూరి లక్ష్మీదేవి, లింగనబోయిన నాగమణి, మరీదు ధనలక్ష్మి ట్రక్కు కింద పడ్డారు. మిగిలిన 16 మంది కూలీలు ఆ పక్కనే నీటి గుంతలో పడ్డారు. ట్రక్కు కిందపడిన యార్లగడ్డ వరమ్మ( 60) అక్కడకక్కడే మృతి చెందింది. ఆత్మకూరు లక్ష్మీదేవి, లింగనబోయిన నాగమణి, మరీదు ధనలక్ష్మి లకు అత్యంత తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు, పొలాలలో ఉన్న రైతులు బోల్తా పడిన ట్రక్కును పైకి లేపారు. మిగిలిన 16 మంది నీటి గుంతలోనే పడి ఉన్నారు. వారందరినీ స్థానికులు బయటకు తీశారు. వీరిలో మరీదు పద్మ, గాలి కృష్ణవేణి, నిమ్మగడ్డ సుబ్బమ్మ, మొర్ల మహాలక్ష్మి, మరీదు శైలజ, మోర్ల నారాయణమ్మ, లింగం సుశీల, పసల త్రివేణి, పెద్ద గౌండ్ల వెంకటరమణ, మరీదు సత్యం, జామిలి లకు తీవ్ర గాయాలయ్యాయి. మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. సంఘటన విషయం తెలుసుకున్న బోనకల్ గ్రామస్తులు పెద్ద ఎత్తున సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను కాపాడేందుకు ప్రయత్నాలు చేశారు. ఎస్సై కడగండ్ల మధుబాబు తన సిబ్బందితో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఆ వెంటనే ట్రక్కు కింద పడి పరిస్థితి ప్రమాదకరంగా ఉన్న వారిని ముందుగా 108 లో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మిగిలిన వారిని ట్రాలీ ఆటో, మరో మూడు 108 వాహనాలలో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్సై సంఘటన స్థలంలో ఉండి సహాయక చర్యలు చేపట్టారు. సంఘటన స్థలము వద్ద పరిస్థితి అతి భయంకరంగా ఉండటంతో వాహనాలు దాదాపు గంట పాటు నిలిచిపోయాయి. ఈ ప్రమాదానికి డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని తెలిసింది. ప్రమాదం జరిగిన వెంటనే ట్రాక్టర్ డ్రైవర్ పరారయ్యాడు. ఆత్మకూరు లక్ష్మీదేవి, నిమ్మగడ్డ సుబ్బమ్మ పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో వైద్యులు హైదరాబాద్ తీసుకెళ్లాలని సూచించారు. మిగిలిన వారందరూ ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలోనే వైద్య చికిత్స పొందుతున్నారు. ఖమ్మంలో క్షతగాత్రులను వైరా ఏసిపి మహమ్మద్ అబ్దుల్ రెహమాన్ మధిర సిఐ దొంగరి మధు ఎస్ఐ కడగండ్ల మధుబాబు పరామర్శించారు. వరమ్మ మృతదేహానికి ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులు వరమ్మ మృతదేహాన్ని స్వగ్రామం తరలించారు. ఈ సంఘటనతో బోనకల్ గ్రామం అలుముకొని ఉంది. మృతి చెందిన గాయాలు పాలైన అందరూ కూడా ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు కావటంతో పాటు బంధువులు కూడా కావడం విశేషం.

## సైబరాబాద్ ట్రాఫిక్ పల్స్ ప్రారంభం

● మొబైల్‌లో తక్షణ ట్రాఫిక్ అప్‌డేట్లు



**శేరిలింగంపల్లి, జనవరి 31 (జనంసాక్షి) :** సైబరాబాద్ ట్రాఫిక్ పల్స్ సేవ పేరుతో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీస్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ శుక్రవారం సంయుక్తంగా మొబైల్స్ సేవలను ప్రారంభించారు. టాన్లా ప్లాట్‌ఫార్మ్స్ లిమిటెడ్ సహకారంతో అందుబాటులోకి వచ్చిన ఈ కొత్త వ్యవస్థ ట్రాఫిక్‌ను సమర్థంగా నియంత్రించేందుకు, రద్దీని తగ్గించేందుకు, ప్రయాణికులకు (రియల్-టైమ్) ట్రాఫిక్ సమాచారం అందించేందుకు ప్రత్యేకంగా రూపొందించడం జరిగిందని ట్రాఫిక్ విభాగం అధికారులు తెలియజేశారు. 'సైబరాబాద్ ట్రాఫిక్ పల్స్' సేవ ద్వారా ట్రాఫిక్ పరిస్థితులు, రోడ్డు మూసివేతలు, ప్రమాదాలు, ట్రాఫిక్ రెస్ట్రిక్షన్స్/డైవర్షన్స్, ముఖ్యమైన నగర కార్యక్రమాలు వంటి అంశాలపై నిర్దిష్టమైన సమాచారాన్ని నేరుగా మీ మొబైల్‌కి వాట్సాప్, గూగుల్ ఆర్ సిఎస్, ఎస్ఎంఎస్/ ఫ్లాష్ మెసేజ్‌ల రూపంలో పంపించబడుతుందన్నారు. సైబరాబాద్ ట్రాఫిక్ పల్స్ ముఖ్యమైన రహదారుల ట్రాఫిక్ సమాచారం, మార్గదర్శకాలు, మళ్లింపులు ముందుగా తెలుసుకోవచ్చని, రద్దీ కారణాలు, సాధారణ పరిస్థితికి తిరిగి రావడానికి పట్టే సమయం వంటి వివరాలను ఖచ్చితంగా తెలుసుకోవడం ద్వారా ట్రాఫిక్ చక్రబంధ వ్యూహం నుండి తప్పించుకోవడానికి ఒక గొప్ప సదవకాశంగా దీనిని అభివర్ణించారు. వాట్సాప్ ద్వారా ట్రాఫిక్ పోలీసులతో చాట్ చేసి తమ తమ ప్రాంతంలోని ట్రాఫిక్ సమస్యల గురించి అభిప్రాయాలను పంచుకోవడానికి ఇది ఒక చక్కటి వేదికగా వారు తెలియజేశారు. ప్రయాణ మార్గాలు, ప్రయాణ పద్ధతులను బట్టి అవసరమైన అప్డేట్లు మాత్రమే పొందేలా ప్రోగ్రాంని సెటప్ చేసుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు. https://cyberabadtrafficpulse.telangana.gov.in అనే యుఆర్ఎల్ ద్వారా యాప్ డౌన్లోడ్ చేసుకుని తగిన సేవలను పొందవచ్చని అధికారులు చెబుతున్నారు. సైబరాబాద్ ట్రాఫిక్ పల్స్‌ను ప్రవేశపెట్టడం ద్వారా నగర ప్రయాణికుల కోసం ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు, సమయాన్ని ఆదా చేసేందుకు తాము కట్టుబడి ఉన్నామని, ఈ విప్లవాత్మక సేవను ప్రారంభించేందుకు మాకు తోడ్పడిన ఎస్సి ఎస్సి, టాన్లా ప్లాట్‌ఫార్మ్స్ లిమిటెడ్‌కు ఈ సందర్భంగా సైబరాబాద్ సిపి అవినాష్ మహంతి కృతజ్ఞతలు తెలియజేశారు.

## జనంసాక్షి క్యాలెండర్‌ను ఆవిష్కరించిన డీపీఆర్ఓ

● జనం మదిలో "జనంసాక్షి" సుస్థిర స్థానం సంపాదించుకున్నది
● సమాజంలో పత్రికల పాత్ర కీలకమైనది
● జిల్లా పౌర సంబంధాల అధికారి కిరణ్ కుమార్



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, జనవరి 31 (జనంసాక్షి) :** చాలా కాలంగా జనం మదిలో "జనంసాక్షి" సుస్థిర స్థానం సంపాదించు కున్నదని నాగర్ కర్నూల్ జిల్లా పౌర సంబంధాల అధికారి కిరణ్ కుమార్ కొనియాడారు.జనంసాక్షి జిల్లా బ్యూరో సందు యాదగిరి ఆధ్వర్యంలో శుక్రవారం డి పి ఆర్ ఓ కార్యాలయంలో "జనంసాక్షి" దినపత్రిక క్యాలెండర్ ను డి.పి.ఆర్.ఓ కిరణ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనంసాక్షి జిల్లా ప్రతినిధి బృందం మరియు సీనియర్ పాత్రికేయులు డిపిఆర్ఓ కిరణ్ కుమార్ ను శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా డి పి ఆర్ ఓ మాట్లాడుతూ సమాజంలో పత్రికల పాత్ర చాలా కీలకమైందని అన్నారు.ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గం చూపడంలో పత్రికలు,పత్రికా ప్రతినిధులు ప్రధాన పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. జనంసాక్షి జిల్లా బ్యూరో సందు యాదగిరి మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు ప్రచురణల ద్వారా తెలుపుతూ, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పథకాలపై మరియు ఎన్నికల సర్వేలు నిర్వహించి ఖచ్చితమైన రిపోర్టులను విడుదల చేయడంలో జనంసాక్షి యాజమాన్యం మరియు ప్రతినిధుల బృందం ముందుంటుందని తెలిపారు.అసెంబ్లీ ఎన్నికలలో రాష్ట్రమంతటా పలు దఫాలుగా జనంసాక్షి సర్వేలు నిర్వహించి విడుదల చేసిన ఫలితాల ప్రకారమే ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో జనం సాక్షి జిల్లా బ్యూరో సందు యాదగిరి, జనంసాక్షి రిపోర్టర్లు బైరెడ్డి వెంకట్ రెడ్డి, అల్లంపల్లి రమేష్ బాబు,గుడి శ్రీనివాసులు,గూళ్ళ చెన్నకేశవులు, సీనియర్ పాత్రికేయులు పుట్టపాక వెంకటస్వామి, కందికొండ మోహన్, హకీం కిషోర్,కొండ కింది మాధవరెడ్డి, పంగిడి చెరువు వెంకటస్వామి, మలిపెద్ది రమేష్, డి పి ఆర్ ఓ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## బల్దియాను దివాలా తీయించింది టీఆర్ఎస్



**హైదరాబాద్, జనవరి 31 (జనంసాక్షి) :** బల్దియాను దివాలా దీయించింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి ఆరోపించారు. మిగులు బడ్జెట్ గా ఉన్న రాష్ట్రాన్ని రూ. 7000 కోట్ల అప్పులు చేసి నేడు గొప్పలు చెప్పుకుంటున్నారని దుయ్యబట్టారు. కనీసం రాష్ట్రంలోని ఉద్యోగులకు జీతాలు చెల్లించలేదని, వివిధ పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వని ప్రభుత్వం అని విమర్శించారు. జిహెచ్ఎంసి కౌన్సిల్ సమావేశం సందర్భంగా బీఆర్ఎస్ కార్పొరేటర్ల ను ఉద్దేశించి కార్పొరేటర్ రజితాపరమేశ్వర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.2014కు పూర్వం జిహెచ్ఎంసికి ఫిక్సుడు డిపాజిట్లు ఉండేవని గుర్తు చేశారు. జిహెచ్ఎంసి గల్లపెట్టే నిండుగా ఉండేదన్నారు. అప్పుడు ఏడాదికి రూ. 400 కోట్లకు పైగా నిధులు విడుదల అయ్యేవి. కానీ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక జిహెచ్ఎంసిని సైతం అప్పుల కుప్పగా మార్చారని ధ్వజమెత్తారు .రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక నిర్జీవంగా ఉన్న జిహెచ్ఎంసికి పునర్జీవం పోస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.1000 కోట్ల నిధులను జిహెచ్ఎంసీకిచ్చి ఆదుకున్నారని గుర్తు చేశారు. ఇదే కాకుండా రాష్ట్ర బడ్జెట్లోనూ మరో రూ.10 వేల కోట్ల నిధులను కేటాయించిందన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలో రూ .200 కోట్లతో అభివృద్ధి గత బి.ఆర్ ప్రభుత్వంలో ప్రతిపక్షం ఉన్నచోట్లా రూపాయల నిధులు కూడా ఇచ్చే పరిస్థితి లేదన్నారు. ఆ నియోజకవర్గాలకు నిధులు రాక, అభివృద్ధి పనులు జరుగక అనాధలుగా మిగిలిన విషయాన్ని మరిచిపోవద్దన్నారు.కానీ రేవంత్ అన్న అందుకు భిన్నంగా రాష్ట్ర అభివృద్ధిని చేస్తున్నారని చెప్పారు. ఉప్పల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే, ఎంపీ లేరన్నారు అయినప్పటికీ ఇప్పటికే నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ. 200 కోట్లకు పైగా నిధులను కేటాయించి అభివృద్ధి పనులను చేయిస్తున్నారని గుర్తు చేశారు.గత ప్రభుత్వంలో పేదల కోసం ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని కానీ ఇప్పుడు పెద్ద పెద్ద మాటలు చెబుతున్నారని దుయ్యబట్టారు. సీఎం రేవంత్ అన్న రాష్ట్ర అభివృద్ధి కట్టుబడి ప్రతిపక్షం ఉన్నా , అధికారపక్షం ఉన్నా అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నారని గుర్తు చేశారు.

## గద్దర్‌కు నివాళులర్పించిన ప్రజా సంఘాల నాయకులు



**గద్వాల నడిగడ్డ, జనవరి 31 (జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో పాత బస్టాండ్ లో శుక్రవారం అఖిలపక్ష ఆధ్వర్యంలో గద్దర్ జయంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. కాళ్లకు గజ్జె కట్టి తన ఆటపాటలతో పేద ప్రజల గొంతుకై నిలిచిన ప్రజా యుద్ధనౌక గద్దర్ అని, సమాజంలో దోపిడీ, పీడనకు వ్యతిరేకంగా ప్రశ్నిస్తూ జీవితాంతం పేదవర్గాల పక్షాన గొంతెత్తిన గద్దర్ అణచివేతలను ఎదిరించి అడవిలోకి వెళ్లిన తిరిగి వచ్చి ప్రజా సమీకరణతో పోరాటం చేసిన ప్రజల పక్షమే నిలబడి తెలంగాణ కోసం పాదయాత్ర నిర్వహించి తన ఆటపాటలతో ప్రజల్లో చైతన్యపరిచి తెలంగాణ ఆకాంక్షను రగిలించిన గొప్ప వ్యక్తి గద్దర్ అని ఆయన పోరాటంలో వ్యక్తిగత ప్రయోజనం లేదని, కడవరకు పేదల కోసమై నిలబడిన మహా నాయకుడు గద్దర్ అని, త్యాగాన్ని,పోరాట స్ఫూర్తిని గుర్తు చేసుకుంట్టువివిధ ప్రజా సంఘాల నాయకులు నీవాళ్లులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కో కన్వీనర్ శంకర ప్రభాకర్, సిపిఎం నరసింహ,సిపిఐ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు,చైతన్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు జయమ్మ, బిఆర్ఎస్ నాయకులు నాగర్ దొడ్డి వెంకట్రాములు, వకీలు యం. మధుసూదన్ బాబు, బహుజన రాజ్యసమితి జిల్లా అధ్యక్షులు వాల్మీకి, బిఆర్ఎస్ విద్యార్థి నాయకులు కురువ పల్లయ్య,మైనార్టీస్ నాయకులు హతికుర్ రెహమాన్, తెలంగాణ ప్రజా ఫ్రంట్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు నాగరాజు, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆంజనేయులు, పిడిఎస్యు హలీం భాషా, ఐ ఎఫ్ టి యు కార్తీక్, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి నాయకులు ప్రవీణ్ కుమార్,హనుమంతు, భీమన్న,టవర్ మక్బుల్, సీనియర్ సిటిజన్ ఫోరం ప్రధాన కార్యదర్శి రామన్ గౌడ్, శివ,రంగన్న ఎల్కూర్,స్వామి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి దశలో విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

● రూ.54 లక్షలతో నాలుగు అదనపు గదుల శంకుస్థాపన
● జ్ఞానం సంపాదించే విధంగా విద్యార్థులు కృషి చేయాలి
● ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**యాలాల, జనవరి 31 (జనంసాక్షి) :** విద్యార్థి దశలో విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం యాలాల్ మండలంలోని అగ్గనూర్, యాలాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి విద్య మరియు సంక్షేమ మౌలిక వసతుల కార్పోరేషన్ ద్వారా మంజూరైన రూ.54 లక్షలతో నాలుగు అదనపు గదుల శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి హాజరై, శంకుస్థాపన చేశారు.ఘనంగా స్వాగతం పలికిన విద్యార్థులు, నాయకులు.పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించిన అగ్గనూర్ విద్యార్థులు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా అద్భుతమైన ప్రదర్శన కనబర్చిన విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే,భారతీయ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా చక్కటి ప్రదర్శన చేశారని కొనియాడారు.క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, విద్య అన్నింటిలో అగ్గనూర్ విద్యార్థులు ప్రతిభా కనబర్చడం హర్షించదగ్గ విషయమని అన్నారు.నేటి విద్యార్థులు మార్కులు, పరీక్షల కోసం కాకుండా జ్ఞానం సంపాదించే విధంగా విద్యార్థులు కృషి చేయాలి.ప్రతి విద్యార్థి ఏదో ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకొని లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమించాలని , జన్మనిచ్చిన తల్లిదండ్రులను, చదువు నేర్పిన గురువులను, పెద్దలను గౌరవించడం విద్యార్థులు విధిగా అలవాటు చేసుకోవాలని అన్నారు. ప్రజా పాలనలో విద్యకు పెద్దపీఠ వేయడం జరిగిందని, యాలాల్ మండలంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు.ప్రభుత్వం ఏర్పాటు అయిన వెంటనే అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడం జరిగిందని, సంక్షేమ హాస్టళ్లు విద్యార్థులకు మెస్ , కాస్మోటిక్స్ చార్జీలు పెంచడం జరిగిందని, గ్రామం, పాఠశాలలో గల పలు సమస్యలను దశలవారీగా పరిష్కారం చూపే విధంగా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన పలువురు నాయకులు, గ్రామస్తులు, విద్యార్థులు, పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కొత్త విమాన సర్వీసులను ప్రారంభించిన జీఎంఆర్




**శంషాబాద్, జనవరి 31 (జనంసాక్షి) :** ప్రయాణికులకు అంతర్జాతీయ కనెక్టివిటీని పెంచుతూ జీఎంఆర్ (హైదరాబాద్) శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం (జీహెచ్ఐఏఎల్) ఫుకెట్- శంషాబాద్ మధ్య కొత్త విమాన సర్వీసులను ప్రారంభించింది. తొలి విమానం శుక్రవారం టేకాఫ్ అయింది. ఎయిరిండియా ఎక్స్ప్రెస్ వారానికి బుధ, శుక్ర, ఆదివారాల్లో మూడు విమాన సర్వీసులను నడపనుంది. ఫిబ్రవరి 15, 2025 నుండి, ఫ్రీక్వెన్సీ వారానికి ఆరు విమానాలకు పెరుగుతుంది. విమానం వ్యవధి సుమారు 3 గంటల 45 నిమిషాలు, ఇది ప్రయాణీకులకు సౌకర్యవంతమైన అంతరాయం లేని ప్రయాణ అనుభవాన్ని అందిస్తుంది. జీఎంఆర్ శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ లిమిటెడ్ సిఇఒ ప్రదీప్ పాణికర్ మాట్లాడుతూ ఈ కొత్త విమానాలను ప్రవేశపెట్టడం ఫుకెట్- శంషాబాద్ మధ్య కనెక్టివిటీని గణనీయంగా పెంచుతుంది. శంషాబాద్ విమానాశ్రయం నుండి మరిన్ని ప్రయాణ ఎంపికలను అందించడానికి మా నిరంతర ప్రయత్నంలో భాగంగా ఈ చొరవ ఉంది. ఫుకెట్ పర్యాటకులకు అత్యంత డిమాండ్ ఉన్న గమ్యస్థానాలలో ఒకటి మేము దీనిని చేయగలిగినందుకు మేము సంతోషిస్తున్నామన్నారు. ఏర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీఅలోక్ సింగ్ వ్యాఖ్యానిస్తూ హైదరాబాద్ మరియు ఫుకెట్ మధ్య నేరుగా విమానాలను ప్రారంభించిన తొలి ఎయిర్‌లైన్‌గా ఉండడం మాకు ఎంతో ఆనందంగా ఉంది. నగరంలోని మా అంతర్జాతీయ నెట్‌వర్క్‌ను మరింత విస్తరించడానికి ఇది సహాయపడుతుంది. ఈ కొత్త మార్గం సౌదీ అరేబియాలోని మా ప్రస్తుత కనెక్టివిటీదమ్మాం, జెడ్డా, రియాద్ వంటి మూడు ప్రధాన విమానాశ్రయాలకు అనుసంధానమవుతూ ప్రయాణికులకు మరింత సౌలభ్యాన్ని అందిస్తుంది. హైదరాబాద్ మా నెట్‌వర్క్‌లో ప్రత్యేకమైన స్థానాన్ని కలిగి ఉంది. ఇది ఒక ముఖ్యమైన విమానయాన కేంద్రమే కాకుండా, సంస్కృతి, వారసత్వ సంపదతో ప్రసిద్ధిచెందిన నగరం. మేము గర్వంగా ప్రకటించగల ఒక విషయం ఏమిటంటే, మా కొత్త విమానాల్లో ఒకదానిపై కలంకారీ కళను ప్రతిబింబించే డిజైన్‌ను అందించాము, ఇది తెలుగు ప్రజల కళా సంప్రదాయాలను స్మరించుకునేలా ఉంటుంది. మా అభివృద్ధిని కొనసాగిస్తూ, ప్రయాణికులకు అర్థవంతమైన అనుసంధానాలను సృష్టించడం, మరింత అందుబాటులోకి తేనడం, అలాగే భారతీయ అతిథ్యస్వాగతాన్ని వారికి అందించడమే మా లక్ష్యం. ప్రస్తుతం, హైదరాబాద్ నగరాన్ని 20 దేశీయ, 4 అంతర్జాతీయ గమ్యస్థానాలతో కలిపే 210 కి పైగా వారపు విమాన సర్వీసులను మేము నిర్వహిస్తున్నాం. భవిష్యత్తులో మరింత విస్తరించి, మా ప్రయాణికులకు మరిన్ని ప్రయాణ అవకాశాలను అందించడానికి ఎదురు చూస్తున్నాం అని అన్నారు.

# రికార్డు బ్రేక్ చేయనున్న నిర్మలమ్మ

## వరుసగా ఎనిమిదోసారి..

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మరో సరికొత్త రికార్డు సృష్టించబోతున్నారు.

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మరో సరికొత్త రికార్డు సృష్టించబోతున్నారు ప్రస్తుత ఆర్థిక సంవత్సరాని (2025-26)కి సంబంధించిన పూర్తి స్థాయి బడ్జెట్‌ను రేపు నిర్మలమ్మ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న విషయం తెలిసిందే. వరుసగా ఎనిమిదో సారి కేంద్ర బడ్జెట్‌ను పార్లమెంట్‌కు సమర్పించనున్నారు. తద్వారా వరుసగా ఎనిమిదిసార్లు పార్లమెంటులో కేంద్ర బడ్జెట్ ప్రవేశ పెట్టిన మంత్రిగా నిర్మలా సీతారామన్ రికార్డు నెలకొల్పనున్నారు.

నిర్మలమ్మ ఇప్పటికే ఒక తాత్కాలిక బడ్జెట్, ఏడు పూర్తిస్థాయి బడ్జెట్‌లు సమర్పించిన విషయం తెలిసిందే. రేపు అంటే ఫిబ్రవరి ఒకటో తేదీన సమర్పించే బడ్జెట్ ఎనిమిదవది. ఈ బడ్జెట్‌తో వరుసగా ఎనిమిదోసారి బడ్జెట్‌ను సమర్పించిన ఆర్థిక మంత్రిగా నిర్మలమ్మ రికార్డు సృష్టించనున్నారు. ఈ బడ్జెట్‌తో మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ 10 బడ్జెట్‌ల రికార్డుకు నిర్మలమ్మ చేరువకాను న్నారు. మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ 1959-1964 మధ్య ఆర్థిక మంత్రిగా ఉన్న సమయంలో మొత్తం 6 బడ్జెట్‌లు, 1967-69 మధ్య 4 బడ్జెట్‌లు సమర్పించారు. మాజీ ఆర్థిక మంత్రులు పి చిదంబరం 9 బడ్జెట్‌లు, ప్రణబ్ ముఖర్జీ 8 బడ్జెట్‌లను సమర్పించారు. అయితే, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హయాంలో వరుసగా ఎనిమిది బడ్జెట్‌లను ప్రవేశ పెట్టిన ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ రికార్డు సృష్టించబోతున్నారు. అంతేకాదు మోదీ హయాంలో అత్యధిక బడ్జెట్‌లను సమర్పించిన మంత్రిగా కూడా నిలవనున్నారు. 2019లో నరేంద్రమోదీ సారథ్యంలో రెండో దఫా కేంద్ర ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి 2019-20 ఆర్థిక సంవత్సరం నుంచి 2023-24 ఆర్థిక సంవత్సరం వరకూ వరుసగా ఐదు పూర్తి స్థాయి బడ్జెట్లను కేంద్ర ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. గతేడాది సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తాత్కాలిక బడ్జెట్ పార్లమెంటుకు సమర్పించారు. ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికల అనంతరం 2024-25కి సంబంధించిన పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. వరుసగా ఏడవ సారి బడ్జెట్‌ను పార్లమెంట్‌కు సమర్పించారు. ఇప్పుడు ఎనిమిదోసారి బడ్జెట్ ప్రవేశపెట్టి రికార్డు నెలకొల్పనున్నారు. కాగా, మోదీ తొలి విడుత మంత్రి వర్గంలో (2014) పరిశ్రమలు, వాణిజ్యశాఖ మంత్రిగా నిర్మలా సీతారామన్ బాధ్యతలు చేపట్టారు. 2017లో కీలకమైన రక్షణ శాఖ బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత 2019లో రెండోసారి ప్రధాని మోదీ ఎన్నికైన తర్వాత ఏర్పాటైన కేంద్ర మంత్రి వర్గంలోనూ చోటు దక్కించుకున్న నిర్మలా సీతారామన్‌కు అత్యంత కీలకమైన ఆర్థికశాఖను అప్పగించారు నరేంద్రమోదీ. నాటి నుంచి దేశీయ ఆర్థిక రంగంలో మలి విడుత ఆర్థిక సంస్కరణలను పరుగులెత్తించారు. కేంద్ర మంత్రివర్గంలో మూడోసారి వరుసగా చోటు దక్కించుకున్న ఏకైక మహిళా నాయకురాలిగా నిర్మలా సీతారామన్ రికార్డు నెలకొల్పారు.



**మోదీ హయాంలో అత్యధిక బడ్జెట్‌లను సమర్పించిన మంత్రిగా కూడా నిలవనున్నారు. 2019లో నరేంద్రమోదీ సారథ్యంలో రెండో దఫా కేంద్ర ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి 2019-20 ఆర్థిక సంవత్సరం నుంచి 2023-24 ఆర్థిక సంవత్సరం వరకూ వరుసగా ఐదు పూర్తి స్థాయి బడ్జెట్లను కేంద్ర ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు.**

# పార్లమెంట్ ముందుకు ఆర్థిక సర్వే..

పార్లమెంట్‌లో బడ్జెట్ సమర్పించడానికి ముందు 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆర్థిక సర్వేను 2024-25) కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ఉభయసభల్లో ప్రవేశపెట్టారు.

కేంద్ర బడ్జెట్ సమావేశాలు శుక్రవారం ఉదయం ప్రారంభమయ్యాయి. కేంద్రంలో ఎన్డీయే సర్కార్ మూడోసారి సంపూర్ణ బడ్జెట్ ప్రవేశపెట్టబోతోంది. శనివారం ప్రస్తుత ఆర్థిక సంవత్సర (2025-26) బడ్జెట్‌ను సమర్పించనుంది. ఈ నేపథ్యంలో పార్లమెంట్‌లో బడ్జెట్ సమర్పించడానికి ముందు 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆర్థిక సర్వేను 2024-25) కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ఉభయసభల్లో ప్రవేశపెట్టారు. ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం అనంతరం ఆమె ఆర్థిక సర్వేను పార్లమెంట్‌కు సమర్పించారు.

గత సంవత్సర కాలంలో దేశ ఆర్థిక పనితీరును.. రాబోయే సంవత్సరంలో ఆర్థికంగా ఎదురయ్యే సవాళ్లను ముందుగానే అంచనా వేసి చెప్పేదే ఆర్థిక సర్వే. ఏటా దీని ఆధారంగానే కేంద్ర బడ్జెట్ రూపకల్పన ఉంటుంది. ఆర్థిక మంత్రిత్వశాఖ రూపొందించే ఈ సర్వే రానున్న రోజుల్లో దేశం ముందున్న సవాళ్లు, వాటిని ఎదుర్కోవడానికి తీసుకోవాల్సిన చర్యలను ముందుగానే అంచనా వేసి పలు సూచనలను చేస్తుంది.

దేశ ఆర్థిక వ్యవస్థ ఏ విధంగా ఉందనే విషయాన్ని స్పష్టంగా తెలియజేస్తుంది. కేవలం దేశ ఆర్థిక పరిస్థితులను తెలియజేయడమే కాకుండా.. ప్రధాన రంగాలైన వ్యవసాయం, పారిశ్రామికోత్పత్తి, మౌలిక సదుపాయాలు, ఎగుమతి దిగుమతులు, విదేశీ మారక నిల్వలు, నగదు చలామణి, ఉద్యోగాలు, ధరల పెరుగుదల వంటి అంశాలను కూడా వివరిస్తుంది. ప్రభుత్వ విధాన నిర్ణయాలు, వాటివల్ల కలుగుతున్న ఫలితాలను కూడా విశ్లేషిస్తుంది. బడ్జెట్‌కు ముందు ఆర్థిక సర్వేను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడం ఎన్నో ఏళ్లుగా ఆనవాయితీగా వస్తోంది. 1950-51 నుంచి యూనియన్ బడ్జెట్ తోపాటు ఆర్థిక సర్వేను పార్లమెంటులో ప్రవేశ పెట్టే వారు. అయితే, 1960వ దశకం నుంచి కేంద్ర బడ్జెట్ సమర్పించడానికి ఒక రోజు ముందు ఆర్థిక సర్వేను పార్లమెంటులో ప్రవేశ పెడుతున్నారు.

# పద్దుకు వేళాయెరా..




మరికొద్ది గంటల్లో కేంద్ర బడ్జెట్ ఆవిష్కృతం కానున్నది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను పార్లమెంట్‌లో శనివారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నారు. ఎప్పట్లాగే ఈసారీ సమాజంలోని ఆయా వర్గాలు, ముఖ్యంగా మధ్యతరగతి ప్రజానీకం, సగటు ఉద్యోగులు పద్దుపై బోలెడు ఆశలు, అంచనాలు పెట్టుకున్నారు. ప్రధానంగా వ్యక్తిగత ఆదాయ పన్నుకు సంబంధించి ఊరటనివ్వాలని పెద్ద ఎత్తున కోరుతున్నారు. మరి వాటిని మోదీ సర్కారు ఏ మేరకు నెరవేరుస్తుందో చూడాలి.

ఇక రాబో యే బడ్జెట్‌పైనున్న టాప్-10 అంచనాలివే..

### ఐటీ శ్లాబులు-రేట్లు

కొత్త, పాత వ్యక్తిగత ఆదాయ పన్ను (ఐటీ) విధానాల్లో శ్లాబులు, రేట్లను మార్చాలని ట్యాక్స్‌పేయర్స్ కోరుకుంటున్నారు. అయితే ఐదేండ్ల కిందట కొత్త ఆదాయ పన్ను విధానాన్ని తీసుకొచ్చిన మోదీ సర్కారు.. అప్పట్నుంచి పాత ఆదాయ పన్ను విధానం జోలికే వెళ్లడం లేదు. కొత్త విధానాన్ని మరింత ఆకర్షణీయంగా మార్చడానికే ప్రతీ బడ్జెట్‌లో సవరణలు చేస్తూ వస్తున్నది. దీంతో ఈసారి కొత్తదానిలో వార్షిక ఆదాయం రూ.20 లక్షలు, అంతకుమించి ఉంటేనే 30 శాతం పన్ను వేయాలన్న డిమాండ్లు భారీగా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం రూ.15 లక్షలు దాటితే 30 శాతం పన్ను పడుతున్నది. అలాగే రూ.12-15 లక్షల శ్లాబుపై వర్తిస్తున్న 20 శాతం పన్నును 15 శాతానికి కుదించి.. కొత్తగా రూ.10-15 లక్షల శ్లాబును తీసుకురావాలని కోరుతున్నారు.

### స్టాండర్డ్ డిడక్షన్

కొత్త ఆదాయ పన్ను విధానంలో స్టాండర్డ్ డిడక్షన్‌ను లక్ష రూపాయలకు పెంచాలని పన్ను చెల్లింపుదారులు కోరుతున్నారు. పెంచితే మరింత మంది ట్యాక్స్‌పేయర్స్ కొత్త విధానంలోకి వచ్చే వీలుందని నిపుణులూ చెప్తున్నారు. ఇక కిందటి బడ్జెట్‌లో రూ.50వేల నుంచి రూ.75వేలకు పెంచిన విషయం తెలిసిందే. మరోవైపు పాత పన్ను విధానంలోనూ స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.75వేలకు పెంచాలన్న డిమాండ్లు వస్తున్నాయి.

### పన్ను మినహాయింపు

కొత్త ఆదాయ పన్ను విధానంలో ఇప్పుడు వార్షిక ఆదాయం రూ.3 లక్షలదాకా ఉంటే ఎలాంటి పన్ను లేదు. అయితే దీన్ని రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ఇక పాత ఆదాయ పన్ను విధానంలోనూ ఈ పన్ను మినహాయింపు పరిమితిని ప్రస్తుతమున్న రూ.2.5 లక్షల నుంచి 3 లక్షలకు పెంచాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.

### ఆదాయ పన్ను రిబేటు

ప్రస్తుతం వ్యక్తిగతంగా పన్ను సహిత ఆదాయం ఏటా రూ.7 లక్షలదాకానే ఉంటే పూర్తిగా ట్యాక్స్ రిబేటుకు వీలుంటున్నది. అయితే దీన్ని ఈసారి బడ్జెట్‌లో రూ.10 లక్షలకు పెంచాలని ట్యాక్స్‌పేయర్స్ కోరుతున్నారు. కొత్త ఆదాయ పన్ను విధానంలో రావాలని కోరుతున్న ఈ మార్పుతో మధ్యతరగతి వర్గాలకు పెద్ద ఊరట లభిస్తుందని చెప్తున్నారు. వినిమయ శక్తి కూడా పెరిగి మార్కెట్‌కు కొత్త ఉత్సాహం వస్తుందనీ నిపుణులు పేర్కొంటున్నారు.

### సెక్షన్ 80సీ

కొత్త ఆదాయ పన్ను విధానంలోనూ పొదుపు, పెట్టుబడులను ప్రోత్సహించేందుకు ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 80సీ ప్రయోజనాలను తేవాలని పలువురు ఎక్స్‌పర్ట్స్ సూచిస్తున్నారు. ప్రస్తుతం పాత ఆదాయ పన్ను విధానంలో సెక్షన్ 80సీ కింద ఏటా గరిష్ఠంగా రూ.1.5 లక్షలదాకా పన్ను మినహాయింపులను ట్యాక్స్‌పేయర్స్ క్లెయిం చేసుకోవచ్చన్న సంగతి విదితమే. ఇదిలావుంటే దీన్ని రూ.2 లక్షలకు పెంచాలని పాత ఆదాయ పన్నును ఎంచుకొంటున్నవారూ డిమాండ్ చేస్తున్నారు.

### ఎన్‌పీఎస్‌కు ప్రోత్సాహకాలు

నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)ను మరింత మంది ఎంచుకొనేలా ఈ బడ్జెట్‌లో పలు నిర్ణయాలు, ప్రోత్సాహకాలు ఉండొచ్చని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. దీనికి పూర్తిగా పన్ను మినహాయింపును కల్పించవచ్చని, పాత ఆదాయ పన్ను విధానంలో ఉన్నట్టుగానే.. కొత్త ఆదాయ పన్ను విధానంలోనూ ఎన్‌పీఎస్‌కు రూ.50వేలదాకా అదనపు పన్ను ప్రయోజనాలను కల్పించవచ్చని చెప్తున్నారు.

### హెచ్ఆర్ఏ ప్రయోజనాలు

మెట్రోపాలిటన్ ప్రాంతాలకుతోడు ద్వితీయ శ్రేణి నగరాల్లో ఉంటున్నవారికీ హౌజ్ రెంట్ అలవెన్స్ (హెచ్ఆర్ఏ) ప్రయోజనాలు అందేలా ఈసారి బడ్జెట్‌లో చర్యలుంటాయని అంచనా. బేసిక్ సాలరీలో 40 శాతానికి బదులుగా 50 శాతానికి హెచ్ఆర్ఏ మినహాయింపుల్ని పెంచవచ్చని చెప్తున్నారు.

### సెక్షన్ 80డీ

పెరిగిన ఖర్చుల దృష్ట్యా ఆరోగ్య బీమా ప్రీమియంలూ పెరిగిపోతున్నాయి. సమగ్ర కవరేజీ కోసం మరింత ఖర్చు చేయాల్సిన పరిస్థితి పాలసీదారులకు వచ్చింది. దీంతో కొత్త ఆదాయ పన్ను విధానంలో ఆరోగ్య బీమా కోసం చేసే ప్రీమియం చెల్లింపులపై ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 80డీ కింద ఉండే ప్రయోజనాలను వర్తింపజేయాలని కోరుతున్నారు.

### సెక్షన్ 80జీ/80టీటీఏ

స్వచ్ఛంద సంస్థలకు విరాళాలు పెరిగేలా, బ్యాంకుల్లో పొదుపును ప్రోత్సహించేలా ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 80జీ/సెక్షన్ 80టీటీఏ ప్రయోజనాలను కొత్త ఆదాయ పన్ను విధానంలోనూ అమలుపర్చవచ్చని అంచనా.

### గృహ రుణగ్రహీతల కోసం..

నిర్మాణ రంగానికి ఊతమిచ్చేలా స్థిరాస్తి కొనుగోలుదారులకు వివిధ రకాల పన్ను ప్రయోజనాలను బడ్జెట్‌లో ప్రకటిస్తారని అంచనాలున్నాయి. ఇందులో భాగంగానే గృహ రుణగ్రహీతలకు అసలు, వడ్డీ చెల్లింపులపై పన్ను మినహాయింపులను పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి. రూ.2 లక్షలదాకా పన్ను ప్రయోజనాలను ట్యాక్స్‌పే యర్స్ క్లెయిం చేసుకోవచ్చు. అయితే దీన్ని రూ.3 లక్షలకు పెంచవచ్చని అంటున్నారు. అలాగే ఆదాయ పన్ను రిటర్ను (ఐటీఆర్)ల ప్రక్రియను సులభతరం చేయవచ్చని కూడా చెప్తున్నారు.

# ఆలయాల్లో వీఐపీ దర్శనాలు రద్దు చేయాలని సుప్రీంలో పిల్..



దేశవ్యాప్తంగా ఉన్న దేవాలయాల్లో వీఐపీ దర్శనాలు కల్పించడాన్ని రద్దు చేయాలని దేశ అత్యున్నత న్యాయస్థానం అయిన సుప్రీంకోర్టులో తాజాగా ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. అయితే దీనిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. వీఐపీ దర్శనాలు, ఆలయాల నిర్వహణ విషయాల్లో తాము జోక్యం చేసుకోలేమని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది.

దేశవ్యాప్తంగా ఉన్న ఆలయాల్లో వీఐపీలకు ప్రత్యేక దర్శనాలు కల్పించడం వల్ల.. సామాన్య భక్తులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వీఐపీలకు స్పెషల్ దర్శనాలు కల్పించడం వల్ల.. గంటల తరబడి మహిళలు, చిన్న పిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు క్యూలైన్లలోనే పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఇలా రద్దీ ఎక్కువగా ఉన్నపుడు తోపులాటలు, తొక్కిసలాటలు జరిగి దేశవ్యాప్తంగా పలు విషాధ ఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలోనే సుప్రీంకోర్టులో ఒక పిల్ దాఖలైంది. ఆలయాల్లో వీఐపీ దర్శనాలు కల్పించడం ఆపాలని పిటిషనర్ కోరగా.. అందుకు నిరాకరించింది. ఇప్పుడు ఈ పిటిషన్‌కు సంబంధించి ఎలాంటి ఆదేశాలను కూడా జారీ చేయడానికి కోర్టు ఒప్పుకోలేదు.

ఈ పిల్‌పై సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిల్‌పై విచారణ జరుపుతోంది. అయితే పిటిషనర్ లేవనెత్తిన అంశాలు నిజమేనని ధర్మాసనం ఏకీభవించినప్పటికీ.. కోర్టు స్వంతంగా ఎలాంటి ఉత్తర్వులు లేదా మార్గదర్శకాలను జారీ చేయడం సరైంది కాదని స్పష్టం చేసింది. ఈ విషయంలో రాష్ట్ర సంస్థలు తమ విచక్షణ ప్రకారం.. అందుకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవచ్చని వెల్లడించింది.

అంతేకాకుండా ఆలయాల్లో వీఐపీ దర్శనానికి అదనపు రుసుములు వసూలు చేయడాన్ని పిటిషనర్ వ్యతిరేకించారు. దేవాలయాల్లో కొంతమందికి ప్రాధాన్యత ఇచ్చి.. వారి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆకాష్ వశిష్ఠ అనే లాయర్ పిల్ దాఖలు చేశారు. అయితే ఈ పిల్‌ను పరిగణనలోకి తీసుకోవడానికి కోర్టు అంగీకరించలేదు. ఈ అంశంపై సమాజం, ఆలయ నిర్వహణ నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంటుందని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ విషయంలో కోర్టు ఎలాంటి దిశానిర్దేశం చేయదని వెల్లడించింది.

దేశంలో 12 జ్యోతిర్లింగాలు ఉన్నందున కొన్ని నియమ నిబంధనలు అవసరం అని లాయర్ ఆకాష్ వశిష్ఠ పేర్కొన్నారు. ఆలయాల్లో వీఐపీ దర్శనం వ్యవస్థ మొత్తం ఏకపక్షంగా ఉందని తెలిపారు. బృందావనంలోని శ్రీ రాధా మదన్ మోహన్ ఆలయానికి చెందిన విజయ్ కిషోర్ గోస్వామి కూడా ఇదే అంశంపై దాఖలు చేసిన పిటిషన్‌పైనా కోర్టు విచారణ జరుపుతోంది. దేవాలయాల్లో వీఐపీ సంస్కృతి రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, ఆర్టికల్ 21లో పొందుపరచబడిన సమానత్వ హక్కును ఉల్లంఘించడమేనని ఆ వ్యాజ్యంలో పిటిషనర్ పేర్కొన్నారు. అయితే వీటన్నింటినీ విన్న కోర్టు.. వీఐపీ దర్శన విధానాలకు సంబంధించి ఆలయ నిర్వహణ నిర్ణయాల్లో తాము జోక్యం చేసుకోలేమని వెల్లడించింది.

# మహా కుంభమేళాలో 100 అడుగుల భారీ సర్పం..

ప్రయాగ్‌రాజ్‌లో జనవరి 13న ప్రారంభమైన కుంభమేళాకు దేశ విదేశాల నుంచి భక్తులు పోటెత్తుతున్నారు. 18 రోజుల్లోనే దాదాపు 28 కోట్ల మంది స్నానాలు చేసినట్టు నివేదికలు చెబుతున్నాయి. అయితే, మౌని అమావాస్య సందర్భంగా తొక్కిసలాటలో దాదాపు 30 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. కోట్లాది మంది భక్తులు ఒకేసారి తరలిరావడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఇదే సమయంలో కుంభమేళాకు సంబంధించిన పలు ఫోటోలు, వీడియోలతో తప్పుడు ప్రచారాలు కూడా చేస్తున్నారు.

ఉత్తర్ ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాకు భక్తులు పోటెత్తుతున్నారు. జనవరి 29న మౌని అమావాస్య రోజున పుణ్యస్నానాలు ఆచరించడానికి దాదాపు 8 కోట్ల మంది తరలివచ్చారు. దీనికి అనుగుణంగా గంగా, యమునా, సరస్వతి నదులు కలిసే త్రివేణి సంగమం వద్ద 'అమృత స్నాన్' కోసం ఏర్పాట్లు చేశారు. ఇక, యాత్రికుల రాకపోకలను సజావుగా సాగించేందుకు రైల్వే కూడా అదనంగా 190 ప్రత్యేక రైళ్లు నడపింది. ప్రయాగ్‌రాజ్ నుంచి ప్రతి నాలుగు నిమిషాలకు రైళ్లు అందుబాటులో తీసుకొచ్చింది భారతీయ రైల్వే.

పలువురు రాజకీయ నాయకులు, ప్రముఖులు కూడా కుంభమేళాలో పుణ్య స్నానాలు ఆచరిస్తున్నారు. ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం కూడా భద్రతను భారీగా పెంచింది. ఏఐ సాంకేతికతతో పనిచేసే సీసీటీవీ కెమెరాలు, డ్రోన్లను పెద్ద ఎత్తున మోహరించింది. మహాకుంభమేళా ప్రాంతాన్ని నో వెహికల్ జోన్‌గా ప్రకటించారు. స్థానికులు ఫోర్ వీలర్స్ వాడొద్దని, దీనికి బదులుగా ద్విచక్ర వాహనాలను ఉపయోగించాలని అధికారులు సూచించారు. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే యాత్రికుల రాకపోకలను సులభతరం చేయడానికి నడకకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.



కాగా, కొందరు భక్తులు కుంభమేళాలో స్నానం చేస్తూ ఉండగా వెనుక ఓ పెద్ద పాము నీటిలో నుంచి లేచినట్లుగా ఓ వీడియో వైరల్ అవుతోంది. కుంభమేళాలో 100 అడుగుల పొడవైన పాము కనిపించిందంటూ వైరల్ అవుతోన్న ఈ వీడియోను లక్ష మందికి పైగా లైక్ చేశారు. వైరల్ అవుతున్న వీడియోలో నిజం లేదని తెలుగు పోస్ట్ తేల్చింది. 100 అడుగుల భారీ సర్పం కుంభమేళాలో కనిపించిందంటూ జరుగుతున్న ప్రచారం నిజం కాదు.

తెలుగు పోస్ట్ టీమ్ సంబంధిత కీవర్డ్స్‌తో గూగుల్‌లో సెర్చ్ చేయగా భారీ సర్పం కనిపించినట్లు ఎలాంటి వార్తా కథనాలు లభించలేదు. అంత భారీ పాము కుంభమేళాలో కనిపించి ఉంటే తప్పకుండా వార్తల్లో వచ్చి ఉండేది. ఇదే తరహాలో పలు వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.. భారీ పాము నీళ్లలో కనిపిస్తూ ఉన్నా కూడా అక్కడే ఉన్న ప్రజలు ఏ మాత్రం ఆందోళన చెందకుండా ఉండడం వీడిలో చూడొచ్చు. అక్కడి వ్యక్తుల్లో హావభావాల్లో ఎలాంటి తేడాలు కనిపించలేదని వీడియోను నిశితంగా పరిశీలిస్తే అర్థం అవుతోంది. భారీ సర్పం కనిపించిందనే అంశంపై విశ్వసనీయ నివేదికలు లేకపోవడం వీడియో నకిలీదని నిర్ధారణకు వచ్చాం. వైరల్ వీడియోకు సంబంధించి సరైన ఆధారాలు లభించకపోవడం, వీడియోలో పలు లోపాలు ఉండటం మహాకుంభమేళా వద్ద భారీ పాము కనిపించిందనే వాదనల్లో నిజం లేదు. వీడియో ఖచ్చితంగా ఏఐ సృష్టి అనే అనుమానాలకు బలం చేకూర్చుతుంది.

# రాష్ట్రపతి ప్రసంగం.. పోలవరం ప్రాజెక్ట్‌పై కీలక ప్రకటన



పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ప్రసంగిస్తున్నారు. ఈ బడ్జెట్ సమావేశాలు రెండు విడల్లో జనవరి 31 నుంచి ఏప్రిల్ 13 వరకు జరుగుతాయి. తొలి విడతలో మొత్తం 9 రోజులపాటు ఫిబ్రవరి 13 వరకు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశాల్లోనే పలు కీలక బిల్లులు ముఖ్యంగా వక్ఫ్ చట్ట సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంతో పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఉదయం 11 గంటలకు ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తున్నారు. తొలుత ఇటీవల మరణించిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా దేశానికి మన్మోహన్ సేవలను కొనియాడారు. అలాగే, మహాకుంభమేళా తొక్కిసలాటలో మృతిచెందిన భక్తులకు నివాళులర్పించారు. మహాకుంభమేళాలో కోట్లాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారని అన్నారు. విద్యా రంగంపై తమ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని తెలిపారు.

'డిజిటల్ టెక్నాలజీ రంగంలో ప్రస్తుతం భారత్ అత్యంత కీలక పాత్ర పోషిస్తోంది.. యూపీఐ లావాదేవీల విధానం చూసి అభివృద్ధి చెందిన దేశాలే ముక్కున వేలేసుకుంటున్నాయి.. సామాజిక న్యాయం, సమానత్వానికి మా ప్రభుత్వం డిజిటల్ టెక్నాలజీని ఓ సాధనంగా వినియోగిస్తోంది' అని అన్నారు.

ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టు పూర్తిచేయడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఈ దిశగా కృషి చేస్తోందని అన్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం రూ.12 వేల కోట్లు కేటాయించామని తెలిపారు. వక్ఫ్ బోర్డ్ సంస్కరణపై దృష్టి సారించిందని చెప్పారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా లక్షలాది మంది పేదల సొంతింటి కల నెరవేరబోతోందని అన్నారు. 3 కోట్ల మంది పేదలకు ఇళ్లను నిర్మిస్తున్నామని చెప్పారు. బడ్జెట్‌లో రైతులు, మహిళలు, యువతకు ప్రాధాన్యత ఇస్తున్నాం.. భారతీయుడు అంతరిక్షంలో అడుగుపెట్టే రోజు ఎంతో దూరంలో లేదన్నారు. 'ఇటీవలే ఇస్రో 100 వ ప్రయోగం విజయవంతంగా నిర్వహించింది.. అమృత్ భారత్, నమో భారత్ రైళ్లు అందుబాటులోకి వచ్చాయి.. ప్రభుత్వ ఉద్యోగులు కూడా మధ్య తరగతివారే కాబట్టి వారి కోసం 8వ వేతన సంఘాన్ని నియమించినట్టు' తెలిపారు. 'దేశ అభివృద్ధి ఫలాలు ప్రజలందరికీ చేరాలి.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలకు లబ్ధి చేకూర్చుతున్నాయి.. 70 ఏళ్ల దాటిన 6 కోట్ల మందికి ఆరోగ్య భీమా.. లక్‌పతి దీదీ పథకం ద్వారా 3 లక్షల మంది మహిళలను లక్షాధికారులను చేయాలనేదే ప్రభుత్వం లక్ష్యం.. డ్రోన్ దీదీ స్కీమ్ మహిళలకు ఉపయోగపడుతోంది... నేషనల్ రిసెర్చ్ ఫౌండేషన్ ప్రారంభించాం.. భారత్‌ను ఇన్నోవేషన్ పవర్ హబ్‌గా మార్చాలన్నదే లక్ష్యం.. ఇటీవలే ఇండియా ఏఐ మిషన్ ప్రారంభించాం... త్వరలోనే భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతోంది.. ఖేలో ఇండియా దేశంలో యువతకు ఎంతో ఉపయోగపడు తోంది.. ఒలింపిక్స్, పారా ఒలింపిక్స్‌లో భారత క్రీడాకారులు సత్తాచాటుతున్నారు..వన్ నేషన్ వన్ ఎలక్షన్ దిశగా అడుగులు పడుతున్నాయి.. ' అని రాష్ట్రపతి తెలిపారు.

# ఏపీఆర్‌ఓ వీరాంజనేయులు ఉద్యోగ విరమణ సందర్భంగా ఆత్మీయ వీడ్కోలు

**కరీంనగర్ బ్యూరో, జనవరి 31 (జనంసాక్షి) :**

ఏపీఆర్‌ఓ వీరాంజనేయులు దాదాపు 34 సంవత్సరాలు ఎలాంటి మచ్చ లేకుండా పనిచేసి మంచి పేరు సంపాదించుకున్నారని సమాచార పౌర సంబంధాల శాఖ కరీంనగర్ అసిస్టెంట్ డైరెక్టర్ ఏ లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. వీరాంజనేయులు నిత్యం అంకిత భావం నిబద్ధతతో పనిచేస్తూ సమాచార శాఖకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని తెలిపారు. ఏపీఆర్‌ఓగా పనిచేస్తున్న మార్క వీరాంజనేయులు ఉద్యోగ విరమణ పురస్కరించుకొని సమాచార పౌర సంబంధాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఏ లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యంలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం శుక్రవారం సాయంత్రం కరీంనగర్ ప్రెస్ భవన్ లో జరిగింది. అసిస్టెంట్ డైరెక్టర్ కె.లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యంలో సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు సిబ్బంది, టీఎన్జీవో సంఘం నేతలు, జర్నలిస్టులు బంధుమిత్రులు, ఉద్యోగులు ఏపీఆర్‌ఓ వీరాంజనేయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అసిస్టెంట్ డైరెక్టర్ కె. లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ... క్రమశిక్షణ అంకితభావంతో వీరాంజనేయులు అత్యుత్తమంగా బాధ్యతలు నిర్వర్తించారని పేర్కొన్నారు. ఎప్పుడు ఎలాంటి మచ్చలేకుండా



మధ్యతరగతంగా పనిచేశారని తెలిపారు. కుటుంబ సభ్యులుగా కలిసిమెలిసి ఉద్యోగ బాధ్యత నిర్వహణలో నిత్యం పాలుపంచుకున్నామని తెలిపారు. మా శాఖ నుంచి ఒక కుటుంబ సభ్యులు పదవి విరమణ చేయడం బాధాకరమైనప్పటికీని, పదవి విరమణ ప్రతి ఉద్యోగికి తప్పనిసరి అని తెలిపారు.

**వీరాంజనేయులు అత్యుత్తమ సేవలతో సమాచార శాఖ కే మంచి పేరు అంకితభావం, నిబద్ధతకు మారుపేరు సమాచార, పౌర సంబంధాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె లక్ష్మణ్ కుమార్.**

**సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు, టీఎన్జీవో సంఘ ప్రతినిధులు, జర్నలిస్టుల ఘన సన్మానం.**

**ఉద్యోగానికి వన్నెతెచ్చిన వీరాంజనేయులు..**

టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి ప్రధాన కార్యదర్శి సంగెం లక్ష్మణరావు ఒక ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారదలిగా పనిచేసిన ఏపీఆర్‌ఓ వీరాంజనేయులు ఆ పదవికే వన్నెతెచ్చారని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంగెం లక్ష్మణరావు పేర్కొన్నారు. ఏపీఆర్‌ఓ వీరాంజనేయులు టీఎన్జీఓ సంఘం ప్రతినిధులుగా కలిసి వారు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఏపీఆర్వో వీరాంజనేయులు జిల్లాకు వచ్చి ఏడాది గడుస్తున్న సమాచార శాఖలో మంచి గుర్తింపు తీసుకొచ్చారని పేర్కొన్నారు. ఆయన శేష జీవితం కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు ఏపీఆర్‌ఓ వీరాంజనేయులు ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో టీఎన్జీవో సంఘం ప్రతినిధులు రాగి శ్రీనివాసు, రాజేష్ భరద్వాజ్, సర్దార్ హర్వీందర్ సింగ్, హస్గర్, సిద్దిపేట జిల్లా డిపిఆర్‌ఓ రవికుమార్, పెద్దపెల్లి ఇన్చార్జి డిపిఆర్‌ఓ జగన్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ ఉషారాణి, సమాచార, పౌర సంబంధాల శాఖ కార్యాలయ సిబ్బంది రాజకుమార్, బి భూమేశ్, శ్రీనివాస్, చిట్టెమ్మ, శివాని, ఆయేషా ముంతాజ్, తిరుపతి, జర్నలిస్టు మిత్రులు బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వాగేశ్వరీ ఇంజనీరింగ్ కళాశాలలో పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థుల అంతర్జాతీయ టెడ్ ప్రసంగం

**కరీంనగర్ బ్యూరో, జనవరి 31 (జనం సాక్షి) :**




స్థానిక నగరంలోని పారమిత హెరిటేజ్ పాఠశాల టెడ్ ఎడ్ క్లబ్ ప్రసంగాలు తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీ లోని వాగేశ్వరీ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి వాగేశ్వరీ విద్యాసంస్థల జనరల్ సెక్రటరీ డా. జి. శ్రీనివాస్ రెడ్డి , పారమిత విద్యాసంస్థల అధినేత డా.ఇ.ప్రసాద రావు ముఖ్య అతిథులుగా విచ్చేసి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పారమిత పాఠశాల నుండి ఆరుగురు విద్యార్థులు 8 వ తరగతికి చెందిన విద్యార్థులు పి.తను శ్రీ శారీరక భాష, ఎ.స్నితిక ఆలోచనలకు ఎప్పటికీ విశ్రాంతి లేదు , సి.లాలిత్య సమాచార గోప్యత, సయ్యద్ జక్వాన్ కృత్రిమ మేధ, 9 వ తరగతికి చెందిన యస్.అక్షయసాయి నృత్యం సమాజాన్ని ఎలా సానుకూలంగా ప్రభావితం చేస్తుంది, యం.అను శ్రీ ఎంపిక చేసుకునే కళ అనే అంశాలపై వారి టెడ్ టాక్స్ ని అద్భుతంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వాగేశ్వరీ విద్యాసంస్థల జనరల్ సెక్రటరీ డా. జి.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... పాఠశాల దశలోనే విద్యార్థులు ప్రపంచ వేదికపై మాట్లాడేలా శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్న పారమిత విద్యాసంస్థలను ప్రత్యేకంగా అభినందించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పాలనాధికారి వాగేశ్వరీ విద్యాసంస్థల జనరల్ సెక్రటరీ డా. జి.శ్రీనివాస్ రెడ్డి పారమిత విద్యాసంస్థల అధినేత డా.ఇ.ప్రసాద రావు, టెడ్ క్యురేటర్ కె. హన్మంతరావు, పారమిత విద్యాసంస్థల డైరెక్టర్లు అనూకర్ రావు, టి.యస్.వి.రమణ, వాగేశ్వరీ విద్యాసంస్థల డైరెక్టర్లు డి.శ్రీనివాస్ రెడ్డి, వి.వినోద్ , సి.హెచ్.ప్రకాష్ రెడ్డి, ప్రిన్సిపాల్ సి.హెచ్.శ్రీనివాస్ రావు, వివిధ విభాగాల అధిపతులు, ప్రొఫెసర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి

**కరీంనగర్ బ్యూరో, జనవరి 31 (జనంసాక్షి) :**



**ఉద్యోగ నిరుద్యోగ పట్టభద్రులకు బాసటగా ఉంటా**

**మొదటి ప్రధాన్యత ఓటు వేసి గెలిపించండి.**

**కరీంనగర్ జిల్లా కేంద్రంలో అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి విస్తృత ప్రచారం.**

రానున్న పట్టవధ్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను భారీ మెజారిటీతో గెలిపిస్తే ప్రైవేటు విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు హెల్త్ కార్డుల మంజూరుకు కృషి చేస్తానని కరీంనగర్, అదిలాబాద్, నిజామాబాద్ మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా వి.నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం కరీంనగర్ జిల్లాకేంద్రంలో పలువురు పట్టబద్రులను కలిసి రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మద్దతు పలకాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉద్యోగ నిరుద్యోగపట్టభద్రులకు బాసటగా నిలిచేందుకే ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నాననివెల్లడించారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల యజమానిగా నేను ఎంతో మంది విద్యార్థులను విద్యావంతులుగా తయారు చేశానన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రంధాలయాల్లో వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగుల సౌకర్యార్థం ప్రభుత్వం పక్షాన మధ్యాహ్న భోజనం ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. పట్టభద్రుల సంక్షేమానికి , ఉద్యోగ నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి ఒక విద్యావేత్తగా నిస్వార్థంగా సేవ చేయడానికి ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నట్టు తనను భారీ మెజారిటీతో గెలిపించాలనికోరారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న హెల్త్ కార్డు తో పాటు మినిమం బేసిక్స్ సాలరీ అమలుకు కృషి చేస్తానని అన్నారు. ప్రైవేటు డిగ్రీ పీజీ కళాశాలల యజమాన్యాలు నిధులు విడుదల కాక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వారి సమస్యల పరిష్కారానికి ఒక పెద్దన్నలానిధుల విడుదలకు సహకరిస్తానని వెల్లడించారు.

నిరుద్యోగుల సమస్యల నిర్మూలించేందుకు ఒక సదుద్దేశంతో పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నానని తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలల యజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. నిరుద్యోగ యువతకు అండగా ఉంటూ ఉద్యోగ రూపకల్పనలో భాగస్వామ్యం అవుతూ ఒక పెద్దన్న పాత్ర పోషిస్తానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిన జాబ్ క్యాలెండర్ ను అమలు చేసే విధంగా కృషి చేస్తానని పేర్కొన్నారు. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు అల్ఫోర్స్ ఆధ్వర్యంలో వి ఎన్ ఆర్ ఈ - వివిఎన్ ఆర్ క్లాసెస్ ధ్వారా ఆన్ లైన్ లో వీడియో క్లాసెస్ , టెస్ట్ పేపర్లు, స్టడీ మెటీరియల్ ను అందచేయడం జరుగుతుందని ఈ యాప్ ను డౌన్ లోడ్ కోసం క్యూ ఆర్ కోడ్ ను ఏర్పాటు చేయడం జరిగిందని ప్రతి నిరుద్యోగ యువత ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో గ్రంధాలయాల్లో బీసీ స్టడీ సర్కిల్ లో తన వంతుగా మరిన్ని మౌళిక సదుపాయాలు కల్పిస్తానని తెలిపారు. ఎమ్మెల్సీగా గెలిచినా తరువాత నిరుద్యోగ యువత కోసం ప్రతి జిల్లా కేంద్రంలో వివిఎన్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తానని తెలిపారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

# ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్‌కు వినతిపత్రం అందజేత

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 31 (జనం సాక్షి)**



ఏఐటియూసీ అనుబంధ సంఘం. మెడికల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్. ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ రామ్మోహన్. శ్రీ గణేష్ ఏజెన్సీ వారి నుండి నాలుగు నుండి ఐదు నెలల వేతనాలు ఇవ్వాలని శుక్రవారం వినతిపత్రం అందజేశారు.ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు పి బాలరాజ్ మెడికల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎల్. దశరథ్ మాట్లాడుతూ గత నాలుగైదు నెలలుగా శ్రీ గణేష్ ఏజెన్సీ ఎల్లారెడ్డి ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ పేషంట్ కేర్ సెక్యూరిటీ గార్డ్ వారి వేతనాలు లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, అదేవిధంగా కిరాయి ఇల్లు ఉన్నటువంటి కార్మికులు చెల్లించలేక పిల్లల స్కూల్ ఫీజులు కట్టలేక నిత్యవసర సరుకులు లేక ఇల్లు గడవలేని పరిస్థితి ఉన్నదని ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే ఆసుపత్రి కార్మికులకు వేతనాలు ఇవ్వాలని అదేవిధంగా పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు ఇవ్వాలని అదేవిధంగా పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యాన్ని పకడ్బందీగా అమలు చేయాలని అదేవిధంగా బకాయి ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని, వారు ఎల్లారెడ్డి డివిజన్ ఆసుపత్రి అధికారి డాక్టర్ కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది.

# నియోజకవర్గ అభివృద్ధి పై సీఎం రేవంత్‌ను కలిసిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్..

**గోదావరిఖని, జనం సాక్షి:**



రామగుండంలో 1x800 విద్యుత్ పవర్ ప్లాంట్ కు అతిత్వరలో పనులను ప్రారంభించాలని ముఖ్యమంత్రి ని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో కలసి రామగుండం అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు రామగుండం లో అమలు చేస్తున్న విధానం గురించి.. పెండింగ్ లో ఉన్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో ఎమ్మెల్యే చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రామగుండం అభివృద్ధి కోసం సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. రామగుండం అభివృద్ధి కోసం అండగా ఉంటామని హామీ ఇచ్చారని తెలిపారు. ఇలా రామగుండం అభివృద్ధి కోసం భరోసా ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రామగుండం ప్రజల పక్షాన ధన్యవాదాలు తెలిపిన మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్.

# లోను మొత్తం కట్టాక కట్టలేదంటున్న ఫైనాన్స్ అధికారులు

**స్టేషన్ ఘన్పూర్, జనవరి 31 (జనం సాక్షి)**

**మేనేజర్ ఫ్రాడ్ చేశాడు.. లోన్ కట్టాల్సిందే అన్న శ్రీరామ్ సిటీ ఫైనాన్స్ హౌసింగ్ పత్రాలు ఇవ్వకపోతే ఆత్మహత్యే శరణ్యమంటున్న బాధితుడు**



: లోను మొత్తం కట్టాక కూడా మేనేజర్ ఫ్రాడ్ చేశాడని, లోన్ కట్టాల్సిందే అని శ్రీరామ్ సిటీ ఫైనాన్స్ కాజీపేట వారు అంటున్నారని, డబ్బులు వాడుకున్న మేనేజర్ పై చర్యలు తీసుకొని ఎన్‌ఓసి పత్రాలు, హౌసింగ్ పత్రా లు ఇవ్వకపోతే ఆత్మహత్యే శరణ్యమని బాధితుడు గోనెల రాజు అన్నారు. మండల కేంద్రంలో గోనెల రాజు విలేకరులతో మాట్లాడుతూ స్టేషన్ ఘన్‌పూర్ పట్టణా నికి చెందిన తాను 2021 లో శ్రీరామ్ సిటీ ఫైనాన్స్ కాజీపేట బ్రాంచ్ లో 13 లక్షల హోం లోన్ తీసుకున్నా మని అన్నారు. 32 నెలలు ఈఎంఐ లు కట్టి మిగిలిన డబ్బులు వన్ టైం సెటిల్మెంట్ కింద 2023లో తొమ్మిది లక్షల రూపాయల చెక్కు, లక్ష రూపాయలు ఫోన్ పే ద్వారా అప్పటి మేనేజర్ రఘుకు చెల్లించడం జరిగిందన్నారు. లోను పూర్తయినట్టు ఎన్‌ఓసి ఇచ్చి హౌసింగ్ పత్రాలు ఇవ్వాలని కోరగా శ్రీరామ్ సిటీ ఫైనాన్స్ యాజమాన్యం ఎన్‌ఓసి పత్రం చెన్నై నుంచి రావాలని గత కొన్ని నెలలుగా జరిపారని ఆవేదన వ్యక్తం చేశారు. చెన్నై నుంచి వచ్చిన మేనేజర్ తమ ఇంటివద్ద లోను కాగితాలన్నీ పరిశీలించి గత మేనేజర్ ఫ్రాడ్ చేశాడని లోన్ కట్టాల్సిందే అని ఫైనాన్స్ వారు చెప్పడంతో వరంగల్ సీపీకి ఫిర్యాదు చేయడం జరిగిం ది అన్నారు. గత మేనేజర్ నుండి డబ్బులు కట్టిస్తామని శ్రీరామ్ సిటీడిస్ట్రిక్ట్ మేనేజర్లు బాండ్ పేపర్ రాసి ఇచ్చారన్నారు. గత ఆరు నెలలుగా హౌసింగ్ పత్రాలు ఇవ్వ కుండా తిప్పుకుంటున్నారని, ఫైనాన్స్ అధికారులు తనకు వెంటనే న్యాయం చేసి, డబ్బులు వాడుకున్న మేనేజర్ పై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్‌ఓసి తోపాటు ఇంటి పత్రాలు ఇవ్వకపోతే ఆత్మహత్యే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు.

# పట్టభద్రులు, టీచర్ల ఓటర్ నమోదు పెండింగ్ దరఖాస్తులను ఫిబ్రవరి 7 లోపు పరిష్కరించాలి

**ఎమ్మెల్సీ ఎన్నికల పై టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల అధికారి పమేలా సత్పతి.**

**కరీంనగర్ బ్యూరో, జనవరి 31 (జనం సాక్షి) :**




శాసన మండల సభ్యుల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలని ఎమ్మెల్సీ ఎన్నికల అధికారి పమేలా సత్పతి అన్నారు.

శుక్రవారం ఎమ్మెల్సీ ఎన్నికల అధికారి పమేలా సత్పతి ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని అదనపు కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ ద్వారా ఎమ్మెల్సీ ఎన్నికల పై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికల అధికారి పమేలా సత్పతి మాట్లాడుతూ, ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ పట్టభద్రులు, టీచర్స్ శాసన మండలి సభ్యుల స్థానానికి ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసిందని అన్నారు.

ఫిబ్రవరి 3న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవుతుందని, ఫిబ్రవరి 10 వరకు నామినేషన్ల స్వీకరణ, ఫిబ్రవరి 11న స్క్రూట్ ని ఫిబ్రవరి 13 లోపు ఉపసంహరణ గడువు ఉంటుందని, ఫిబ్రవరి 27న పోలింగ్ జరుగుతుందని, మార్చి 3న ఫలితాలు ఉంటాయని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి కట్టుదిట్టంగా అమలు చేయాలని, 24 గంటలు , 48 గంటలు, 72 గంటలలో తీసుకోవాల్సిన చర్యల పై రిపోర్ట్ అందించాలని అన్నారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన హోర్డింగులు, గోడ రాతలు, జెండాలు, ప్రకటనలు తొలగించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి నిబంధనలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అకౌంటింగ్ బృందాలు, ఎంసిసి బృందాలు, ఫ్లైయింగ్ స్క్వాడ్, వీ.ఎస్.టి , వీ.వి.టి మొదలగు బృందాలను వెంటనే ఏర్పాటు చేయాలని తెలిపారు. మండలాల్లో శుక్రవారం రోజు వరకు ఓటర్ నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను పరిగణలోకి తీసుకొని, పెండింగ్ ఉన్న పట్టభద్రులు, టీచర్స్ ఓటర్ నమోదు దరఖాస్తులను ఫిబ్రవరి 7 లోపు పరిష్కరించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్లు పరిశీలించాలని అన్నారు. ఎన్నికల నిర్వహణ సమయంలో ప్రచారానికి అవసరమైన అనుమతులను నిబంధనలను ప్రకారం జారీ చేయాలని, ఎన్నికల సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించేందుకు మాస్టర్ ట్రైనర్లను ఎంపిక చేయాలనీ అన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్లో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, కిరణ్, డిఆర్‌ఓ వెంకటేశ్వర్లు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.



# ప్రధాన ఉపాధ్యాయులు సాయిలును సన్మానించిన గ్రామస్తులు

**ఎడపల్లి, జనవరి 31 ( జనంసాక్షి )**

ఎడపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా సుదీర్ఘ సేవలు అందించి నేడు పదవీ విరమణ పొందిన సాయిలును శుక్రవారం అధికారులు, ఉపాధ్యాయ సిబ్బందితో పాటు గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ మేరకు ఎడపల్లి సర్పంచ్ ఆకుల మాధవి, ఉపసర్పంచ్ ఆకుల శ్రీనివాస్, ఎంపిటిసి గుంజరి మనిషా రెడ్డి, గ్రామ పెద్దలు మార రాజేందర్ గుప్తా, జొగ్గరి మోహన్ తదితరులతో పాటు గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

# వ్యాయామంతో దేహదారుఢ్యం, ఆరోగ్యం

## జిమ్ సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు



**మంథని, (జనంసాక్షి)**

మంథని నియోజక వర్గం పరిధిలోని కాటారం మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన జిమ్ నీ తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు శుక్రవారం ఉదయం ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. శరీర దారుఢ్యానికి జిమ్ ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రతి ఒక్కరూ తమకు అనుకూల సమయాన్ని బట్టి జిమ్ చేసినట్లయితే ఆరోగ్యంగా ఉంటారన్నారు. అలాగే ఎటువంటి అనారోగ్యం సమస్యలు తలెత్తవన్నారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు కి జిమ్ నిర్వాహకులు శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు యూత్ కాంగ్రెస్ నాయకులు మహిళా కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# గురుకుల టీచర్లకు 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలి

**డిప్యూటీ వార్డెన్ విధుల నుండి గురుకుల టీచర్లను మినహాయించాలి**

**తపస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి రమేశ**

**ఇబ్రహీంపట్నం, జనవరి 31(జనం సాక్షి)**



తపస్ మంచాల మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిధిలోని నోముల బీసీ గురుకులంను సందర్శించి తపస్ నూతన సంవత్సర క్యాలెండర్ మరియు డైరీలను పాఠశాల ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్ , వైస్ ప్రిన్సిపాల్ భరత్ కుమార్ లకు మరియు గురుకుల పాఠశాల ఉపాధ్యాయ బృందానికి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తపస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి రమేశ మాట్లాడుతూ గురుకుల టీచర్లకు ప్రతినెల వేతనాలు వారం నుండి పది రోజులు లేటుగా జమ అవుతున్నాయి కావున వారికి వెంటనే 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని, డిప్యూటీ వార్డెన్ విధుల నుండి గురుకుల టీచర్లను మినహాయించాలని, అసంబద్ధమైన గురుకుల పాఠశాలలో టైమింగ్స్ ని మార్చాలని, నైట్ కేర్ టేకర్ డ్యూటీ కోసం ప్రత్యేక సిబ్బందిని నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగులకు రావలసిన పిఆర్సిని ప్రకటించి, పెండింగ్ డిఏ లను విడుదల చేయాలని అన్నారు. ఈ కార్యక్రమం లో తపస్ మంచాల మండల కోశాధికారి చీర బాల్ రాజ్, తపస్ గురుకుల కన్వీనర్ రెడ్డగోని జంగయ్య, కో కన్వీనర్ రావుల మల్లేష్, గురుకుల బృందం జె.మధు, పి.మహేష్, కె.శంకర్, ఎం.వెంకటయ్య, మల్లేష్, నర్సింహా, సురేష్ రాథోడ్, జోసెఫ్, కాశయ్య, వేదకిరణ్, వినయ్, రవి, సూరయ్య, శ్రీనివాస్, పాల్గొన్నారు.

# వేసవిలో త్రాగునీటికి ఇబ్బందులు రావొద్దు..

**పది రోజులు ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమం చేపట్టాలి..**

**జిల్లాకలెక్టర్ రాహుల్ శర్మ..**

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):**



వేసవిలో త్రాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా రానున్న 10 రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమం నిర్వహించాలని జిల్లాకలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో గ్రామ పంచాయితీ, మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఓలు, ఎంపీఓలు, మిషన్ భగీరథ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాబోవు వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాలలో మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను అదేశించారు. ఫిబ్రవరి 1వ తేది నుండి 10 రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి గ్రామాలలో నిరుపయోగంగా ఉన్నబోర్లు, చేతి పంపులు, పైపులైను లీకేజీలు, కొత్త పైపులైన్లు ఏర్పాటు, గేట్ వాల్స్ లీకేజీలను గుర్తించి నివేదిక అందచేయాలని ఆదేశించారు. గ్రామాలలో మంచినీటికి సంబంధించి ఏదైనా సమస్య ఉండి మిషన్ భగీరథ ద్వారా నీరు సరఫరా జరగకపోతే ప్రత్యామ్నయంగా గ్రామాలలోని ప్రైవేటు బోరు వెల్స్, బావులను గుర్తించాలని సూచించారు. నీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో నీటి సరఫరాకు ట్యాంకర్లను పంపడానికి కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. గత వేసవిలో సమస్యలు ఎదురైన గ్రామాల్లోనే కాక అన్నిచోట్ల నీటి పంపులు, పైపులను తనిఖీ చేస్తారని, ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించి వచ్చే ఐదు నెలల పాటు నీటి సరఫరా సాగేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. తాగునీటి సరఫరాలో ఎదురవుతున్న అవాంతరాలను ఎప్పటికప్పుడు తెలుసుకునేలా గ్రామ, మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేయనున్నామని, ఈ కమిటీలతో పాటు అధికారులు సైతం క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలను గుర్తిస్తారని తెలిపారు. వీటిని పరిష్కరించడం ద్వారా నీటి సరఫరా ఇక్కట్లను అధిగమించేందుకు మిషన్ భగీరథ నీటి వినియోగంపై అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా రానున్న వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని, గతంలో మాదిరి సమస్యలు రాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యల పరిష్కారానికి శనివారం నుంచి 10వ తేదీ వరకు పరిశీలన చేపట్టనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి నారాయణరావు, మండల ప్రత్యేక అధికారులు, మిషన్ భగీరథ ఇంజినీరింగ్ అధికారులు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ఎంపిఓలు తదితరులు పాల్గొన్నారు.

# వైద్యం వికటించి వివాహిత మృతి





**టచ్ హాస్పిటల్ ముందు మృతురాలి బంధువుల ఆందోళన**

**చనిపోయిన గంట తర్వాత మెడిసిన్ తెప్పించారంటూ బంధువుల ఆరోపణ**

**మంచిర్యాల ప్రతినిధి, జనవరి 31 (జనంసాక్షి) :**

మంచిర్యాల పట్టణంలోని టచ్ ఆసుపత్రి ముందు మృతురాలు బంధువులు ఆందోళన చేపట్టారు. వైద్యుల నిర్లక్ష్యం మూలంగానే తమ రోగి మృతి చెందిందని , అప్పటివరకు బాగానే ఉందని చెప్పి రోగి మృతి చెందిందని చెప్పారని తమకు న్యాయం చేయాలని ఆసుపత్రికి ముందు ధర్నా చేపట్టారు. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం కన్నేపల్లి గ్రామానికి చెందిన రాజేశ్వరి అనే మహిళకు గుండె నొప్పి రావడంతో టచ్ ఆస్పత్రిలో జాయిన్ చేశారు. ఆస్పత్రి డాక్టర్లు పరీక్షలు నిర్వహించి అంజియో గ్రామ్ చేసి స్టంట్ వేశారని పేర్కొన్నారు. బ్లాక్ మూసుకో పోయిందని స్టంట్ వేసి ఆరోగ్యం నిలకడగానే ఉందని చెప్పారని రోగి బంధువులు అన్నారు. గురువారం రాత్రి స్టంట్ వేసిన తర్వాత రోగిని చూద్దామంటే బంధువులను లోనికి వెళ్లకుండా సిబ్బంది అడ్డుకున్నారని రాత్రి వెళ్తే రేపు ఉదయం చూడాలని చెప్పారని,శుక్రవారం ఉదయం వెళ్లి చూద్దాం అంటే వెళ్ళనివ్వలేదని రోగిని చూపించకుండానే వేలాది రూపాయల మందులు మాత్రం తెప్పించారని పేర్కొన్నారు . శుక్రవారం మధ్యాహ్నం 8 వేల మందులు తీసుకువచ్చి ఇచ్చిన పది నిమిషాలకే రోగి మృతి చెందిందని సిబ్బంది తెలిపారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము వెంటనే వెళ్లి చూసేసరికి రోగి శరీరం బ్లాక్ అయిందని మృతురాలి బంధువులు అన్నారు. గంట రెండు గంటల క్రితం చనిపోతే కాలయాపన చేసి మందులు తెప్పించి బిల్లులు కట్టించుకొని మృతి చెందిందని తెలిపారని ఆవేదన వ్యక్తం చేశారు . ఇలాంటి నిర్లక్ష్యంగా వైద్యం చేసి తమ బంధువు మృతికి కారణమైన ఆస్పత్రి డాక్టర్లపై చర్య తీసుకొని తమకు న్యాయం చేయాలని మృతురాలు బంధువులు డిమాండ్ చేశారు.

**ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు : ఆస్పత్రి వివరణ**

రాజేశ్వరి అనే పేషంట్ ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యేవరకు ఆమెకు 400 షుగర్ ఉన్నట్లు తమకు చెప్పలేదని పేర్కొన్నారు. గుండె నొప్పి రావడంతో ఆసుపత్రికి ఆలస్యంగా తీసుకువచ్చారని అన్నారు. అప్పటికే ఇతర హాస్పిటల్ తిరిగి మా ఆస్పత్రికి వచ్చారని తెలిపారు. అప్పటికి మేము స్పందించి అంజియో గ్రామ్ చేసి ఒక స్టంట్ వేశామని పేర్కొన్నారు. ఆసుపత్రిలో అడ్మిట్ చేసుకునే ముందు రిస్క్ ఉందని రోగి బంధువులకు తెలిపామని పేర్కొన్నారు. మజిల్ డ్యామేజీ అయిందని తెలిపారు . మేము ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం దక్కలేదని తెలిపారు ఇందులో ఆసుపత్రి డాక్టర్ల నిర్లక్ష్యం ఏమీ లేదని పేర్కొన్నారు.

# మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి

**మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్**

**మహబూబాబాద్ బ్యూరో, జనవరి 31(జనం సాక్షి):**



విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని మెనూ ప్రకారం అందజేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. మహబూబాబాద్ పట్టణ కేంద్రంలోని శనిగాపురం, కంకర బోర్డు జెడ్పిహెచ్ఎస్ పాటశాలలు, బాలికల ఆశ్రమ పాటశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు వడ్డిస్తున్న మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ఏజెన్సీ వారు సరఫరా చేసే సామాగ్రి నాణ్యత వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు. డైనింగ్ హాలును, కిచెన్ షెడ్ ను, తనిఖీ చేసారు. చుట్టూ పరిసరాలను పరిశుభ్రతను పాటిస్తూ విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలన్నారు. టాయిలెట్ల ను తనిఖీ చేసి శుభ్రంగా ఉంచాలని అన్నారు. పట్టణంలోని కంకరబోర్డు ప్రాంతంలోని జిల్లా పరిషత్ పాఠశాలను తనిఖీ చేసి మధ్యాహ్న బోజనం మెనో ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ప్రతి విద్యార్థి యొక్క సామర్థ్యాలను అంచనా వేస్తూ సబ్జెక్టుల వారీగా విద్యా బోధనలు అందించాలని సూచించారు. నూరు శాతం ఫలితాలను సాధించేందుకు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు నిత్యం కృషి చేయాలని తెలిపారు. ఈ తనిఖీలో సంబంధిత పాటశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

# ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

**రహదారి భద్రత మన అందరి బాధ్యత**

**జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**

**ములుగు బ్యూరో, జనవరి 31(జనం సాక్షి)**



సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, రహదారి భద్రత మన అందరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని రవాణా శాఖ కార్యాలయం నుంచి జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవం ముగింపు సందర్భంగా రహదారి సురక్ష అభియాన్-శ్రద్ధ రోడ్డు భద్రత అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అన్నారు. రహదారి భద్రత మన అందరి బాధ్యత సమాజిక బాధ్యతగా రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలు రక్షించాలని అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాలు జనవరి 1న ప్రారంభించిడం జరిగిందన్నారు. జిల్లా లో రవాణా శాఖ అధికారులు, ట్రాఫిక్ రూల్స్ పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. సామాజిక బాధ్యతగా రోడ్డు భద్రత లో ప్రజలు భాగస్వామ్యం అయితే ప్రమాదాలు నివారించ వచ్చని ఆయన తెలిపారు. వాహనాలను అందరూ జాగ్రత్తగా నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ సంబంధిత అధికారులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పొంచి ఉన్న ప్రమాదం


**మంగపేట జనవరి 31(జనంసాక్షి)**



మండల కేంద్రంలో 163 జాతీయ రహదారిపై భారీ గుంతలు ఏర్పడడంతో తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నామని వాహనదారులు తెలిపారు. ఈ జాతీయ రహదారి పై నిత్యం రాత్రి, పగలు అనే తేడా లేకుండా వందల సంఖ్యలో వాహనాలు రవాణా లను కొనసాగిస్తుంటాయి. భారీ గుంతల నడుమ వాహనాలు నడుపుతున్న సమయాల్లో ప్రమాదాలకు గురి అవుతున్నామని ఆవేదన వ్యక్తపరిచారు. మండల కేంద్రంలోని రైతు వేదిక నుండి బోరునరసాపురం గ్రామం వరకు ప్రమాద స్థాయిలో భారీ గుంతలు ఏర్పడ్డాయని వెంటనే సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులను పూర్తిచేయాలని వాహనదారులు కోరారు.

## ఆటోను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు...ఒకరు మృతి

**బోథ్ జనవరి 31(జనంసాక్షి) :**



ఆటోను ఆర్టీసీ బస్సు ఢీ కొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా మరికొందరికి తీవ్ర గాయాలు అయ్యాయి.. ఈ విషాదకర ఘటన మండలంలోని స్థానిక వేంకటేశ్వర ఆలయ సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది..స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నిర్మల్ జిల్లా చిట్యాల గ్రామానికి చెందిన ఏనుగు లక్ష్మరెడ్డి ఆటో లో తన కూతురుకి సన్నబియ్యం తీసుకొని ధన్నూర్ గ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో బోథ్ నుండి అదిలాబాద్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఆటోను ఢీ కొట్టింది.. ఈ ప్రమాదంలో లక్ష్మరెడ్డి స్పాట్ లో మృతి చెందగా,ఆటో డ్రైవర్ తో పాటు మరొకరు గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రాజకీయాలకతీతంగా ఆలయ అభివృద్ధి

**పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి**

**పరకాల, జనవరి 31 (జనం సాక్షి):**



దేవాలయాలు మనిషి మనిషిగా ముందుకు పోవడానికి దోహదపడతాయని, రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరు పనిచేయాలని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. శుక్రవారం పరకాల పట్టణం లోని శ్రీ కుంకుమేశ్వర స్వామి దేవస్థాన సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం చైర్మన్, ధర్మకర్తల మండలి సభ్యులను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరూ కలిసి సహకరించాలని, శ్రీ కుంకుమేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధికి కుల మతాలకు రాజకీయాలకతీతంగా సహకరించాలని కోరారు. పార్టీలకుఅతీతంగా ఆలయాన్ని అభివృద్ధి చేసుకొందాం అని,ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని అన్నారు ఆలయ కమిటీ సభ్యులుగా సేవ చేసే అవకాశం స్వయానా భగవంతుడే కల్పించాడని, పరకాల నియోజకవర్గ ప్రజల పైన కుంకుమేశ్వర స్వామి ఆశీస్సులు ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుంకుమేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యులు, ఏఎంసీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, పరకాల కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కోయ్యడ శ్రీనివాస్, మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# హెల్మెట్ ధరించాలి.. ప్రాణాలను రక్షించుకోవాలి..

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):**



వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ప్రాణాలను రక్షించుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా రవాణా, పోలీసుశాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన హెల్మెట్ అవగాహన మోటారు సైకిల్ ర్యాలీలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే పాల్గొన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రంలోని ఐడిఓసి కార్యాలయం నుండి గణేష్ చౌక్ మీదుగా డా బిఆర్ అంబేద్కర్ సెంటర్ వరకు కొనసాగిన ర్యాలీని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ జెండా ఊపి ప్రారంభించగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలు హెల్మెట్ ధరించి వాహనాలు నడిపి పలువురిని ఆకట్టుకున్నారు. అనంతరం డా బిఆర్ అంబేద్కర్ సెంటర్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ పలువురు డ్రైవర్లకు ఉచిత కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలను కాపాడుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. దేశంలో సగటున 70 శాతం రోడ్డు ప్రమాదాలలో ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారని, ఇది చాలా బాధాకరమని తెలిపారు. ప్రతి ద్విచక్ర వాహన దారులు విధిగా హెల్మెట్ ధరించాలని, ఇతర వాహనాలు నడిపే డ్రైవర్లు సీట్ బెల్ట్ ధరించి వాహనం నడపాలని సూచించారు. జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ జిల్లాలో వాహనదారులకు రోడ్డు భద్రత, హెల్మెట్ ధరించడంపై అవగాహన కల్పించడానికి హెల్మెట్ ర్యాలీ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. జిల్లాలో ఎక్కువగా బొగ్గు, ఇసుక లారీలు ఎక్కువగా తిరుగుతున్నాయని, రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా ద్విచక్ర వాహనదారులు గాయపడి మరణిస్తున్నారని తెలిపారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలను కాపాడుకోవచ్చు అని తెలిపారు.

యువత తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న ఆశలను, ఆశయాలను గుర్తు పెట్టుకుని, వేగ నియంత్రణ పాటించాలని ఎస్పీ సూచించారు. అంబేద్కర్ సర్కిల్ లో కళాకారులు హెల్మెట్ ధరించాలని అట, పాటలతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, రవాణా శాఖ అధికారి మహమ్మద్ సంధాని, అదనపు ఎస్పీ బోనాల కిషన్, డిఎస్పీ సంపత్ రావు, సిఐలు నరేష్ కుమార్, మల్లేష్, ఎస్ఐలు, సింగరేణి, జెన్కో అధికారులు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, బార్ అసోసియేషన్ సభ్యులు, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మావాల అడవుల్లో హైనా సీసీ కెమెరాకు చిక్కిన దృశ్యం

**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :**



దట్టమైన అడవుల్లో మాత్రమే కనిపించే క్రూరజంతువు హైనా మావాలా అడవుల్లో సీసీ కెమెరాలో ప్రత్యక్షమైంది. ఉమ్మడి జిల్లాలో మావాల హరితవనంలో సీసీ కెమెరా లో ఈచిత్రం శుక్రవారం కనిపించింది. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ గులాబ్ సింగ్ మాట్లాడుతూ జిల్లాలో ఎప్పుడో కొన్ని సంవత్సరాల క్రితం కనిపించకుండా పోయినహైనా తిరిగి మావాల అడవుల్లో కనిపించడం సంతోషంగా ఉందన్నారు. ఇవి దట్టమైన అడవుల్లో మాత్రమే ఉంటాయన్నారు.ఇవి పులులను సింహాలను సైతం వేటాడి తింటాయన్నారు. అలాంటిది జిల్లాలోకనిపించడం గొప్ప విషయం అన్నారు. సీసీ కెమెరాలు చెక్ చేసే క్రమంలో ఈ విషయం బయట పడిందన్నారు. హైనా రోడ్డు దాటుతుండగా కెమెరాకంట పడిందన్నారు. ఇంకా ఎన్ని హైనాలు ఈఅడవిలో ఉన్నాయో తెలుసుకోవడం జరుగుతుందన్నారు. వీటిని రక్షించేందుకు తగినచర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు.

## గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి ఆటంకాలు ఉండొద్దు..

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి)**



గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి ఆటంకాలు కలిగించొద్దని భూపాలపల్లి ఆర్డీఓ ఎన్ రవి అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని కాల్వపల్లి, గిద్దెముత్తారం గ్రామాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ నేషనల్ గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు ప్రారంభమైనందున పనులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూసుకోవాలని, రైతులు ఏదైనా సమస్య ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. నిబంధల ప్రకారం జిల్లాలో హైవే నిర్మాణ పనులు ప్రారంభమైనట్లు ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఎన్.హేమ రెవెన్యూ సిబ్బంది, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# మేము సైతం అంటూ కదిలిన ముస్లింలు

- ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా దీక్షలో పాల్గొన్న మహిళలు




రాజోలి, జనవరి 31 (జనంసాక్షి) : తాము సైతం ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ముస్లింలు కదిలొచ్చారు. పోరాట దీక్షకు మద్దతు తెలిపారు. దీక్షలో కూర్చున్నారు. ఇథనాల్ ఫ్యాక్టరీ వల్ల తమ గ్రామ సరిహద్దు ప్రాంతంలో ఏర్పాటు చేయడం తగ్గదని ఆ ఫ్యాక్టరీని తక్షణమే రద్దు పరచాలని లేదంటే తమ ప్రాణాలకు తెగించి పోరాటాలు చేస్తామని 9వ రోజు ముస్లిం సంఘం నాయకులు శుక్రవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. తమ గ్రామ సరిహద్దు ప్రాంతంలో ఇథనాల్ కంపెనీ వారి వ్యర్థపదార్థాల నిల్వల కోసం పనులు ప్రారంభిస్తున్నారని వాటిని వెంటనే నిలిపివేసి ఫ్యాక్టరీ అనుమతులను రద్దు చేయాలనీ కోరుతూ పది గ్రామాల రైతులు ఆరోపించారు. ఆ ఫ్యాక్టరీ వల్ల తమ ప్రాంతం వల్లకాడు అవుతుందని వ్యర్థపదార్థాల దుర్వాసన తాము భరించలేమని మనుషులతో పాటు పశువులు పక్షులు, బతకలేవని పంటలు పండవని ఆరోపించారు. ఎన్ని ఆటంకాలు వచ్చినా దీక్షను ఆపేది లేదని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జయరాం రెడ్డి, చిన్నయ్య, ఖాజా హుస్సేన్, మున్నాభాష, చాంద్ భాష, షుకూర్, సద్దాం, రంజాన్, మున్నా, ఖలీల్, బాడేషాబ్, షకీల్, ఖదీర్, ఎండీ హాసన్, అబ్దుల్లా, అన్వర్, సుభాన్, మైబు మరియు గోవిందమ్మ, పార్వతి, జ్యోతి, మంజుల, భాగ్య, మహేశ్వరి, సరోజ, సుజాత, శారద, ఎంకమ్మ, బజారమ్మ, రాములమ్మ,మహాదేవి, సత్యమ్మ, శశికళ, నారాయణ, బీమన్న, నరసిం హులు, శివ రాజేంద్ర ప్రసాద్, వీరన్న గౌడ్, మల్లేష్, అమృత రాజు,దానం, రంగన్న, హనుమంతు, వెంకటేష్, లింగన్న, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో 9,307 దరఖాస్తులు

- ఇందిరమ్మ ఇండ్ల కోసమే 7,100 దరఖాస్తులు
- రేషన్ కార్డుల కోసం 1,736
- దరఖాస్తులు స్వీకరించిన చిన్నారెడ్డి



హైదరాబాద్, జనవరి 31 (జనంసాక్షి) : మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 9,307 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్ , గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 211, విద్యుత్ శాఖ కు సంబంధించి 160, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 43, ప్రవాసి ప్రజావాణికి సంబంధించి 01 దరఖాస్తులు అందగా.. అందులో ఇందిరమ్మ ఇండ్ల కోసం 7,100 దరఖాస్తులు వచ్చాయి, పౌర సరఫరాల శాఖ కు సంబంధించి 1736 (రేషన్ కార్డులు) దరఖాస్తులు వచ్చాయి, ఇతర శాఖలకు సంబంధించి 56 దరఖాస్తులు అందాయి. రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్ కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులపై ఎండార్స్మెంట్ చేసి సంబంధిత అధికారులతో చిన్నారెడ్డి ఫోన్ లో మాట్లాడారు. పలు సమస్యలను తక్షణమే పరిష్కారం అయ్యే విధంగా చిన్నారెడ్డి చర్యలు తీసుకున్నారు.

### కులాంతర వివాహం చేసుకున్నవారి భద్రతకు

# ప్రత్యేక చట్టం తేవాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



హైదరాబాద్, జనవరి 31 (జనంసాక్షి) : కులాంతర వివాహం చేసుకున్న వారి భద్రతకు ప్రత్యేక చట్టం తేవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. తుంగతుర్తి మండలం అన్నారం గ్రామంలో జరిగిన కుల దురహంకార హత్యను తీవ్రంగా ఖండించారు. ఐదు నెలల క్రితం దళితుడైన వడ్లకొండ కృష్ణ, బీసీ కులానికి చెందిన భార్గవి కులాంతర వివాహం చేసుకున్నారని, దీంతో తమ కుటుంబ పరువు పోయిందనే నెపంతో భార్గవి కుటుంబ సభ్యులు కృష్ణను హత్య చేశారని గుర్తు చేశారు. ఈ నిందితులపై గతంలో అనేక కేసులున్నాయని, వీరిని అరెస్టుతోనే సరిపెట్టకుండా, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి, కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని, భార్గవికి ప్రభుత్వ ఉద్యోగం తో పాటు, భద్రత కల్పించాలని, కృష్ణ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. చట్టాలెన్నొచ్చినా కులాంతర వివాహం చేసుకున్నవారిపై హత్యలు, దాడులు, బహిష్కరణలు జరుగుతున్నా ప్రభుత్వాలు, రక్షణ వ్యవస్థలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కులాంత వివాహాలు చేసుకున్న వారి కోసం ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే 45 కుల దురహంకార హత్యలు జరిగాయని, కళారూపాలు, ఇతర ప్రసార సాధనాల ద్వారా ప్రజలను చైతన్యపర్చాలని, ఘటనలు జరిగిన వెంటనే నిర్ణీత కాల వ్యవధిలో విచారణ జరిపి వారికి భరోసా ఇవ్వాలని కోరారు.

# రాజకీయాలకు అతీతంగా పని చేయండి

- కేసీఆర్ పథకాలను కొనసాగించండి
- ఎమ్మెల్సీ కవిత డిమాండ్




హైదరాబాద్, జనవరి 31 (జనంసాక్షి) : సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయాలకు అతీతంగా పని చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో 'నీళ్లు – నిజాలు'పై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. నీటి విషయాల్లో రాజకీయం చేయడం మానేసి నిజాలు చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ బురద రాజకీయానికి గోదావరి వరదను కూడా తట్టుకొని మేడిగడ్డ బ్యారేజీ మేరునగధీరుడిలా నిలబడిందన్నారు. కేసీఆర్ పూర్తి చేసిన ప్రధాన ప్రాజెక్టుల్లో మిగిలి ఉన్న చిన్న చిన్న పనులను ప్రభుత్వం పూర్తి చేయాలన్నారు. రాజకీయాలకు అతీయంగా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజనీతజ్ఞతను ప్రదర్శించాలన్నారు. వైఎస్ఆర్ ప్రారంభించిన ఆరోగ్య శ్రీని కేసీఆర్ కొనసాగించారని.. కాంగ్రెస్ ప్రారంభించిన ఉపాధి హామీ పథకాన్ని బీజేపీ కొనసాగిస్తోందని గుర్తుచేశారు. అదే తరహాలో కేసీఆర్ ప్రారంభించిన పనులను సీఎం రేవంత్ రెడ్డి కొనసాగించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మిస్ గైడెడ్ మిస్సైల్‌లా పనిచేస్తున్నారంటూ వ్యాఖ్యలు చేశారు. "కేసీఆర్ శత్రువు అని రేవంత్ రెడ్డి అనుకుంటున్నారని.. కానీ మన జలాలను తరలిస్తున్న ఆంధ్రా పాలకులు మన శత్రువులని ఆయన గమనించాలి. ఆంధ్ర కేడర్‌లో పనిచేసిన ఆదిత్యానాథ్ దాస్‌ను బాధ్యతల నుంచి తొలగించాలి. కృష్ణ ట్రైబ్యునల్‌లో రాష్ట్రం తరఫున బలంగా వాదనలు వినిపించాలి" అని అన్నారు. కేసీఆర్ నాయకత్వంలో అవిశ్రాంతంగా పని చేస్తేనే కోటి ఎకరాల మాగాణంగా మారిందని చెప్పుకొచ్చారు. ఎంతో మంది మేధావుల, ఇంజనీర్ల కృషి ఫలితమే అనేక ప్రాజెక్టుల నిర్మాణమన్నారు. తెలంగాణ సమగ్రాభివృద్ధిలో నీటి వనరులు ఒక ప్రధాన అంశంగా పెట్టుకొని ముందుకెళ్లామని.. కానీ ఈ ప్రభుత్వం జలవనరుల రంగాన్ని విస్మిస్తోందని మండిపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో 60 ఏళ్లలో కేవలం 50 లక్షల ఎకరాలకు నీళ్లందించారని.. కానీ తెలంగాణ ఏర్పడిన తర్వాత పదేళ్లలో కోటి ఎకరాలకుపైగా నీళ్లందించామని వెల్లడించారు. కాలంతో పోటీ పడి ప్రపంచంలోనే అత్యద్భుతమైన కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ నిర్మించారన్నారు. కోటి 24 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రాజెక్టులను పూర్తి చేశామని ఎమ్మెల్సీ తెలిపారు. ఇన్నాళ్లు కాంగ్రెస్, టీడీపీలే అన్యాయం చేశాయనుకుంటే... ఇప్పుడు వాటికి బీజేపీ తోడయ్యిందని విరుచుకుపడ్డారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు వద్ద కేంద్ర బలగాలను మోహరింపజేశారని.. కేసులు వేసి ప్రాజెక్టులను అడ్డుకున్న నీచమైన చరిత్ర కాంగ్రెస్ పార్టీది అంటూ విమర్శించారు. జలవనరుల విషయాల్లో ఇతర రాష్ట్రాల్లో పార్టీలకు అతీతంగా ఒక్కటవుతారని.. కానీ తెలంగాణ మాత్రం కాంగ్రెస్, బీజేపీ పార్టీలు రాజకీయం చేస్తున్నాయని ఆరోపించారు. కేసీఆర్ నిర్మించిన ప్రాజెక్టులు పనికిరావని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. నీళ్లు ఇవ్వక రైతుల పొట్టకొడుతున్నారని విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి సొంత జిల్లా, ఇరిగేషన్ శాఖ మంత్రి సొంత జిల్లాలో పంటను ఎండగొట్టారన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే సీతారామ ఎత్తిపోతల పథకం పనులు దాదాపు పూర్తి అయ్యిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని ఆర్భాటంగా ప్రారంభించినా ఆ ప్రాజెక్టు ద్వారా చుక్క నీరు కూడా ఇవ్వలేదని ఎమ్మెల్సీ కవిత విమర్శలు గుప్పించారు.

# ఎక్సైజ్ అకాడమీలో మంత్రి జూపల్లి ఆకస్మిక తనిఖీ

- అకాడమీ పనితీరుపై ఆరా తీసిన జూపల్లి



హైదరాబాద్, జనవరి 31 (జనంసాక్షి) : బండ్లగూడలోని ఎక్సైజ్ అకాడమీలో ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆకస్మిక తనిఖీ చేశారు. అకాడమీ పనితీరును అధికారులు మంత్రికి వివరించారు. అకాడమీ అంతా కలియతిరిగిన మంత్రి ఆయా విభాగాల పనితీరు తెలుసుకున్నారు. అనంతరం ప్రస్తుతం అకాడమీలో శిక్షణ పొందుతున్న 129 మంది మంది మహిళా ట్రైనీ కానిస్టేబుళ్లతో సంభాషించారు. శిక్షణ తరగతుల్లో చెబుతున్న పాఠాలు, ఫిజికల్ ట్రైనింగ్ గురించి చర్చించారు. అకాడమీలో భోజనం ఎలా ఉందని? నీటి సమస్య ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. అకాడమీలో అందుతున్న సేవలు, అక్కడి సౌకర్యాలు, శిక్షణ తరగతులు, ఇతర అంశాల గురించి శిక్షణ పొందుతున్న ఎక్సైజ్ మహిళా కానిస్టేబుల్స్ ను అడిగి తెలుసుకున్నారు. ట్రైనీలను ఉద్దేశించి మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న పోటీని తట్టుకుని.. మీరంతా ఎంతో కష్టపడి, స్వయంకృషితో ఈ ఉద్యోగానికి ఎంపికయ్యారని అభినందించారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. సమాజానికి మేలు చేసేలా సేవలు అందించాలని, అంకితభావంతో పని చేయాలని కోరారు. సమాజ శ్రేయస్సుకు మాదకద్రవ్యాల నియంత్రణ ఎంతో ముఖ్యమని, గంజాయి, డ్రగ్స్, అక్రమ మద్యం, సారా అమ్మకాలు, రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టి, వాటి బారి నుంచి యువతను కాపాడేందుకు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. మంత్రి వెంట ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సయ్యద్ అలీ ముర్తజా రిజ్వీ, అబ్కారీ శాఖ కమిషనర్ చేవూరు హరికిరణ్ ఉన్నారు.

### మా నాన్న ఆశీర్వాదం వల్లే

# పద్మభూషన్ వచ్చింది

- సొంత లాభం కొంతమానుకొని సమాజం కోసం చేయాలి : నందమూరి బాలకృష్ణ



హైదరాబాద్,జనవరి31(ఆర్ఎన్ఎ): మా నాన్న గారి ఆశీర్వాదం వల్లే పద్మ భూషణ్ వచ్చింది' అని నందమూరి బాలకృష్ణ అన్నారు. శుక్రవారం నాడు బసవతారకం ఆస్పత్రిలో బాలయ్యకు సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. పద్మ భూషణ్ తనను వరించిందన్నారు. పదవులు మనకు అలంకారం కాదని.. మనకు పదవులు అలంకారం కావాలని అన్నారు. తాను ఎప్పుడూ ఏదీ ఆశించి చేయలేదన్నారు. ఇది తన నాన్న ఆశీర్వాదం అని పేర్కొన్నారు. ఇలాంటి సన్మానాలు మరింత బాధ్యతను పెంచుతాయని చెప్పారు. ఇంకా చాలా విషయాలు బాలయ్య మాట్లాడారు. 'నాకు వచ్చిన ఈ అవార్డు మీకు అందరికి వచ్చినట్లే. ఈ రోజు నాకు వచ్చిన అవార్డు రేపు మీకు రావచ్చు. స్వంత లాభం కొంత మానుకొని సమాజం కోసం పని చేయండి. వరుసగా నాలుగు సినిమాలు హిట్ అవటం, వరుసగా మూడుసార్లు గెలవటం, ఇప్పుడు ఈ అవార్డు రావడం సంతోషంగా ఉంది. నా కుటుంబం అయిన.. బసవతారకం, హిందూపూర్ నియోజకవర్గం ప్రజలు వారికి అవార్డు వచ్చినట్లు భావిస్తున్నారు. ఎన్నో జన్మల పుణ్యం అయితే ఇలాంటి కుటుంబం దొరుకుతుంది. కాలం మారుతుంది. కాన్సర్ పెరుగుతుంది. దానికి తగ్గట్లుగా మనం పయనించాలి. కొత్త మెషినరీస్‌కి స్వాగతం పలకాలి. మా అమ్మ గారి ఆశయం కోసం ఎంతో మందికి తక్కువ ఖర్చుతో వైద్యం చేస్తున్నాం. సహకారం అందిస్తున్న దాతలకి, ప్రభుత్వాలకి, బ్యాంకర్స్‌కి కృతజ్ఞతలు. కళారంగానికి చేసిన సేవలు మరువలేనిది. దానికి గుర్తింపే ఈ గొప్ప అవార్డు. ఏ సినిమా చేసినా ఎంతో ఆలోచించి చేస్తాం. ఈ అవార్డు మా నాన్న, అమ్మకి అంకితం. మా నాన్న ఎన్నో సేవలు చేశారు. ఆయనకి భారతరత్న రావాలి.' అని బాలకృష్ణ అన్నారు. పద్మ భూషణ్ అవార్డు అందుకున్న సందర్భంగా నందమూరి బాలకృష్ణకు బలవతారకం ఆస్పత్రిలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాలకృష్ణ, వసుంధర దంపతులు హాజరయ్యారు. బసవతారకం హాస్పిటల్‌లో అడ్వాన్స్‌డ్ రోబోటిక్ డివైస్ ఎక్విప్‌మెంట్‌ను బాలకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన బాలయ్య.. దీని ద్వారా అతి తక్కువ ఖర్చుతోనే అత్యంత తక్కువ పెయిన్‌తో ఖచ్చితమైన వైద్యం అందించే వీలుంటుందని చెప్పారు. రోబోటిక్ సర్జరీ ద్వారా క్యాన్సర్ రోగులు త్వరగా కోలుకుంటారని.. సంకల్పం, సేవ బలంతో ముందుకు సాగుతున్నామని బాలయ్య పేర్కొన్నారు.

### ఆన్ లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్‌లను

# ప్రమోట్ చేస్తే కఠిన చర్యలు

- ఆర్టీసీ ఎండీ సజ్జనార్



హైదరాబాద్, జనవరి31 (జనంసాక్షి) : విదేశీ బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్స్ తదితర యాప్‌లకు ప్రచారం చేస్తూ యువతను తప్పుదోవ పట్టిస్తున్నారు. రాష్ట్రంలో వీటిపై నిషేధం ఉన్నా.. అవేవీ పట్టనట్లుగా సోషల్ మీడియాలో డబ్బులకు కక్కుర్తిపడి ప్రచారం చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఇన్‌ఫ్లూయెన్సర్లు చెప్పడంతో గ్యాంబ్లింగ్ కు అలవాటైన వేలాది మంది యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. విదేశీ ఆన్‌లైన్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ యాప్‌లను ప్రమోట్ చేసే సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే హెచ్చరికలు చేసింది. మీ ఇన్‌ఫ్లూయెన్స్‌తో గ్యాంబ్లింగ్‌కు అమాయకుల జీవితాలు బలి చేయొద్దని హెచ్చరించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను టీజీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తాజాగా ట్వీట్ చేశారు. ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్‌లను ప్రమోట్ చేసే సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లపై కేంద్ర ప్రభుత్వం గతంలోనే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. యువతను ఆన్‌లైన్ పందేలు, జూదం వైపు పురిగొల్పితే వినియోగదారుల రక్షణ చట్టం–2019, ఐటీ చట్టం– 2000 సెక్షన్ 79 ప్రకారం నేరమని హెచ్చరించింది అని సజ్జనార్ పేర్కొన్నారు. అయినా కొంత మంది ఇన్‌ఫ్లూయెన్సర్లు తమ స్వలాభం కోసం ఇష్టారీతిన ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్ లను ప్రమోట్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుర్తుపెట్టుకోండి మీరంతా శిక్షార్హులు. మాకు లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు.. మేం ఏం చేసిన నడుస్తుందని అనుకుంటే పొరపాటే. సమాజ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని ఇప్పటికైనా ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్ లను ప్రమోట్ చేయడం ఆపండి. స్వార్థానికి పోయి అమాయకుల ప్రాణాలకు బాధ్యులు కాకండి అని సజ్జనార్ సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లకు తేల్చి చెప్పారు.

# మిషన్ భగీరథ తాగునీటి సరఫరాపై ఆరా తీయాలి

- ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ మూడు నెలలకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలి
- ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



ములుగు బ్యూరో, జనవరి 31 (జనంసాక్షి) : ఇంటింటికి వెళ్లి మిషన్ భగీరథ తాగునీటి సరఫరాపై ఆరా తీయాలని,ఫిబ్రవరి, మార్చి,ఏప్రిల్ మూడు నెలలకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మిషన్ భగీరథ వాటర్ సప్లై పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవికాలం సమీపిస్తున్నందున ముందస్తు చర్యల్లో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి మిషన్ భగీరథ వాటర్ సప్లై గురించి అడిగి తెలుసుకుని ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ మూడు నెలలకు గాను ప్రణాళికలు రూపొందించుకోవాలని అధికారు లను ఆదేశించారు. గత సంవత్సరం అనుభవంలో దృష్టి లో పెట్టుకొని వేసవిలో త్రాగునీటి సమస్యలు రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సమీపంలో ఉన్న బావులు, చెరువులు, హ్యాండ్ పంపులు, లోకల్ బోర్వెల్స్, ట్యూబ్ వెల్స్, వ్యవసాయ బోర్లు గుర్తించి ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో కే సురేష్ మిషన్ భగీరథ సిఈ వరంగల్, మల్లేశం ఎస్ఈ, ఆర్డబ్ల్యూఎస్ డీఈలు ఏఈలు, 9 మండలాల ఎంపీడీవోలు,ఎంపీలు, జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

# రేపు బీసీల రాజకీయ యుద్ధభేరీ సభ

- ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో నిర్వహణ
- ప్రముఖులకు ఆహ్వాన పత్రాల అందజేత



వరంగల్ ఈస్ట్, జనవరి 31 (జనం సాక్షి) : ఫిబ్రవరి 2, 2025 మధ్యాహ్నం 2 గంటలకు హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ గ్రౌండ్స్ లో నిర్వహించనున్న బీసీల రాజకీయ యుద్ధ భేరి సభను విజయవంతం చేయడానికి, ఆహ్వాన కమిటీ సభ్యులు మందల పరశు రాములు మరియు ధర్మపురి రాజగోవిందు ప్రముఖ రాజకీయ నాయకులకు ఆహ్వాన పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ శాసన మండలి ఉప సభాపతి డా. బండా ప్రకాశ్, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, జోగు రామన్న, తెలంగాణ శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే ఎన్. రాజలింగం, మాజీ మున్సిపాలిటీ చైర్మన్ జంగాం రాములు, ఎమ్మెల్సీ ఎల్. రమణ, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, గెల్లు శ్రీనివాస్ యాదవ్, మాజీ రాజ్యసభ సభ్యుడు రాపోలు ఆనంద్ భాస్కర్ ను వ్యక్తిగతంగా కలిసి సభకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడిన బీసీ మేధావులు, సమన్వయకర్తలు మందల పరశురాములు మరియు ధర్మపురి రాజగోవిందు , "బీసీ సామాజిక వర్గాల ఐక్యత, సమగ్ర అభివృద్ధి కోసం ప్రతి కుటుంబ సభ్యుడూ ఈ సమావేశానికి హాజరై విజయవంతం చేయాలి. ఐక్యత ఉంటే బీసీలకు అధికారంలో పాత్ర స్వయంగా లభిస్తుంది. ఈ సభ ద్వారా బీసీ నేతలకు, యువతకు కొత్త దిశను సూచించే అజెండాను రూపొందిస్తాం" అని పేర్కొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370